అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 29-06-2024
సంపుటి : 10 సంచిక : 180 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 16 పేజీలు వెల : 6.50



కంప్రెషర్ పేలి ఐదుగురు మృతి

సౌత్ గ్లాస్ పరిశ్రమలో భారీ ప్రమాదం

● 15 మందికి గాయాలు ● అంతా వలస కార్మికులే..

ముక్కలు ముక్కలుగా కార్మికుల శరీర భాగాలు

రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలో ఘటన

నవతెలంగాణ-షాద్‌నగర్

సౌత్ గ్లాస్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం భారీ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు వలస కార్మికులు మృతి చెందారు. మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌత్ గ్లాస్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఇతర రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. శుక్రవారం వారంతా కంప్రెషర్ గ్లాసులను ఒక క్రమ పద్ధతిలో అమరుస్తున్నారు. కంప్రెషర్‌కు డోర్ లాక్ పడక.. ప్రెజర్ ఎక్కువ కావడంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో బీహార్ రాష్ట్రానికి చెందిన చిత్తరాంజన్(25), రాం ప్రకాష్(45), రావుకాంత్(25), ...5లో



సీఎం దిగ్భ్రాంతి

బాధితులకు అండగా ఉండాలి

క్షతగాత్రులకు వైద్య సేవలందించాలి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

5లో..



వేలం ఆపాలి

సింగరేణికి నేరుగా గనులు కేటాయించాలి

● సంస్థ నిర్వీర్యానికి కేంద్రం యత్నం ● ప్రజల ఆస్తులను ప్రయివేటుకు అప్పగించడంపై ఆగ్రహం

● శ్రావణపల్లి బ్లాకును సింగరేణికే ఇవ్వాలి ● రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) నిరసన ప్రదర్శనలు


నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన బొగ్గు గనుల వేలం పాటను తక్షణమే ఆపేసి సింగరేణికి నేరుగా గనులను కేటాయించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) శ్రేణులు నినదించారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణిని నిర్వీర్యం చేసే చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సహజ సంపద, ప్రజల ఆస్తులను ప్రయివేటుకు అప్పగించడం సిగ్గుచేటన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ పట్టణం నటరాజ్ సెంటర్‌లో పెద్దఎత్తున మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు కేటాయించడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజె రమేష్ పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో ప్లకార్డ్స్ పట్టుకుని నిరసన ...5లో

పార్లమెంట్‌కు నీట్ సెగ

చర్చకు పట్టుపట్టిన ప్రతిపక్షాలు / అంగీకరించని మోడీ సర్కార్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నీట్ పేపర్ లీక్ అంశం పార్లమెంట్‌ను కుదిపేసింది. ఈ అంశంపై చర్చ జరపాలని ప్రతిపక్ష ఇండియా ఫోరం సభ్యులు డిమాండ్ చేయడంతో శుక్రవారం ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. రాజ్యసభలో కూడా ఇదే తీరు కనిపించింది. ఉదయం 11 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కాగానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ చర్చను లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించిన వెంటనే ప్రతిపక్షాలు సభలో నీట్ అంశాన్ని లేవనెత్తాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చను నిలిపివేసి.. నీట్ పరీక్షపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని పట్టుబట్టాయి. నీట్ పరీక్షలపై సభలో చర్చించాలని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఇరు వైపుల నుంచి విద్యార్థులకు సందేశం ఇవ్వాలని ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం, ప్రతిపక్షాల వైపు నుంచి నీట్ పరీక్షపై విద్యార్థులకు తెలియజేస్తామని రాహుల్ అన్నారు. నీట్‌పై ప్రత్యేక చర్చ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం చేపట్టడానికి ముందు ఎటువంటి వాయిదా తీర్మానాలను స్వీకరించరని తెలిపారు. కానీ ప్రతిపక్ష ఎంపీలు మాత్రం తమ పట్టువీడలేదు. నీట్‌పై చర్చ చేపట్టాల్సిందే అంటూ నినాదాలు చేయడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో సభను 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. ఆ తరువాత తిరిగి సభ ప్రారంభమైనప్పటికీ

ఉభయ సభల్లో వాయిదాల పర్వం

సభలో మాట్లాడుతుండగా రాహుల్ మైక్ కట్

ఎలాంటి మార్పు లేదు. ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు.

రాజ్యసభలోనూ..

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నీట్ అంశంపై చర్చకు పట్టుబడుతూ ప్రతిపక్షాలు నినాదాలు చేశాయి. పేపర్ లీకేజీపై ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించారు. అయినప్పటికీ చైర్మెన్ ధన్‌ఖర్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టారు. సభ్యులు ఆందోళన కొనసాగిస్తుండటంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. కాగా, నీట్ వ్యవహారంలో ప్రభుత్వ తీరును కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ తప్పుబట్టారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రతిపక్ష ఇండియా ఫోరం సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారని, ఇక తాను క్రిమినల్ చట్టాల అమలు నిలిపివేయాలని కోరుతూ నోటీస్ ఇచ్చానని ఆయన పేర్కొన్నారు. అయితే వీటిపై చర్చ జరగకపోవడం విచారకరమని అన్నారు. ఇక దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీతో యువత భవిష్యత్ నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ దీపిందర్ సింగ్ హుడా ఆందోళన వ్యక్తం చేశారు. హర్యానాలో అత్యధికంగా పేపర్ లీక్ కేసులు వెలుగు చూశాయని చెప్పారు.నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకైతే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యతల నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. తాము ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చకు లేవనెత్తితే మైక్‌ను స్విచ్ఛాఫ్ చేశారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేత మైక్‌ను నిలిపివేయడంతో ప్రతిపక్ష ఎంపీలు అసంతృప్తికి లోనై ప్రభుత్వ తీరును తప్పుపట్టారని చెప్పారు. కీలకమైన నీట్ అంశంపై సభలో చర్చ జరగాలని తాము పట్టుబట్టామని ఆయన పేర్కొన్నారు.




నిగ్గు తేల్చాల్సిందే

చర్చ జరగాల్సిందే : రాహుల్ గాంధీ డిమాండ్



నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకల అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టే ముందు ఈ అంశంపై లోతైన చర్చ జరగాలని అన్నారు. "యువత ఆందోళన చెందుతోంది. వారికి ఏం జరుగుతుందో తెలియదు. విద్యార్థుల ఆందోళనలను తగ్గించడానికి పార్లమెంటులో అధికార, ప్రతిపక్షాలు చర్చించాలి. వారిలో భయాందోళనలు తొలగించాలి. ఇది యువతకు సంబంధించిన సమస్య కాబట్టి, ఈ సమస్యపై లోక్‌సభలో గౌరవప్రదమైన చర్చ జరగాలని నేను ప్రధానిని కోరుతున్నాను. నీట్ పేపర్ లీకేజీపై చర్చ జరగాలని ఇప్పటికే ప్రతిపక్ష నేతలందరూ అంగీకరించారు. దేశ భవిష్యత్తు యువతది. వారికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలి" అని రాహుల్ గాంధీ కోరారు. ఆయన మాట్లాడుతుండగానే స్పీకర్ మైక్ కట్ చేశారు.

ప్రతిపక్షాలు ఏ అంశం లేవనెత్తినా సమగ్ర సమాచారం ఇస్తామని తాము స్పష్టంగా చెప్పినా ప్రతిపక్షాలు సభా కార్యకలాపాలకు అడ్డుపడటం విచారకరమని ...15లో



అదానీకి పాతబస్తీ కరెంటు వసూళ్లు

డిస్కంల ప్రయివేటీకరణ షురూ

దావోస్‌లో సీఎంతో అదానీ ఒప్పంద ఫలితం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఫ్రాంచైజీ రూపంలో అదానీ గ్రూప్‌కు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. ఈ మేరకు ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించినట్టు తెలుస్తోంది. పాతబస్తీలో విద్యుత్ పంపిణీ నష్టాలు ఎక్కువగా ఉన్నాయనీ, దాన్ని గాడినపెట్టేందుకు భూగర్భ లైన్లను వేస్తూ, 75 శాతం బిల్లు వసూళ్లను అదానీ కంపెనీకే అప్పగించాలని నిర్ణయించినట్టు సమాచారం. 2024 జనవరి 17న దావోస్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య సదస్సులో అదానీ గ్రూప్ అధినేత గౌతం అదానీ, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలో రూ. 12,400 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అదానీ గ్రూప్ నాలుగు ఒప్పందాలు చేసుకుంది. దానిలో భాగంగానే పాతబస్తీలో విద్యుత్ పంపిణీ ఫ్రాంచైజీ తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఢిల్లీలో ఆ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయినట్టు సమాచారం. దీనిపై ఆ కంపెనీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ వివరాలు వెల్లడించినట్టు తెలిసింది. దీనిపై సమగ్ర ప్రణాళికతో రావాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వారికి సూచించారని ప్రచారం జరుగుతోంది. డిస్కంలను ప్రయివేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం సుదీర్ఘకాలంగా రాష్ట్ర విద్యుత్ సంస్థలపై ఒత్తిడి తెస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. దావోస్ ఒప్పందంలో భాగంగా అదానీ ...15లో

జులై 18 నుంచి డీఎస్సీ రాతపరీక్షలు



ఆగస్టు 5 వరకు నిర్వహణ

ఆన్‌లైన్‌లో రోజు రెండు విడతల్లో

పూర్తిస్థాయి షెడ్యూల్ విడుదల

వివరాలు 7 లో..

నీట మునిగిన ఢిల్లీ



88 ఏండ్ల తరువాత రికార్డు వర్షపాతం

కూలిన విమానాశ్రయం టెర్మినల్ 1 పైకప్పు

ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు

వివరాలు 6 లో..

దొంగలతో కలిసెటోళ్ల గురించి బాధలేదు..



పార్టీనే నాయకులను తయారు చేస్తది :

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్

వివరాలు 15 లో..

హేమంత్ సోరెన్‌కు బెయిల్

తప్పు చేసినట్టు ఆధారాల్లేవ్ : హైకోర్టు



రాంచీ : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన ఇక్కడి బిర్సాముండా జైలు నుంచి విడుదలయ్యారు. పెద్ద సంఖ్యలో జెఎంఎం నాయకులు, కార్యకర్తలు జైలు ...6లో

వారం రోజుల్లో... పీసీసీ మార్పు మంత్రివర్గ విస్తరణ

కాంగ్రెస్ తరపున గెలిచిన వాళ్లకే మంత్రివర్గంలో చోటు

మూడు రోజుల్లో రుణమాఫీ గైడ్‌లైన్స్...

మండలాలు, జిల్లాల డి లిమిటేషన్‌పై త్వరలో కమిటీ

బీసీ కమిషన్ సభ్యుల నియామకం తర్వాత కులగణన

ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆషాడం ప్రారంభంలోపు పీసీసీ చీఫ్ మార్పు, మంత్రి వర్గ విస్తరణ చేపట్టేలా పార్టీ హైకమాండ్‌తో చర్చలు జరుపుతున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బీ ఫాంపై గెలిచిన వాళ్లకే మంత్రి వర్గంలో చోటు దక్కుతుందన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు తన మంత్రి వర్గంలో చోటు ఉండదని సంకేతాలు ఇచ్చారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్ష ఎంపికపై చర్చలు ప్రారంభమయ్యాయని, పార్టీ ...15లో

సెల్లుతో జేబుకు చిల్లు

మొబైల్ చార్జీల మోత.. జియో బాటలో ఎయిర్‌టెల్

త్వరలోనే వొడాఫోన్ ఐడియా దెబ్బ

ఆదాయాలు పెరిగినా భారీగా వడ్డింపు

వంద కోట్ల మంది బేజారు



దేశంలో ఇప్పటికే అధిక ధరలతో అల్లాడుతోన్న ప్రజలపై తాజాగా మొబైల్ కంపెనీలు చార్జీల బాదుడును ప్రారంభించాయి. రిలయన్స్ జియో తమ వినియోగదారులపై 25 శాతం వరకు అదనపు భారం మోపగా.. అదే బాటలో భారతీ ఎయిర్‌టెల్ నిర్ణయం తీసుకుంది. మరో ప్రయివేటు టెల్కో వొడాఫోన్ ఐడియా త్వరలోనే చార్జీల పెంపునకు సమాయత్తం అవుతోంది. దిగ్గజ మూడు టెల్కోల నిర్ణయాలతో దాదాపు 100 కోట్ల మంది వినియోగదారుల జేబులకు చిల్లు పడనుంది. వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ తొలి గిఫ్ట్ ఇదే కావడం గమనార్హం.

న్యూఢిల్లీ : టెలికం పరిశ్రమలో పోటీ, టెక్నాలజీ కోసం పెట్టుబడులు పెరిగాయనే సాకుతో ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో మొబైల్ నెట్‌వర్క్ కంపెనీలు టారిఫ్ ధరల పెంపును చేపట్టాయి. చివరి సారిగా 2021 డిసెంబర్‌లో దాదాపు 20 శాతం టారీఫ్‌లను పెంచాయి.

జియో మార్కెట్లోకి వచ్చిన 2016 చివర సమయంలో రూ.149కే అపరిమిత ఉచిత కాల్స్, డేటాను అందించింది. ఆ తర్వాత డేటాను తగ్గించడమే కాకుండా ఈ ప్లాన్ ధరను రూ.209కి చేర్చింది. తాజాగా 249కి పెంచింది. ఈ లెక్కన ఇకపై ఒక్కో వినియోగదారుడిపై ఏడాదికి కనీసం రూ.1200 భారం పెరిగినట్లు. ఇదే బాటలో మిగితా ప్రయివేటు టెల్కోలు ప్రయాణించాయి. చాపకింద నీరులా దాదాపుగా మూడు, నాలుగు సార్లు చార్జీలను పెంచాయి.

2024 ఫిబ్రవరి ముగింపు నాటికి రిలయన్స్ జియో 42.67 కోట్ల వినియోగదారులతో 40.18 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. భారతీ ఎయిర్‌టెల్ 38.26 కోట్లతో 32.97 శాతం వాటాను, వొడాఫోన్ ఐడియా 19.38 కోట్ల



వినియోగదారులతో 18.93 శాతం వాటాలను కలిగి ఉంది. 2024 మార్చి ముగింపు నాటికి జియోకు ప్రతీ వినియోగదారుడి నుంచి రాబడి (ఎఆర్‌పీయూ) రూ.181.7గా ఉంది. భారతీ ఎయిర్‌టెల్ ఎఆర్‌పీయూ రూ.209గా ఉంది. తాజా పెంపునతో ఆ కంపెనీలకు మరింత రాబడి పెరగనుంది.

పొంతన లేని లెక్కలు..

పలు ప్రపంచ దేశాల వినియోగదారల సగటు మొబైల్ బిల్ వ్యయంతో పోల్చితే భారత్‌లో తక్కువ ధరలు ఉన్నాయని టెలికం కంపెనీలు ప్రధాన వాదన. అందులో ప్రధానంగా సింగపూర్, మలేషియా, చైనా, ఫిలిప్పిన్స్, జపాన్, ఆస్ట్రేలియా, అమెరికా, ...15లో

ఐదేండ్లలో ఆదాయాలు రెట్టింపు

తమకు ఆదాయాలు సరిపోవడం లేదని.. చార్జీలు మరింత పెంచాల్సిన అవసరం ఉందని టెలికం కంపెనీలు పదే పదే చేస్తున్న ప్రకటనలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గత ఐదేళ్లలో వాటి ఆదాయాలు దాదాపు రెట్టింపు అయ్యాయి. ఆర్థిక సంవత్సరం 2018-19 నాటి ఆదాయాలతో పోల్చితే.. 2023-24లో టెల్కోల రెవెన్యూ ఏకంగా 87 శాతం పెరిగి రూ.2.39 లక్షల కోట్లకు చేరిందని గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ ఇటీవల వెల్లడించింది. 2023-24లో జియో స్థూల రెవెన్యూ 10.4శాతం పెరిగి రూ. లక్ష కోట్లకు చేరగా.. నికర లాభాలు 11.48 శాతం ఎగిసి రూ.20,607 కోట్లుగా ...15లో

జేటీసీపై దాడికి నిరసన

- రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో నిలిచిన సేవలు
- మద్దతు పలికిన ఉద్యోగ సంఘాల నాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) రమేష్‌పై దాడిని నిరసిస్తూ.. శుక్రవారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీఏ ఆఫీసుల్లో అధికారులు, సిబ్బంది పెన్‌డౌన్‌కు దిగారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ నిరసనకు అన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు తెలిపాయి. నిందితుడు ఆటో యూనియన్ నాయకుడు మహ్మద్ అమానుల్లాఖాన్‌ను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నిరసనలో గ్రేటర్ పరిధిలోని జేటీసీలు, డీటీసీలు, ఆర్టీవోలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. వీరికి మద్దతుగా టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్‌తో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొని వారికి మద్దతు ప్రకటించారు. ఆర్టీఏ అధికారులు, సిబ్బంది పెన్‌డౌన్‌తో అప్పటికే ఆర్టీఏ స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాలకు వచ్చిన వినియోగదారులు రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు. దాంతో రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ ఆర్టీఏ అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కమిషనర్‌తో చర్చల అనంతరం అధికారులు, ఉద్యోగులు పెన్‌డౌన్ ఆలోచనను విరమించుకుని.. రోజంతా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ ప్రజలకు సేవలందించారు. తమకు రక్షణ కల్పించాలని అధికారులు, ఉద్యోగులు కోరారు. ఇలాంటి వాతావరణంలో ప్రజలకు సేవలు అందించాలేమని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ సంఘాల మద్దతు..

జేటీసీ రమేష్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. చేపట్టిన నిరసనకు అన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు తెలిపాయి. ఖైరతాబాద్ ఆర్టీఏ అధికారులు, ఉద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : సీఐటీయూ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐకేపీ వీఓఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ అనుబంధం) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామనీ, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా డిమాండ్లను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల పనులే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న అన్నిరకాల సంక్షేమ పథకాలను వీఓఏలు విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. వీఓఏలకు సెర్ప్ నుంచి కేవలం ఐదువేల రూపాయల గౌరవ వేతనం మాత్రమే అందుతున్నదనీ, దాంతో ఒక కుటుంబం ఎలా గడుస్తుంది? అని ప్రశ్నించారు. ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్వీ. రమ మాట్లాడుతూ 20 ఏండ్ల నుంచి గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ఏర్పాటులో, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. వీఓఏల మీద ఏపీఎంలు, సీసీలు ఒత్తిడలకు గురి చేస్తూ పని భారం మోపుతున్నారని వాపోయారు. గ్రేడింగ్ పేరుతో జీతాలు రాకుండా ఆపేస్తున్నారనీ, ఇది సరైంది కాదని చెప్పారు. సెర్ప్‌తో సంబంధం లేని పనులు వారితో చేయించవద్దనీ, వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు సుమలత, సుధాకర్, అంజి, వెంకటయ్య రమేష్, వసియా బేగం, జ్యోతి, శోభారాణి, శరత్‌కుమార్, దుర్గయ్య, సీఐటయూ నాయకులు లక్ష్మీనారాయణ, రాజేందర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలి

- కేజీకేఎస్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లుగీత కార్మికులకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(టీజీకేజీకేఎస్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ, ఎక్సైజ్ శాఖ జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర ప్రతినిధి బృందం ఇప్పటికే రెండుసార్లు వినతి పత్రం ఇచ్చిందని తెలిపారు. కానీ ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిలో ప్రమాదం వలన వందలాదిమంది గీత కార్మికులు చెట్టుపై నుంచి పడి చనిపోతున్నారనీ, కొందరు వికలాంగులవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే 520 మంది ప్రమాదానికి గురయ్యారనీ, వీరిలో 76 మంది చనిపోయారంటే ఎంత ప్రమాదమో అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటి నివారణకు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చొరవతో టాడి కార్పొరేషన్ ఆధ్వర్యంలో సేఫ్టీ రోప్ 2022 లోనే రూపొందినప్పటికీ గత ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఈ ప్రభుత్వం కూడా జాప్యం చేస్తుందనీ, తక్షణమే గీత కార్మికులకు ప్రాణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. పది లక్షలు ఎక్స్ గ్రేషియా నెలరోజుల లోపు ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. మెడికల్ బోర్డు విధానం తొలగించలేదని గుర్తు చేశారు. ఎక్సైజ్ మినిస్టర్ జూపల్లి కృష్ణారావు తక్షణమే వీటిపై స్పందించాలని డిమాండ్ చేశారు. టాడి కార్పొరేషన్ నుండి ఇచ్చే తక్షణ సహాయం తీవ్ర జాప్యం జరిగిందనీ, వాటిని వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి కేటాయించిన రూ. 22.20 కోట్లతో నిర్మించిన నీరా కేఫ్‌ని ఎలాంటి సంబంధం లేని టూరిజం డిపార్ట్‌మెంట్ నుంచి తొలగించి టాడి కార్పొరేషన్‌కి అప్పగించాలని డిమాండ్ చేశారు. సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఆగస్టు 18 లోపు నిర్మించాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలనీ,50 ఏండ్లు నిండిన ప్రతి గీత కార్మికునికి రూ. నాలుగువేల పింఛన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలనీ, కుల గణన తక్షణం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని కేజీకేఎస్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీరమణ అధ్యక్షతన ఆఫీసు బేరర్ల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు, వి. వెంకట నరసయ్య, గౌని వెంకన్న, బాల్నె వెంకట మల్లయ్య, పామనగుళ్ళ అచ్చాలు, కార్యదర్శులు చౌగాని సీతారాములు, యస్. రమేష్ గౌడ్, బండ కింది అరుణ్ కుమార్, మడ్డి అంజిబాబు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 494 దరఖాస్తులు

- సమస్యలను అడిగి తెలుసుకున్న అధికారులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 494 దరఖాస్తులు అందాయని తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 125, హౌసింగ్ 43, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖలకు 71, హోం శాఖకు సంబంధించి 45, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 47, హోం శాఖకు సంబంధించి 42, ఇతర శాఖలకు సంబంధించి 48 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

హెచ్‌ఏఎల్ ఏవియానిక్స్ డివిజన్‌తో నిలోఫర్ ఆస్పత్రి ఎంఓయూ

- భవన నిర్మాణం, వైద్య పరికరాలకు రూ.10.22 కోట్ల సాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ ఏవియానిక్స్ డివిజన్ తో హైదరాబాద్ లకిడీకాపూల్‌లోని నిలోఫర్ ఆస్పత్రి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఓయూపై హెచ్‌ఏఎల్ జనరల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఉషారాణి సంతకాలు చేశారు. దీంతో ఆస్పత్రిలో ఓపీడీ భవన నిర్మాణానికి రూ.10.20 కోట్లు, వైద్య పరికరాలను సమకూర్చుకునేందుకు రూ.10.02 కోట్లను హెచ్‌ఏఎల్ నిలోఫర్ కు అందజేయనున్నది. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద హెచ్‌ఏఎల్ ఈ నిధులను అందజేస్తున్నదని తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం సీఎస్ఆర్ నిధులను ఇస్తున్నందుకు ఆమె హెచ్‌ఏఎల్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులు తెలుగు రాష్ట్రాల మహిళలు, శిశువులకే కాకుండా నిలోఫర్‌కు వచ్చే ఇతర రాష్ట్రాల మహిళలు, శిశువులకు ఉపయోగపడతాయని చెప్పారు.



మత్తులో 2.92 కోట్లమంది

- 10 ఏండ్లు.. 20 శాతం పెరిగిన వ్యసనపరులు
- భయపెడుతోన్న మాదకద్రవ్యాల వినియోగం : ఐక్యరాజ్యసమితి రిపోర్టు

న్యూఢిల్లీ : చిన్నా పెద్దా అనే తేడా లేకుండా మత్తులో మునిగి తేలుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నిషేధిత పదార్థమైన డ్రగ్స్ వినియోగం అనూహ్యంగా పెరుగుతోంది. ఓ వైపు మానవ సమాజ బలహీనతల్ని ఆసరాగా చేసుకుని భారీ స్థాయిలో అక్రమంగా విక్రయిస్తున్నా.. పాలకులు మాత్రం అరికట్టలేక పోతున్నారు. ఇప్పటివరకు మత్తులో సుమారు మూడు కోట్ల మంది మునిగితేలుతుంటే.. దశాబ కాలంలో 20 శాతం వ్యసనపరులు పెరిగారని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది.

గుల్లవుతున్న జీవితాలు..

డ్రగ్స్... దీనికి అనేక రూపాలు.. గంజాయి.. కొకెయిన్.. హెరాయిన్.. ఓపియాయిడ్స్.. ఇలా ఏ పేరుతో పిలిచినా వీటి పర్యావసనాలు మాత్రం జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. గతంలో పాన్‌మసాలాలు గుట్కాల వరకే పరిమితమైన ఈ మత్తు.. ఇపుడు హద్దులు దాటుతోంది. మాదకద్రవ్యాల నిరోధక శాఖాధికారులు డ్రగ్స్ సరఫరా చేసే అక్రమార్కులను పట్టుకోవటానికి ఎంత ప్రయత్నించినా, ఎన్ని సార్లు తనిఖీలు చేసినా సరఫరా మాత్రం ఆగటంలేదు. గుట్టుగా దందా కొనసాగుతోంది. యువత బలహీనతల్ని బానిసల్ని చేసుకుంటూ.. దేశ, ప్రపంచ భవిష్యత్‌ను అంధకారంలో పడేసే ఈ మత్తు పదార్థ వినియోగం గురించి ఐక్యరాజ్యసమితి డ్రగ్స్ అండ్ క్రైమ్ ఆఫీస్ (యూఎన్‌ఓడీసీ) వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ విడుదల చేసింది. దీని ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2022 నాటికి 29.2 కోట్ల మంది మాదకద్రవ్యాల వినియోగదారులున్నారు. ఒక దశాబ్దంలో దాదాపు 20 శాతం పెరిగినట్టు వారు అంచనా వేశారు. వీటిలో కొత్త సింథటిక్ ఓపియాయిడ్లు ఆవిర్భవిస్తూనే ఉన్నాయని నివేదిక తెలిపింది. వీటి వల్ల ఆరోగ్యంతో పాటు సామాజిక, పర్యావరణాలపై ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని వెల్లడించింది. గతంలో 2.28 కోట్ల మంది గంజాయి అత్యధికులు వినియోగిస్తుండగా, తర్వాతి స్థానాల్లో ఓపియాయిడ్లు (6 కోట్లు), యాంఫేటమిన్లు (3 కోట్లు), కొకెయిన్ (2.3 కోట్ల మంది) ఉన్నాయి. డ్రగ్స్ ఉత్పత్తి, అక్రమ రవాణా వల్ల పౌరసమాజంతో పాటు.. పర్యావరణంపై కలిగే ప్రభావాన్ని కూడా ఈ నివేదిక నొక్కి చెబుతోంది. అందువల్ల భావితరాలపై పేరెంట్స్ కన్నేసి ఉంచటంతో పాటు.. మత్తు విక్రయదారులను గుర్తించితే.. సమాజంలో మాదకద్రవ్యాలను కొంతమేర అయినా అరికట్టవచ్చని ప్రజాసంఘాలు అంటున్నాయి.

కాంగ్రెస్సే టార్గెట్

ఎమర్జెన్సీ పేరిట పార్లమెంట్‌లో స్పీకర్ ప్రసంగం

- ప్రధాన ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టే వ్యూహం
- పార్టీలకతీతంగా ఉండాల్సిన పదవి దుర్వినియోగం
- ఇదంతా మోడీ కనుసన్నల్లోనే
- రాజకీయ విశ్లేషకులు, నిపుణులు, మేధావుల ఆందోళన

న్యూఢిల్లీ : 18వ లోక్‌సభ కొలువుదీరి, స్పీకర్ ఎన్నిక ముగిసింది. స్పీకర్‌గా మళ్లీ ఓం బిర్లానే ఎన్నికయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్పీకర్ పదవికి జరిగిన పోటీలో ఎన్డీఏ నిలబెట్టిన ఓం బిర్లా విజయం సాధించారు. అయితే, లోక్‌సభను అధికార బీజేపీ తన ఆయుధంగా వాడుకుంటూ, స్పీకర్ పదవిని దుర్వినియోగం చేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు, మేధావులు అంటున్నారు. గతంలో జరిగిపోయిన ఎమర్జెన్సీ అంశాన్ని లేవదీస్తూ లోక్‌సభలో స్పీకర్ ప్రసంగించారు. ఇందులో ప్రజాస్వామ్యం, నియంతృత్వ ప్రమాదాల గురించి గంభీరమైన భావాలు వ్యక్తమయ్యాయి. అయితే, ఎమర్జెన్సీ వార్షిక దినం సమయంలోనే లోక్‌సభ సెషన్ జరగటమనేది ఉద్దేశపూర్వకంగానే జరిగిందని వీరు చెప్తున్నారు. ప్రభుత్వం, పార్టీలకతీతంగా ఉండాల్సిన స్పీకర్ ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని ప్రతిపక్షంలో ఉన్న అతిపెద్ద పార్టీ కాంగ్రెస్‌ను దెబ్బకొట్టారని అంటున్నారు. ఇది ప్రధాన ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టే వ్యూహమనీ, మోడీ సర్కారు లోక్‌సభ సమావేశాలను దుర్వినియోగపరుస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు.

ఎమర్జెన్సీకి మించిన పరిస్థితులు మోడీ పదేండ్ల పాలనలో కనిపించాయనీ, ప్రతిపక్షం లేకుండా కేవలం తమ ఆలోచనలనే ప్రయోగించాలన్న కాషాయపార్టీ తీరును గ్రమించిన దేశ ప్రజలు.. కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా ఉన్న 'ఇండియా' బ్లాక్‌కు 234 సీట్లను కట్టబెట్టారని చెప్తున్నారు. స్వేచ్ఛ, ప్రాథమిక హక్కుల విషయంలో మనం ఎక్కడున్నాం? భావ ప్రకటనా స్వేచ్ఛను అరికట్టేందుకు, మీడియాపై ఆంక్షలు విధించే కొన్ని చట్టాలు, నిబంధనలను మోడీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం వెనక్కు తీసుకుంటుందన్న సంకేతాలు ఏమైనా ఉన్నాయా? ఎమర్జెన్సీని తలపించే చర్యలను తిప్పికొడుతుందా? అని మేధావులు, విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. "ఆనాటి ప్రభుత్వం(ఎమర్జెన్సీ కాలంనాటి) తప్పులను, అత్యవసర పరిస్థితి నష్టాలను, ఘోరమైన తప్పులను మోడీ ప్రభుత్వం పునరావృతం చేయకూడదు. ఇటీవలి కాలంలో భావప్రకటన స్వేచ్ఛపై దాడి తీవ్రమైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీలు ప్రతిపక్ష నాయకులను ఎంపిక చేసుకోవటం, రాజకీయ ఖైదీలు, కార్యకర్తలు, జర్నలిస్టులను విచారణ లేకుండా జైలులో ఉంచడానికి కఠినమైన నిరోధక నిర్బంధ చట్టాలు, వారిపై అభియోగాలు మోపటం వంటివి కూడా ఇందులో ఉన్నాయి" అని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక హక్కుల విషయంలో కాంగ్రెస్‌పై దాడి చేయటం ద్వారా, ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్నలు లేవనెత్తడానికి ఐక్య ప్రతిపక్షం చేసే ఏ ప్రయత్నాన్నైనా తిప్పికొట్టడానికి ప్రభుత్వం స్పష్టంగా ప్రయత్నిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఈ విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ఏమైనా నిర్ణయం తీసుకుంటాయో వేచి చూడాలని వారు అంటున్నారు.



> ప్రస్తుతం ఢిల్లీలో తాగు నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఆపద సమయంలో కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం.. ఢిల్లీ సర్కారుకు సహకరించాల్సిందిపోయి, ఆ అంశాన్ని రాజకీయం చేస్తున్నది. తాగునీటిని కల్పించే బాధ్యత ఢిల్లీ ప్రభుత్వానిదనీ, ఇందులో కేజ్రీవాల్ సర్కారు పూర్తిగా విఫలమైందని బీజేపీ తన సోషల్ మీడియా ఖాతాల్లో విరివిగా ప్రచారం చేసుకుంటున్నది. అయితే, ప్రధాన స్రవంతి మీడియా ఈ సమస్య గురించి వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పటంలో విఫలమైందనీ, కొన్ని ఛానెళ్లు పని గట్టుకొని మోడీ సర్కారుకు అనుకూలంగా పని చేస్తూ కేంద్రం తప్పలను కప్పి పుచ్చే ప్రయత్నాలను చేస్తున్నాయని మేధావులు, సామాజికవేత్తలు ఆరోపిస్తున్నారు.

సమస్యలపై మీడియాలో వార్తలేవి?

ప్రజాస్వామ్య భారతదేశంలో మీడియా పాత్ర చాలా కీలకమైనది. ప్రభుత్వానికి ఒక ప్రతిపక్షంలా పని చేస్తూ, సమాజంలోని సమస్యలను పాలకుల దృష్టికి తీసుకొచ్చే ఒక సాధనమిది. అలాంటి మీడియా తన బాధ్యతను విస్మరిస్తున్నదనీ, సమస్యలపై దృష్టి సారించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిందిపోయి.. మీడియా పేరు చెప్పుకొనే కొన్ని సంస్థలు ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తున్నదా అని మేధావులు అంటున్నారు. ఉత్తర భారత్‌లో అధిక ఉష్ణోగ్రలు నమోదవుతున్నాయి. ప్రజలు తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, పేదలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు దేశంలో నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారు. కనీస వేతనాలకు నోచుకోలేకపోతున్నారు. అయినప్పటికీ, ప్రధాన స్రవంతి మీడియా మాత్రం ఈ సమస్యలను పట్టించుకోకుండా, ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అంటున్నారు. పేదల సమస్యలను పక్కనబెట్టి, పెద్దల బాధలనే చూపిస్తూ లాభార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయని చెప్తున్నారు మేధావులు. కరోనా మహమ్మారి కాలంలో మోడీ సర్కారు దేశంలో నమోదవుతున్న మరణాలను తక్కువ సంఖ్యలో చూపించే ప్రయత్నాన్ని చేయటం, ఆక్సిజన్ సిలిండర్లు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులను అనుభవిస్తుండటం వంటివి అనేకం చోటు చేసుకున్నా.. బాధ్యత కలిగిన మీడియా ఆ సమయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టే కథనాలను అందించలేకపోయింది.

జులై 4న దేశవ్యాప్త బంద్

నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకులకు నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నీట్, యూజీసీ నెట్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ జులై 4న దేశవ్యాప్తంగా విద్యార్థులు బంద్‌ను పాటించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిస్వాస్ ప్రకటన విడుదల చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో తన అసమర్థతను ప్రదర్శిం చిందని, తీవ్ర అవకతవకలు, వ్యత్యాసాలతో నీట్-పీజీ పరీక్షను వాయిదా వేసిందని తెలిపారు. జూన్ 4న ప్రకటించిన నీట్-యూజీ పరీక్ష ఫలితాలు పారదర్శకతకు విరుద్ధంగా ఉన్నాయని, పేపర్ లీక్‌ల ఫిర్యాదులు వెల్లువెత్తా యని పేర్కొన్నారు. దాని తరువాత లక్షలాది మంది విద్యార్థులు హాజరైన యూజీసీ నెట్ పరీక్షను పేపర్ లీక్ కారణంగా పరీక్ష తరువాత రద్దు చేశారని తెలిపారు. దీంతో వచ్చే వారంలో షెడ్యూల్ చేసే సీఎస్‌ఐఆర్ నెట్‌ను ఎన్టీఏ వాయిదా వేసిందని ఈ జాప్యంతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొ న్నారు. అంతేకాక నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినే షన్ ఫర్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈ) నేరుగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కింద కూడా పేపర్ లీకేజీలు, అక్రమాలకు సంబంధించిన ఎపిసోడ్ లను పేర్కొంటూ చివరి నిమిషంలో నీట్-పీజీ ప్రవేశ పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయిం చిందని పేర్కొన్నారు.

సీయూఈటీ, నీట్‌వంటి కేంద్రీకృత పరీక్షలు విద్యను ప్రయివేటీకరించడాన్ని, కోచింగ్ సెంటర్ల సంస్కృతిని పెంపొందించడాన్ని ప్రోత్సహిస్తున్నా యని, అట్టడుగు విద్యార్థులకు విద్య అందుబాటులో లేకుండా చేసిందని, దీంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాలుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 'వన్ నేషన్, వన్ ఎగ్జామ్' అనే ముసుగులో మొత్తం పరీక్షా వ్యవస్థ కుప్పకూలిందని, విద్యార్థుల విద్యా భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని విమర్శించారు.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) 25 మంది కంటే తక్కువ శాశ్వత సిబ్బందితో 25 పరీక్షలను నిర్వహిస్తుందని, అందువల్లే ఇలాంటి ఘటనలు ఉత్పన్నం అవుతున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితిని గుర్తించకుండా, కొంత మంది వ్యక్తులపై నిందలు మోపడంతో కేంద్ర విద్యా శాఖ బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్టీఏ, విద్యా మంత్రిత్వ శాఖ వైఫల్యానికి పూర్తిగా అసమర్థులని, అసమర్థులైన ఆర్ఎస్ఎస్ సభ్యులతో పని చేయడమే ఇందుకు కారణమని చెప్పారు.

ఉన్నత విద్యలో మాత్రమే కాకుండా, పాఠశాల విద్య పరిస్థితి దారుణంగా ఉందని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో గత దశాబ్ద కాలంలో సంబంధిత శాఖలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గడం, ఉపాధ్యాయుల కొరత, స్థూల నమోదు నిష్పత్తి తగ్గాయని పేర్కొన్నారు. "2018-19, 2021-22 మధ్య దేశంలో మొత్తం పాఠశాలల సంఖ్య 15,51,000 నుండి 14,89,115కి తగ్గాయి. 61,885 పాఠశాలలు మూసివేశారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గుదల, మరోవైపు ప్రయివేట్ పాఠశాలల సంఖ్య పెరుగుతోంది. ఇది అట్టడుగు వర్గాలకు పెద్ద ప్రశ్నగా మారింది" అని తెలిపారు. ఈ పరిస్థితిలో దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ జూలై 4న దేశవ్యాప్త బంద్‌ను నిర్వహించనుందని, విద్యార్థులు తరగతులను బహిష్కరిస్తారని, ప్రతి రాష్ట్రం, దేశ రాజధానిలో మార్చ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ బంద్‌లో విద్యార్థి లోకం పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

డిమాండ్లు

1. ఎన్టీఏ వ్యవస్థను రద్దు చేయాలి
2. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి.
3. ఇటీవల నీట్, యూజీసీ నెట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి.
4. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి.
5. ఇప్పటికే ఉన్న అడ్మిషన్ విధానాలను కేంద్రీకృత ప్రవేశ పరీక్షలతో భర్తీ చేసే ప్రయత్నాల నుంచి ఉపసంహరించుకోవాలి.
6. టీఐఎస్ఎస్ ముంబయి, ఐఐటీ ముంబయి నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వరకు - విద్యార్థి సంఘ నేతలపై వేట, యూనివర్శిటీల్లో స్వేచ్ఛా వ్యక్తీకరణ, ప్రజాస్వామ్యాన్ని అణచివేయడాన్ని ఆపాలి.
7. పాఠశాలల మూసివేతను ఆపాలి.

'భారతీయ న్యాయ సంహిత'

అమలును నిలిపివేయండి

- కేంద్ర హోం మంత్రికి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ లేఖ
- చర్చలు జరపాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ : భారతీయ న్యాయ సంహిత -2023 చట్టం అమలును నిలిపివేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య లేఖ రాసారు. ఈ చట్టంపై రవాణ పరిశ్రమలో సమాఖ్యలు, భాగస్వామ్యలు, ఇతరులతో చర్చలు జరపాలని కోరారు. జూలై 1 నుంచి ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకుని వస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ లేఖ రాసారు. హోం మంత్రికి రాసిన లేఖను శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. ఈ లేఖ ద్వారా న్యాయ సంహిత చట్టంలోని అనేక అంశాలను, సెక్షన్లను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. డ్రైవర్లపై నేరుగా ప్రభావం చూపే చట్టంలోని సెక్షన్ 106 (1), (2)లకు వ్యతిరేకంగా ఈ ఏడాది ప్రారంభంలో నిరసనలు, సమ్మె జరిగిన విషయాన్ని మంత్రికి మరోసారి గుర్తు చేశారు. సమ్మె రెండో రోజున ఎఐఎంటీసీ నాయకులతో కేంద్ర హోం శాఖ వ్యవహారాల కార్యదర్శి చర్చలు జరిపారని, ఈ చట్టం అమల్లోకి తీసుకుని రావడానికి ముందు ఏఐఎంటీసీతో సంప్రదింపులు జరుపుతామని హామీ ఇచ్చారని ఈ లేఖలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ గుర్తు చేసింది. అయితే తరువాత ఎలాంటి సంప్రదింపులు లేకుండానే సెక్షన్ 106(2)ను మినహాయించి ఈ చట్టంలోని అన్ని సెక్షన్లను జులై 1 నుంచి అమల్లోకి తీసుకుని వస్తున్నట్లు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిందని విమర్శించింది. కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేక మంది మేధావులు, సంస్థలు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ లేఖలు రాసాయిని ఈ సందర్భంగా ఎఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రస్తావించింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా 26న తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపింది. దేశవ్యాప్తంగా బార్ అసోసియేషన్లు, రాష్ట్ర బార్ కౌన్సిల్స్ నిరసనలు తెలిపాయని పేర్కొంది.

ఇప్పటి వరకూ ఇండియన్ పీనల్ కోడ్‌లోని ఒక్క సెక్షన్ (సెక్షన్ 104) ప్రకారమే యాక్సిడెంట్ కేసుల్లో జరిమానాలు, శిక్షలు విధించేవారని, ఇప్పుడు భారత న్యాయ సంహితలో దీనిని రెండు సెక్షన్లకు విస్తరించారని విమర్శించింది. కొత్త చట్టంలోని సబ్ సెక్షన్లు 106(1), (2) కింద యాక్సిడెంట్ కేసుల్లో ఐదేండ్ల నుంచి పదేండ్ల వరకూ శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపింది. ఐపీసీ సెక్షన్ 304 (ఎ) కింద ఇప్పటి వరకూ 6 నెలల జైలు శిక్ష మాత్రమే విధిస్తున్నారని తెలిపింది. రోడు ప్రమాదాలకు కేవలం డ్రైవర్లు మాత్రమే కాకుండా ఇంకా అనేక అంశాలు కారణమవుతున్నాయని, వాటిపై వివరణాత్మక చర్చలు, దిద్దుబాటు చర్యలు, విధాన నిర్ణయాలు జరగాల్సి ఉందని లేఖలో తెలిపింది. తమ యొక్క మంచి బుద్ధితో ఈ నోటిఫికేషన్‌ను పక్కన పెట్టాలని కేంద్ర మంత్రిని ఈ లేఖ ద్వారా ఎఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అభ్యర్థించింది. అలాగే రవాణా రంగంలో భాగస్వామ్యులు, ఇతరులతో చర్చలు జరపాలని కోరింది.

పరస్పర దూషణలు, ఆరోపణలతో

బైడెన్, ట్రంప్ ముఖాముఖి



వాషింగ్టన్ : గత అధ్యక్ష ఎన్నికల్లో తీవ్ర స్థాయిలో గందరగోళం తర్వాత మొదటిసారిగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2024 ఎన్నికలకు సంబంధించి గురువారం ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం ఈ చర్చలు జరిగాయి. చర్చా వేదికపైకి రాగానే కరచాలనం కూడా చేసుకోకుండానే ఇరువురు నేతలు ఆశీనులయ్యారు. దాదాపు 90 నిముషాల పాటు సాగిన చర్చ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పర ఆరోపణలు గుప్పించుకోవడంతో పాటూ తరచుగా వ్యక్తిగత దాడులకు, దూషణలకు దిగడం కనిపించింది. అమెరికా అధ్యక్షుడిగా నువ్వు పనికిరావంటే నువ్వు పనికిరావని పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు.

అమెరికా రాజకీయాల్లో వృద్ధనేతలు ఎక్కువవుతున్న నేపథ్యంలో విధానపరమైన అంశాలపై దృష్టి కేంద్రీకరించడం కన్నా ఇరువురు అభ్యర్థుల శారీరక పరిస్థితుల పట్ల ప్రజలు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించినట్లు కనిపించిందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటువంటి టివి చర్చలు రియాల్టీ షోల వంటివని, విధానాల సమర్ధత గురించి లేదా ఎవరి విధానాలు ఉన్నతమైనవి అనే అంశాలపై పోటీ తక్కువగా వుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అభ్యర్థులు అక్కడికక్కడ వ్యవహరించే తీరు ప్రాధాన్యత వహిస్తుందని అంటున్నారు.

అమెరికా ఆర్థిక విధానం, ఇమ్మిగ్రేషన్, సరిహద్దు అంశాలు, గర్భస్రావ హక్కులు, విదేశాంగ విధానం, ఆరోగ్య సంరక్షణ, వాతావరణ మార్పులు ఇలా విస్తృతాంశాలు చర్చకు వచ్చాయి.

అమెరికా చరిత్రలోనే అత్యంత అధ్వాన్నమైన అధ్యక్షుడు బైడెన్ అని ట్రంప్ విమర్శించగా, ట్రంప్‌ను దోషి అని బైడెన్ విమర్శించారు. చర్చ సందర్భంగా బైడెన్ చాలాచోట్ల మాట్లాడింది అస్పష్టంగా వుండి అర్థం కాలేదు. బైడెన్ పనితీరుపై డెమోక్రాట్లు నిరాశ చెందారు. బైడెన్ కన్నా ట్రంప్ ఎక్కువ సేపు మాట్లాడారు. అయితే నేరుగా అడిగిన కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో విఫలమయ్యారు. అతిశయోక్తితో కూడిన, అబద్ధాల పుట్టలా ఆయన ప్రకటనలు వున్నాయి. ఈ చర్చ పూర్తి స్థాయిలో విఫలమైందని అనేకమంది టెలివిజన్ వీక్షకులు సోషల్ మీడియాలో విమర్శించారు. సమయం వృధా తప్ప మరేమీ లేదన్నారు. అమెరికా భవితవ్యం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

మరోసారి నేతల మధ్య జరిగే ఇలాంటి చర్చల పట్ల అమెరికన్ ఓటర్లు ఉత్సాహంగా లేరని పలు పోల్స్ వెల్లడిస్తున్నాయి. గత 30ఏళ్ళలో ఎన్నడూ లేని రీతిలో ఇరువురు అభ్యర్థుల పట్ల కూడా ఓటర్లు వ్యతిరేకతే కలిగి వున్నారు. రెండో చర్చ సెప్టెంబరు 10న జరగనుంది.

మహారాష్ట్ర తలసరి ఆదాయానికి గుజరాత్ గండి

- పరిశ్రమల తరలింపు ఎఫెక్ట్
- అగ్రస్థానంలో తెలంగాణ

ముంబయి : మహారాష్ట్ర ప్రజల తలసరి ఆదాయాల పెరుగుదలకు గుజరాత్ గండి కొడుతోంది. తలసరి ఆదాయాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. మహారాష్ట్ర ఆరో స్థానానికి పడిపోయింది. వెనుకబడిపోతోంది. మహారాష్ట్ర ఎకనామిక్ సర్వే 2022-24 ప్రకారం.. తలసరి ఆదాయంలో రూ. 3,11,649 తో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. తర్వాత స్థానాల్లో రూ.3,04,474తో కర్ణాటక, రూ.2,96,592తో హర్యానా నిలిచాయి. తమిళనాడు రూ.2,75,583తో, గుజరాత్‌లో రూ.2,73,558గా ఉంది. మహారాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,52,389గా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్ రూ.2,19,881తో, ఉత్తరప్రదేశ్‌లో తలసరి ఆదాయం రూ.83,636గానే ఉండటం విశేషం. 2014లో మహారాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,25,260 కాగా, గుజరాత్‌ది రూ.1,13,139గా ఉంది. కాగా.. 2024 నాటికి మహారాష్ట్ర ఆదాయం రూ.2,52,389గా.. గుజరాత్‌లో తలసరి రూ.2,73,558కు పెరగడం విశేషం.

"మహారాష్ట్ర కంటే గుజరాత్ ఎలా పుంజుకుందో ఈ సంఖ్యలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. పారిశ్రామిక నైపుణ్యానికి పేరు గాంచిన మహారాష్ట్ర తలసరి ఆదాయంలో ఒకప్పుడు స్థిరంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచింది. అయితే ఇటీవలి పలు పోకడలు ఇబ్బందికరమైన క్షీణతకు కారణమయ్యాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం లోపభూయిష్ట విధానాలు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మహారాష్ట్ర తలసరి ఆదాయంలో వెనుకబడి పోయింది." అని ఎన్‌సిపి(ఎస్‌పి) అధికార ప్రతినిధి మహేష్ తపసే అన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా నేతృత్వంలో కీలక ప్రాజెక్టులు మహారాష్ట్ర నుండి గుజరాత్‌కు తరలించబడ్డాయి. అహ్మదాబాద్ గిఫ్ట్ నగరాన్ని ప్రత్యామ్నాయ ఆర్థిక కేంద్రంగా ప్రచారం చేస్తూ ముంబయి ప్రాముఖ్యతను తగ్గిస్తున్నారు. దీంతో మహారాష్ట్ర పర్యవసానాలను చవి చూస్తుంది. అయితే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజలు స్పందిస్తారు." అని మహేష్ తపసే పేర్కొన్నారు. 2.5 లక్షల కోట్ల అప్పులతో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రంపై భారం మోపిందని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే విమర్శించారు. మహారాష్ట్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. దీంతో తలసరి ఆదాయంలో ఆరవ స్థానానికి పడిపోయిందన్నారు.

నీట్ నుంచి మినహాయించండి

- జాతీయ స్థాయిలోనూ రద్దు చేయండి : తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

చెన్నై : తమిళనాడు నీట్ మినహాయింపు బిల్లును తక్షణమే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. జాతీయ స్థాయిలో నీట్‌ను రద్దు చేసేందుకు గానూ జాతీయ మెడికల్ కమిషన్ చట్టానికి అవసరమైన సవరణలు చేయాలని సూచించింది.

బిజెపి ఎంఎల్‌ఎలు సభ నుండి వాకౌట్ చేయగా, డిఎంకె మిత్రపక్షాలైన కాంగ్రెస్, విసికె, సిపిఐ, సిపిఎం, ఎండిఎంకె, ఎంఎల్‌ఎలు టి.వేలుమురుగన్, ఎంహెచ్.జవహరుల్లా, మనోజ్ పి.పాండ్యన్, బిజెపి మిత్రపక్షం పిఎంకె తీర్మానానికి మద్దతు తెలిపాయి. తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడారు. 12వ తరగతిలో సంపాదించిన మార్కుల ప్రాతిపదికగా అడ్మిషన్ వ్యవస్థ వుంటే సామాజిక న్యాయానికి, విద్యార్థులకు సమాన అవకాశాలకు హామీ కల్పించబడుతుందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు ఇందులో వుంటారన్నారు. తద్వారా డాక్టర్లు కూడా అన్ని ప్రాంతాలకు, వర్గాలకు చెందినవారు ఉంటారని చెప్పారు. నీట్ నిర్వహణలో అనేక అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకున్నాయని తెలిపారు. అనూహ్యంగా అనేకమంది విద్యార్థులకు పూర్తి మార్కులు వచ్చాయని, పేపర్ ఇవ్వడం ఆలస్యమైందనే కారణంతో గ్రేస్ మార్కులు కలిపారని చెప్పారు. ఎక్కడా నిబంధనలను పాటించలేదని విమర్శించారు. వివిధ కేంద్రాల్లో పరీక్షకు ముందు ప్రశ్నాపత్రం లీకయినట్లు వార్తలు వచ్చాయన్నారు.


నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు చాలాకాలంగా పోరాడుతోందన్నారు. నీట్ వల్ల తలెత్తుతున్న సమస్యలను గ్రహించి వివిధ రాష్ట్రాల్లో నీట్ పట్ల విముఖత పెరుగుతోందన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దీనిపై ప్రధానికి ఒక లేఖ రాశారని గుర్తుచేశారు. మొత్తంగా నీట్‌ను వ్యతిరేకించడంలో తమిళనాడులో ఏకగ్రీవ అభిప్రాయం నెలకొందని తెలిపారు.

కొందరు ఉన్నతాధికారులకు మళ్లీ అవకాశం

- వారి సర్వీసుల పొడిగింపులకే.. మోడీ ప్రభుత్వం మొగ్గు
- ఇప్పటికే పలువురు బ్యూరోక్రాట్లను కీలక పదవుల్లో తిరిగి నియమించిన కేంద్రం

న్యూఢిల్లీ : కేంద్ర స్థాయిలో ఉన్నత పోస్టుల్లో ఉన్న అధికారుల సర్వీసును కేంద్రంలోని మోడీ సర్కారు పొడగించాలనుకుంటున్నట్టు తెలుస్తున్నది. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన కొన్ని వారాల తర్వాత.. 1988వ బ్యాచ్ ఐపీఎస్ అధికారి, ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) చీఫ్ తపన్ కుమార్ దేకా పదవీకాలాన్ని మోడీ ప్రభుత్వం ఒక సంవత్సరం పాటు పొడిగించింది. హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన అధికారి అయిన దేకా.. 2022లో రెండేండ్ల కాలానికి ఐబీ చీఫ్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు 2025 వరకు దేకా ఈ పదవిలో ఉంటారు. ప్రధాని మోడీకి ప్రధాన కార్యదర్శిగా పి.కె మిశ్రా, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ)గా అజిత్ దోవల్‌ల సేవలను కేంద్రం పొడిగించిన విషయం విదితమే. అమిత్ ఖరే, తరుణ్ కపూర్‌లను కూడా ప్రధాని సలహాదారులుగా ప్రభుత్వం తిరిగి నియమించింది. ఈసారి ఇతర పార్టీలతో సంకీర్ణంలో ఉన్నప్పటికీ, మోడీ ప్రభుత్వ మూడవ టర్మ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఉన్నతాధికారుల కొనసాగింపుపై ప్రభుత్వం గట్టి ఆలోచనతో ఉన్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

2017 నుంచి ఆయుష్ మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా ఉన్న రాజేష్ కోటేచా కూడా ఆయన నియామకం నుంచి మూడోసారి పొడిగింపు పొందారు. అధికారులు ఇప్పటికే సర్వీస్ నుంచి పదవీ విరమణ చేసి, ప్రభుత్వం ద్వారా తిరిగి నియమించబడటంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. పీఎంఓ నియామకాలు రాజకీయ స్వభావం కలిగి ఉన్నప్పటికీ, రెండో టర్మ్ నుంచి మోడీ ప్రభుత్వం వారి నిర్ణీత పదవీ విరమణకు మించి సేవలందిస్తున్న అధికారులకు పొడిగింపులను ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నదని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పుడు కూడా ప్రభుత్వంలో పనిచేస్తున్న కొందరు ఉన్నతాధికారులు తమ నిర్ణీత పదవీకాలానికి మించి సర్వీసులు చేస్తున్నారు.



(ఫైల్)

క్యాబినెట్ సెక్రెటరీ రాజీవ్ గౌబా.. ఇప్పటికే మూడు పొడిగింపులను పొందారు. భారతదేశ చరిత్రలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ కార్యదర్శిగా రాజీవ్ నిలిచారు. హోం సెక్రెటరీ అజయ్ భల్లా భారతదేశ చరిత్రలో ఎక్కువ కాలం పనిచేసిన రెండో హోం సెక్రెటరీ. ఆగస్టు 2019లో ఆయన ఆ పదవికి నియామకం అయినప్పటి నుంచి భల్లాకు నాలుగు పొడిగింపులు వచ్చాయి. ఐఎఫ్ఎస్ అధికారి, విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా మార్చి 2024లో పదవీ విరమణ చేయవలసి ఉన్నది. "ప్రజా ప్రయోజనాలను" పేర్కొంటూ ప్రభుత్వం ఆయనకు ఆరు నెలల పొడిగింపు ఇవ్వటం గమనార్హం. నవంబర్ 2022లో రక్షణ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన 1988వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి అరమనె గిరిధర్‌కు గతేడాది ఏడాది పొడిగింపు ఇచ్చారు. అతని పొడిగించిన పదవీకాలం అక్టోబర్ 2024లో ముగియనున్నది. 1986 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్(ఐఆర్ఎస్) అధికారి అయిన నితిన్ గుప్తా ఆదాయపు పన్ను శాఖ అపెక్స్ పాలసీ మేకింగ్ బాడీ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్(సీబీడీటీ)కి చైర్మెన్‌గా జూన్ 2022లో నియమితులయ్యారు.

గతేడాది సెప్టెంబర్‌లో, రెగ్యులర్ డైరెక్టర్‌ను ఎంపిక చేసే వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా రాహుల్ నవిన్‌ను ప్రభుత్వం నియమించింది. అప్పటి ఈడీ డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రాకు పదే పదే పొడిగింపులు మంజూరు చేసినందుకు సుప్రీంకోర్టు కేంద్రంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. మిశ్రా మినహా డిపార్ట్‌మెంట్ మొత్తం "అసమర్థులతో నిండి ఉన్నదా?" అని న్యాయస్థానం ప్రశ్నించింది. అయితే అప్పటి నుంచి ఈడీకి పూర్తిస్థాయి డైరెక్టర్‌ను ప్రభుత్వం నియమించలేదు. అయితే, స్పష్టత, విధాన రూపకల్పనలో స్థిరత్వం కోసమే ఈ పొడగింపులను చేస్తున్నట్టు ప్రభుత్వం సమర్థించుకుంటున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

నవతెలంగాణ

బానిసత్వం తప్పకానప్పుడు ప్రపంచంలో
ఇంక ఏ తప్పూ తప్పకాదు - అబ్రహం లింకన్

శనివారం 29 జూన్ 2024
www.navatelangana.com

సంపాదకీయం

సర్కారు వారి 'పాట'

సర్కారువారి నోట ఒకటే పాట..! ముందు ప్రధాని, తరువాత స్పీకర్, ఆపైన రాష్ట్రపతి... అందరి నోటా 'ఎమర్జెన్సీ' మాటే! పార్లమెంటు ప్రారంభమై స్పీకర్ ఎన్నికైన రోజు... ఎప్పుడో నలభైతొమ్మిదేళ్ల క్రితం ఎమర్జెన్సీ విధించిన రోజు ఒకటే కావడం యాదృచ్ఛికమో లేక వ్యూహాత్మకమో తెలియదుగానీ, అధికారపక్షం దానినొక అందివచ్చిన అవకాశంగా వాడుకుంటున్నది. గడిచిన పదేండ్లూ నెహ్రూనే లక్ష్యంగా చేసుకుని విమర్శలతో పబ్బం గడిపారు. ఇప్పుడు ఇందిర వంతు కాబోలు... ప్రమాణస్వీకారాల రోజే ఎమర్జెన్సీపై విమర్శలు మొదలు పెట్టారు. "ప్రజాస్వామ్యాన్ని చెరబట్టి, పౌరహక్కులను కాలరాసిన సమాజం ఎలా ఉంటుందో, నియంతృత్వం ఎంతటి ప్రమాదకరమైందో నేటితరం తెలుసుకోవడానికి ఎమర్జెన్సీ ఒక ఉదాహరణ" అంటూ ప్రధాని ప్రవచిస్తుంటే సభాపతితోపాటు ప్రభుత్వ పెద్దలంతా 'ఫాలో' అవుతున్నారు.

> ఉన్నట్టుండి అంత బిగ్గరగా ఏళ్లనాటి ఎమర్జెన్సీ అంశాన్ని "ఇప్పుడు" ఎందుకు లేవనెత్తుతున్నారు. తమ నుంచి రాజ్యాంగానికి ప్రమాదముందని చెపుతున్న ప్రతిపక్షాల దాడి నుండి ఆత్మరక్షణకా? పదేండ్ల తరువాత ప్రధాన ప్రతిపక్షంగా అవతరించిన కాంగ్రెస్‌పై ఎదురుదాడికా? లేక తమ నిర్వాకంలో వెలుగుజూస్తున్న అవినీతి అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికా? పౌరసమాజం ఆలోచించాలి.

నిజానికి దేశచరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమనడంలో సందేహమే లేదు. కానీ, అంతకు మించిన నియంత పోకడలు పోయేవారికి ఎదుటివారి నియంతృత్వాన్ని విమర్శించే అర్హత ఉంటుందా?



గడిచిన పదేండ్ల పాలనాకాలమంతా వీరు మాత్రం చేసిందేమిటి? ఇదే సభాపతి గత సభలో ఏకపక్షంగా ఒకేసారి 146మందిని బహిష్కరించిన అప్రజాస్వామిక చర్యలను మరిచిపోగలమా? పార్లమెంటులో ప్రతిపక్షాన్ని లేకుండా చేసి కీలకమైన బిల్లులన్నిటినీ(లోక్‌సభలో 18బిల్లులు, రాజ్యసభలో 17బిల్లులు) ఏకపక్షంగా ఆమోదింపజేసుకోవడాన్ని విస్మరించగలమా? వీరి ప్రభుత్వం అనుసరించిన అరాచక, అనైతిక ధోరణులకు, అణచివేతల పర్వానికీ అర్థమేమిటి? అత్యవసర పరిస్థితి అంటూ చట్టబద్ధమైన ప్రకటనేమీ చేయకుండానే అన్ని రకాల స్వేచ్ఛలను హరించారు. వ్యవస్థలను దుర్వినియోగం చేశారు. మీడియాను భయపెట్టి లోబరుచుకున్నారు. పత్రికాస్వేచ్ఛను చెరబట్టారు. పార్టీలను నిట్టనిలువునా చీల్చారు. ప్రత్యర్థులను జైళ్లకు పంపారు. ప్రజాపోరాటాలూ ఆందోళనలపై పాశవికమైన దాడులకు పాల్పడ్డారు. తమతో ఏకీభవించని గొంతులపై నిర్దాక్షిణ్యంగా ఉక్కుపాదం మోపారు. ఎమర్జెన్సీని విధించకుండానే ఎన్ని నిర్బంధాలకు పాల్పడవచ్చో, ఎంతటి కక్షసాధింపులు సాగించవచ్చో ప్రజలకు కండ్లారా చూపించారు. అలాంటి వారు నియంతృత్వం గురించి, రాజ్యాంగ నియమాల గురించి, ప్రజాతంత్ర హక్కుల గురించి మాట్లాడటం గురివింద నీతినే తలపిస్తోంది.

అయినా ఉన్నట్టుండి అంత బిగ్గరగా ఏళ్లనాటి ఎమర్జెన్సీ అంశాన్ని "ఇప్పుడు" ఎందుకు లేవనెత్తుతున్నారు. తమ నుంచి రాజ్యాంగానికి ప్రమాదముందని చెపుతున్న ప్రతిపక్షాల దాడి నుండి ఆత్మరక్షణకా? పదేండ్ల తరువాత ప్రధాన ప్రతిపక్షంగా అవతరించిన కాంగ్రెస్‌పై ఎదురుదాడికా? లేక తమ నిర్వాకంలో వెలుగుజూస్తున్న అవినీతి అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికా? పౌరసమాజం ఆలోచించాలి. ఒకవైపు పరీక్షా పత్రాల లీకేజీలు, వాటి నిర్వాహణలో అవకతవకలూ అక్రమాలతో లక్షలాది యువత భవిత ప్రశ్నార్థకమవుతుండగా దేశమంతా ఆందోళనలతో అట్టుడుకుతోంది. మరోవైపు ఆగని రైలు ప్రమాదాలూ ఉగ్రదాడులకు తోడు పెరిగిన ధరలూ, తరిగిన ఉపాధి అవకాశాల వంటి దైనందిన సమస్యలతో ప్రజాజీవితం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వీటి గురించిన కనీస ప్రస్తావన లేకుండా ఎమర్జెన్సీని ఎత్తిచూపడం ప్రజలను ఏమార్చడమే అవుతుంది.

ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలు చట్టసభల్లో ప్రతిబింబిస్తేనే పార్లమెంటరీ వ్యవస్థలు చిరకాలం మనగలుగుతాయి. ప్రజల బాగుకోసం ప్రభుత్వమూ ప్రతిపక్షమూ కలిసి నడుస్తూ చట్టసభల ప్రతిష్టను కాపాడుకోవాలి. కానీ, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో జరుగుతున్నదేమిటి? ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టినా పాలకపక్షం తీరు మారలేదు. అదే అహంకారం. అదే ఏకపక్ష వైఖరి. అదే దాటవేత ధోరణి. బహుశా ప్రజాతీర్పు నుంచి పాఠాలు నేర్చుకోవడానికి వారు సిద్ధంగా లేనట్టున్నారు. సాధారణంగా అధికారపక్షానికి చెందిన వారిని స్పీకర్‌గా, ప్రతిపక్ష సభ్యుడిని డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అయితే అందుకు అంగీకరిం చేందుకు అధికారపక్షం సంసిద్ధత చూపలేదు. ఫలితంగా ఏకగ్రీవంగా జరగాల్సిన ఎన్నికకు పోటీ అనివార్యమైంది. ప్రొటెం స్పీకర్ ఎంపిక విషయంలోనూ పాలకపక్షం ఇదే తీరును ప్రదర్శించింది. ఎనిమిదిసార్లు గెలిచి సభలో అత్యంత సీనియర్‌గా ఉన్న విపక్ష సభ్యుడిని కాదని, సొంతపార్టీ ఎంపీని ఎంపిక చేసింది. తద్వారా సభా సంప్రదాయాలనూ తుంగలో తొక్కింది. దీనిని కప్పిపుచ్చుకోవడం కూడా ఈ ఎమర్జెన్సీ రాగాలాపనలో ఓ భాగమే కావొచ్చు..

అయితే ప్రతిపక్షమేమీ చేష్టలుడిగి లేదు. ప్రజలిచ్చిన బలంతో తన పాత్రను సమర్థవంతంగా నిర్వహించింది. స్పీకర్‌గా అధికారపక్ష అభ్యర్థి నెగ్గవచ్చుగాక... కానీ, ఓడిపోతామని తెలిసీ పోటీచేయడం ద్వారా ప్రతిపక్షం ఒక స్పష్టమైన సందేశాన్నివ్వడంలో విజయం సాధించింది. ఇకపై ఏదీ ఏకపక్షం కాబోదని హెచ్చరించింది. 16, 17వ లోక్‌సభలా 18వ లోక్‌సభ ఉండబోదని నిరూపించింది. ప్రజలు బలమైన ప్రతిపక్షాన్ని సభకు పంపారని గుర్తుచేసింది. అయితే తమ అమోఘమైన "నరేంద్ర జాలం"తో ఎమర్జెన్సీ రాగాలాపన చేసి, ఇవన్నీ ప్రజల గమనంలోంచి తప్పించామని ఏలినవారు భావిస్తే... అది పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగిన చందమే అవుతుంది.

మోడీ హయాంలో అప్రకటిత ఎమర్జెన్సీ




పలాష్ దాస్

జూన్ 25 ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ ప్రకటన వెలువడిన రోజు. ఈ జూన్ 24వ తేదీన లోక్‌సభ మొదటి రోజు సమావేశంలో.. "ప్రజాస్వామ్యం వర్సెస్ ఎమర్జెన్సీ" అంటూ నరేంద్ర మోడీ ప్రతిపక్షాలపై, ముఖ్యంగా కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన వ్యాఖ్యలు గోడీ మీడియాలో ప్రధానంగా వెలువడ్డాయి.భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ నిస్సందేహంగా ఒక చీకటి అధ్యాయం. అయితే దాదాపు ఫాసిస్టు తరహాలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాజ్యాంగాన్ని మార్చేందుకు సిద్ధమౌతున్న వ్యక్తి మాటల్లో ధ్వనించే ప్రజాస్వామ్యం అనేది కపటత్వం తప్ప మరొకటి కాదు.దాదాపు అర్ధ శతాబ్దం క్రితం, 1975 జూన్ 25న భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ అధికారికంగా ఎమర్జెన్సీని ప్రకటించారు. అందుకు కారణం అలహాబాద్ హైకోర్టు తీర్పు. దీని ప్రకారం 1971లో ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదు. అధికార భీతితో ప్రభుత్వం హడావుడిగా రాజ్యాంగంలోని 352వ అధికరణను వర్తింపజేసి అత్యవసర పరిస్థితిని విధించింది. ఇది 1977 మార్చి 21 వరకు కొనసాగింది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి కాలం.

అత్యవసర పరిస్థితి ప్రకటించిన వెంటనే పత్రికా స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ప్రభుత్వ నియంత్రణలో ఉన్న వార్తాపత్రికలు, ఆకాశవాణి, దూరదర్శన్ మాత్రం ప్రభుత్వ వైభవాన్ని ప్రసారం చేస్తూనే ఉన్నాయి. వార్తాపత్రికలు, మ్యాగజైన్ల నుండి తమకు అభ్యంతరకరమైన విషయాలను తొలగించేందుకు బ్యూరో ఆఫ్ ప్రెస్ సెన్సార్‌షిప్ పనిచేసింది. అయినప్పటికీ, కొన్ని వార్తాపత్రికలు, అనేక మంది జర్నలిస్టులు ప్రధానంగా నిజాన్ని పేర్కొనేందుకు ప్రయత్నించారు. ఫలితంగా ఎందరో ఎడిటర్లు, జర్నలిస్టులు అరెస్ట్ కావాల్సి వచ్చింది. పార్లమెంటరీ వ్యవస్థను నిర్లక్ష్యం చేశారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలపై దాడులు, దేశవ్యాప్తంగా మూకుమ్మడి అరెస్టులు జరిగాయి. సమావేశాలు, ప్రదర్శనలు, ఊరేగింపులు, సమావేశాలు నిషేధించబడ్డాయి. జ్యోతిబసు, జయ ప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్ సహా దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు జైళ్ల పాలయ్యారు. మీసా (అంతర్గత భద్రతా చట్టం నిర్వహణ) తదితర చట్టాల కింద వేలాదిమంది రాజకీయ కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేశారు.అంతేగాక, సామాన్య ప్రజల ప్రాథమిక హక్కులు కూడా ప్రమాదంలో పడ్డాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు, పౌరహక్కులు హరించబడ్డాయి. సాంస్కృతిక ప్రపంచంలో ఆంక్షలు, అరెస్టులు కూడా జరిగాయి. నాటక ప్రదర్శనల నిషేధం, సినిమా ప్రదర్శనల నిలిపివేత జరిగాయి.

ఎమర్జెన్సీ-ఆర్ఎస్ఎస్

ఎమర్జెన్సీ సమయంలో ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. సంఘ్ చీఫ్ బాలా సాహెబ్ దేవరస్ అరెస్టు తర్వాత ఆయన్ను, కార్యకర్తలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఇందిరా గాంధీకి పదే పదే లేఖలు రాశారు. ఒక లేఖలో సంఘ్ రాజకీయేతర వైఖరిని నొక్కిచెబుతూ, దేశ సేవ పట్ల తమ నిబద్ధతను తెలియజేశారు. రెండో లేఖలో దేశ అభివృద్ధి, దేశ నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. జైలులో ఉన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను విడుదల చేయాలని వేడుకున్నారు. మూడవ లేఖలో దేశ సంక్షేమం కోసం కలిసి పని చేసే మార్గాల గురించి చర్చించడానికి ఇందిరాగాంధీతో ఒక ప్రయివేటు సమావేశాన్ని అభ్యర్థించారు. చివరికి విడుదలకు ప్రభుత్వం నిర్దేశించిన దరఖాస్తును నింపి సమర్పించడం ద్వారా వారు విడుదలయ్యారు.



'ప్రజాస్వామ్యం' అర్థరహితం

నరేంద్ర మోడీ హయాంలో అన్నిటినీ పీఎంఓ కార్యాలయం కేంద్రంగా మారింది. మోడీ ఎప్పుడూ ప్రజాస్వామ్య బాటలో నడవలేదు. 'మన్ కీ బాత్' అంటారు. విలేకరుల సమావేశంలో జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఎన్నడూ సమాధానం ఇవ్వలేదు. పార్లమెంటులో విపక్షాల చర్చను ఆయన వినలేదు. ఎవరి మాట వినకుండా, పార్లమెంట్‌లో చర్చ లేకుండానే డీమోనిటైజేషన్ చేశారు. కోవిడ్ కాలంలో అహేతుక, అశాస్త్రీయ చర్యలను చేపట్టారు. పి.ఎం కేర్స్ ఫండ్‌ను ప్రయివేట్ ఫండ్‌గా మార్చారు. ఎటువంటి చర్చ లేకుండా ఎలక్టోరల్ బాండ్లని ప్రవేశపెట్టారు.

> మోడీ హయాంలో ఎమర్జెన్సీ ప్రకటించనప్పటికీ దేశం అప్రకటిత ఎమర్జెన్సీలో ఉంది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన మీడియాను నేడు "గోడీ మీడియా" అని పిలుస్తారు. ఇ.డి, సిబిఐ, ఆదాయపు పన్ను నియంత్రణలపై మొదట్లో విమర్శించిన ప్రధాన స్రవంతి మీడియా గోడీ మీడియాగా మారిపోయింది. స్వతంత్ర జర్నలిస్టులు, పోర్టళ్లు, సోషల్ మీడియాను నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. మోడీ ప్రభుత్వాన్ని విమర్శించినందుకుగాను న్యూస్ క్లిక్, ది వైర్, ఎన్‌డిటీవీలపై దాడి, మూసివేతే లక్ష్యంగా పెట్టుకుంది. మోడీ ప్రభుత్వాన్ని విమర్శించినందుకు సిద్దిక్ కప్పన్, మహ్మద్ జుబేర్, ప్రబీర్ పుర్కాయస్థతో సహా పలువురు జర్నలిస్టులు జైలు పాలయ్యారు.సాంస్కృతిక ప్రపంచంపై కూడా అప్రకటిత ఎమర్జెన్సీ నీడ పడుతోంది.

రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు క్రమంగా తగ్గించబడ్డాయి. పార్లమెంటులో చర్చకు అవకాశం లేదు. పార్లమెంటరీ వ్యవస్థలో చట్టాలు చేసే హక్కును తీసివేసి ఆర్డినెన్స్ రాజ్‌ని స్థాపించారు. వ్యవసాయ చట్టం, విద్యుత్ చట్టం ఆర్డినెన్స్‌లు చేసి అమలుకు దిగింది. పార్లమెంటులో మెజారిటీ ఉండడంతో బిల్లులను దాదాపు బలవంతంగా ఆమోదించడం అనవాయితీగా మారింది.భారత రాజ్యాంగం లక్షణాలలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య నిర్మాణం ప్రధానమైనవి. కానీ మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సారాంశంపైనే క్రమపద్ధతిలో దాడికి దిగింది. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను ధ్వంసం చేయడం ద్వారా ఇది రాష్ట్రాలను నిర్వీర్యం చేసింది. రాష్ట్రాల అనుమతి లేకుండానే ఆర్టికల్ 370ని రాజ్యాంగం నుండి ఏకపక్షంగా రద్దు చేసింది. జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. అదేవిధంగా జీఎస్టీని ఏకపక్షంగా అమలు చేసింది. ఇవన్నీ రాష్ట్రాల హక్కులను, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నాశనం చేశాయి.

స్వతంత్ర సంస్థలన్నిటిని తన అధీనంలో ఉంచుకుంది. ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి, ప్రభుత్వాలను స్వాధీనం చేసుకోవడానికి, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందడానికి ఇ.డి, సిబిఐ వంటి కేంద్ర సంస్థలను వినియోగించుతున్నది. సంఘ్ విధేయులను ఈ సంస్థల ప్రధాన అధికారులుగా నియమిస్తున్నది. ఎన్నికల సంఘం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిబిఐ మొదలైన వాటిని ఈ విధంగానే నింపింది. విద్యారంగాన్ని కేంద్రీకరించడానికి, ప్రయివేటీకరించడానికి గాను సిబిఎస్ఇ నుండి హిస్టారికల్ రీసెర్చ్ కౌన్సిల్ వరకు అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలల్లోను తమ విధేయులను నియమించడం ద్వారా వాటిని స్వాధీనం చేసుకున్నారు. నేడు అవినీతితో పార్లమెంటు దద్దరిల్లుతోంది. యుజిసి, ఎన్‌టిఎ వంటివి బీజేపీ, సంఘ్‌భావజాలం నిండిన అసమర్థుల చేతుల్లోకిపోయాయి. స్కూళ్లు, కాలేజీల్లో ఏం బోధించాలి, పాఠ్యపుస్తకాల్లో ఏం చేర్చాలి, ఏం తీసివేయా లనేది సంఘ్ నిర్ణయిస్తోంది. న్యాయ వ్యవస్థపై నియంత్రణను కొనసాగిం చడానికి చేసిన ప్రయత్నాన్నీ విస్మరించ కూడదు. న్యాయమూర్తుల నియామకం నుంచి న్యాయవ్యవస్థపై ప్రభుత్వం నిరంతరం ఒత్తిడి తెచ్చింది. ఎన్నికల కమిషనర్‌ను నియమించే బాధ్యత నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించి ఎన్నికల కమిషన్‌ను తమ అధీనంలోకి తెచ్చుకుంది.

ప్రమాదంలో లౌకికవాదం, బహుళత్వం

భారతదేశంలో లౌకికవాద భావజాలాన్ని అనుసరించి మతం, భాష, కులం-గోత్రం, లింగం, సంస్కృతితో సంబంధం లేకుండా చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానమే. కానీ, ప్రజలను విభజించే లక్ష్యంతో, మత ప్రాతిపదికన పౌరసత్వం కల్పించేందుకు సవరించిన సిఎఎ ని మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా అమలు చేసింది. సామాజిక సామరస్యాన్ని, ఐక్యతను ధ్వంసం చేసి సంఘ్ హిందూత్వ భావ జాలాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మైనార్టీలు, దళితులు, గిరిజనులపై దాడులు, చిత్రహింసలు నిత్యకృత్యమవుతున్నాయి. బుల్డోజర్ రాజ్, ఎన్‌కౌంటర్, బీజేపీ ప్రభుత్వం అనేవి నేడు పర్యాయపదాలుగా తయారయ్యాయి. గోసంరక్షణ దళాలు సహా వివిధ హిందుత్వ శక్తులు ఎవరు ఏం తినాలో, ఏం ధరించాలో నిర్ణయించారు. గోసంరక్షణ పేరుతోనో, లవ్ జిహాద్ పేరుతోనో మూకదాడులు జరుగుతున్నాయి.

అసమ్మతి అణిచివేత

కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వం నల్ల వ్యవసాయ చట్టాలను ఆమోదించడంతో చరిత్రాత్మక రైతాంగ ఉద్యమం ప్రారంభమైంది. ఆ ఉద్యమాన్ని అణిచివేసేందుకు మోడీ ప్రభుత్వం సైన్యం, పోలీసులతో దేశానికి అన్నం పెట్టే రైతాంగం పైనే యుద్ధానికి దిగి వారిని క్రూర హింసలకు గురిచేసింది. ఢిల్లీలోని షాహీన్‌బాగ్, జెఎన్‌యు, దేశంలోని ఇతర ప్రాంతాల్లో సాగిన సిఎఎ-ఎన్ఆర్‌సి వ్యతిరేక ఉద్యమాలను అణిచివేసేందుకు ప్రభుత్వం, హిందుత్వ శక్తులు ఇలాంటి దాడులు నిర్వహించాయి. భీమా కోరేగావ్ కేసులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు ఇప్పటికీ జైళ్లలో మగ్గుతున్నారు. స్టాన్‌స్వామి జైలు కస్టడీలోనే మరణించారు. శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరించిన దబోల్కర్, పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేశ్‌ను హిందుత్వ శక్తులు హత్య చేశాయి.

అప్రకటిత ఎమర్జెన్సీ

మోడీ హయాంలో ఎమర్జెన్సీ ప్రకటించనప్పటికీ దేశం అప్రకటిత ఎమర్జెన్సీలో ఉంది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన మీడియాను నేడు "గోడీ మీడియా" అని పిలుస్తారు. ఇ.డి, సిబిఐ, ఆదాయపు పన్ను నియంత్రణలపై మొదట్లో విమర్శించిన ప్రధాన స్రవంతి మీడియా గోడీ మీడియాగా మారిపోయింది. స్వతంత్ర జర్నలిస్టులు, పోర్టళ్లు, సోషల్ మీడియాను నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. మోడీ ప్రభుత్వాన్ని విమర్శించినందుకుగాను న్యూస్ క్లిక్, ది వైర్, ఎన్‌డిటీవీలపై దాడి, మూసివేతే లక్ష్యంగా పెట్టుకుంది. మోడీ ప్రభుత్వాన్ని విమర్శించినందుకు సిద్దిక్ కప్పన్, మహ్మద్ జుబేర్, ప్రబీర్ పుర్కాయస్థతో సహా పలువురు జర్నలిస్టులు జైలు పాలయ్యారు.సాంస్కృతిక ప్రపంచంపై కూడా అప్రకటిత ఎమర్జెన్సీ నీడ పడుతోంది. ప్రభుత్వ విధానానికి, మోడీ-షా, వారి హిందుత్వ భావజాలానికి వ్యతిరేక అభిప్రాయం వెల్లడిం చితే చాలు. మతపరమైన మనోభావాలను దెబ్బతీశాయన్న సాకుతో, హిందూత్వ, మితవాద శక్తులు దాడి చేసి సినిమాలు, నాటక ప్రదర్శనలను, నృత్య సంగీత కార్యక్రమాలను నిలిపివేస్తాయి. ఢిల్లీ గ్యాంగ్ రేప్‌పై వెలువడిన బిబిసి డాక్యుమెంటరీ మన దేశంలో నిషేధించబడింది. మత ఛాందసవాదం, ఎల్‌జిబిటిక్యూల గురించిన చిత్రం "అన్-ఫ్రీడమ్" సెన్సార్ బోర్డ్ ద్వారా నిరోధించబడింది. అనేక మంది కళాకారులు, యూట్యూబర్లు, నేహాసింగ్ రాథోడ్ వంటి స్టాండ్-అప్ కమెడియన్లు ప్రతిరోజూ ట్రోలింగ్‌లకు గురవుతున్నారు.చంపేస్తామంటూ వారికి బెదిరింపులు వస్తున్నాయి.అయితే ప్రస్తుత మోడీ 3.0 మునుపటి లాగా ఉండబోదు. ప్రతిపక్షాల సంఖ్య గతంలో కంటే ఎక్కువగానే ఉంది. ప్రజల తీర్పు మోడీకి అనుకూలంగా లేదు. సంకీర్ణ ప్రభుత్వ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ దేశాన్ని పాత పద్ధతిలో నడపలేరు. అయినా బీజేపీ అధికారంలో ఉంది కనక ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగం సురక్షితం కాదు.అందుకే ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటం మరింత బలపడాలి.

('గణశక్తి' సౌజన్యంతో)

కూసింత కూలీ కుండకేసి
మనసెట్టి జర సూడండ్రి
గతికినకాడనే
మెతుకుల్ని ఏరుకుంటా
కూకున్నకాడనే
కూలబడుతున్నం దొర
గంజి పోసిన గిద్దెలోకింత
ఉప్పు సల్లండ్రి

పోరగాళ్ళ పైసదువులు
పాణం మీద పెనం లెక్కన
సర్రున కాగినట్టే వుంటయి
ఇసిరొచ్చిన ఇత్తనాలు

నమస్తే...సారూ.!!



ఎనకమాలే ఎక్కిరిత్తాంటే
జర కునుకు కరువైనాది దొర
సూపుదేలు ఎత్తనీకి
సూపు రావట్లే
యాపారమంతా
యాపాకులా సేదైనాక
గాడ ఈడా గుంజదాన్కే
పైసల్నీ దొర్లిపాయే
ఏం సేత్తాం దొర బతుకింతే

నేనెంత నువ్వెంతని
మీకుమల్లే గింజులాట్లో
కాలమంతా ఊద్చకపాయే
నమస్తే సారూ
జరంత తల పైకెత్తి
తలమాసిన రాతల బతుకుల్ని
ఒక్కతూరైనా సూడండ్రి

ఎకాక్కన ఒకటే కరుసు
కొరివి జీవనాల కుంపటి కింద
ఎన్నాళ్ళని సాగదీయాలే
జర మీరైనా సెప్పండ్రీ
ఏ కొట్టుకాడ సూసినా
రేట్లన్నీ రంకెలేత్తాంటే
గుండెకాయాడన్నంత పనైంది
యలపరంతో పాటు
సొలుపొచ్చి సాగిలపడినాం
కాయింత సూడండ్రీ
ఇసుమంత ఎరగండ్రి

- నరెద్దుల రాజారెడ్డి
సెల్: 9666016636

పామాయిల్ రైతులను పట్టించుకోరా..?



యలమంచి వంశీకృష్ణ
9908997969

తెలంగాణ రాష్ట్రంలో అధికంగా సాగయ్యే పంటలు వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు. ఆ తర్వాత వాటిస్థాయిలో కాకున్నా ఒక మోతాదులో సాగుచేస్తున్న పంట ఏదైనా ఉందంటే పామాయిల్. ప్రస్తుతం వంట నూనెల్లో అన్నిటికన్నా తక్కువ ధర కలిగిన నూనె పామాయిల్. దీన్ని మానవ అవసరాలతో పాటు పారిశ్రామిక ఉపయోగం కోసం కూడా వాడుతున్నారు. మన రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటను నాలుగేండ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటే తప్ప చేతికందదు. ఆ తర్వాత ఏడాదికోసారి దిగుబడి వచ్చినప్పటికీ మొక్కల నుంచి మొదలుకుని అవి చెట్లుగా పెరిగి గెలలు వేసేవరకు రైతు శ్రమ మాత్రం అధికమనే చెప్పాలి. ఇప్పటివరకు పామాయిల్ సాగును ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకున్న పరిస్థితి లేదు. గత ప్రభుత్వం పామాయిల్ వైపు రైతులను ప్రోత్సహించాలనే ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.670కోట్లు కేటాయించింది. కానీ అందులో రూ.380 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. ఫలితంగా రైతులకు రాయితీలివ్వడంలో నిర్లక్ష్యం చేసింది. దీంతో మొదటి ఏడాది సాగు కోసం సర్కార్ పంపిణీ చేసిన మొక్కల్ని మాత్రమే రైతులు నాటాల్సి వచ్చింది. కానీ వాటి ఎదుగుదలకు, నాలుగేండ్ల దిగుబడి కోసం చేయాల్సిన ఆర్థిక సహకారం అందివ్వకపోవడంతో సాగు భారమంతా రైతులు సొంతంగానే మోయాల్సి వస్తున్నది.

భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసిఎఆర్) ప్రకారం పామాయిల్ సాగులో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా తెలంగాణ ద్వితీయ స్థానంలో ఉంది. ఈ పంట జీవితకాలం 25 నుంచి 30 ఏండ్లు. మొదటి నాలుగేండ్లు ఆదాయమే ఉండదు.అందుకే రైతుకి ఆర్థిక మద్దతు అవసరం.ఈ నాలుగేండ్లలో అంతర పంటలు వేయడానికి కావలసిన సమాచారం అధికార యంత్రాంగం చేయాల్సిన ఉన్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. మన రాష్ట్రంలో సాగయ్యే రెండు లక్షల ఎకరాల్లో సుమారుగా లక్షా 30వేల ఎకరాలు పామాయిల్ ఉత్పత్తి అవుతున్నది. పామాయిల్ అనేది ఇతర నూనెలు ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే కేవలం ఆరు శాతం భూమిలో 40శాతం నూనెను పామాయిల్ ఉత్పత్తి చేస్తుంది.ఆముదము, పొద్దు తిరుగుడు, నువ్వులు, వేరుశనగ వంటి పంటల ఉత్పత్తులు సరైన దిగుబడి లేకపోవడంతో సాగు ఏడాదికేడాది తగ్గుతూ వస్తున్నది వాస్తవం. ఇదే భూమిలో సోయాబీన్, పొద్దుతిరుగుడు, నువ్వుల నూనె వంటి ప్రత్యామ్నాయ నూనెలను పొందటానికి నాలుగు నుంచి పది రెట్లు ఎక్కువ భూమి అవసరం. అందువల్ల ఎక్కువగా రైతులు పామా యిల్ వైపు దృష్టి పెడుతున్నారు. కానీ ఈ సాగుకు కావాల్సిన సహకారం ప్రభుత్వాల నుంచి అందడం లేదు.

130 కోట్ల జనాభా గల దేశంలో వారి అవసరాలకు 140 లక్షల టన్నుల ఆయిల్ అవసరం అవుతుంది. కానీ దేశంలో కేవలం 70 నుంచి 75 లక్షల టన్నుల మాత్రమే ఉత్పత్తి అవుతుంది. మిగిలిన నూనెలను మలేషియా, ఇండోనేషియా వంటి చిన్న దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 33 శాతం మంది ఈ నూనెను వినియోగిస్తున్నారు. అందులో మన దేశం వాటా 60 శాతం. పామాయిల్ సాగును ప్రోత్సహించాలని కేంద్రం పామాయిల్ మిషన్ 2020- 2028ని ప్రవేశపెట్టింది. 11 వేల కోట్ల రూపాయలను బడ్జెట్ కేటాయించింది. 17 రాష్ట్రాల్లో 1516 లక్షల ఎకరాల్లో పంటను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.తద్వారా విదేశాల నుంచి వచ్చే దిగుమతులు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కానీ ఆచరణలో సరైన విధానాన్ని ప్రకటించకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. దేశం ఏటా 14 మిలియన్ టన్నుల వెజిటబుల్ ఆయిల్ దిగుమతి చేసుకుంటుండగా ఇందులో 8.5 మిలియన్ టన్నుల పామాయిల్ కావటం గమనార్హం. ఈ దిగుమతుల కోసం కేంద్రం 19 బిలియన్ డాలర్ల దాకా అత్యంత విలువైన విదేశీ మారకాన్ని ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇది ట్రేడ్ డెఫిసిస్‌కు దారి తీయడమే కాక ద్రవ్యోల్బణం పెంచుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఏటా మూడు లక్షల టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుంది. తెలంగాణలో కనుక తక్కువలో తక్కువ రెండు మిలియన్ టన్నుల పామాయిల్ ఉత్పత్తి చేయగలిగితే దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసిన వారు అవుతారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.దానికి కావాల్సింది ప్రధానంగా రైతులను ఆయిల్‌ఫామ్ వైపు మొగ్గుచూపేలా తగిన ప్రోత్సాహమివ్వడం. 90శాతం సబ్సిడీతో పాటు మొక్కల ఎదుగుదలకు నాలుగేండ్ల వరకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించడం. కానీ ఆదిశగా ప్రభుత్వ కార్యాచరణ లేకపోవడం శోచనీయం.

> వరి సాగును తగ్గించే క్రమంలో గత ప్రభుత్వాలు 25 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని నిర్ణయం తీసుకుంది. కానీ 1970 మధ్యలో దేశంలో నూనె పంటల విస్తీర్ణాన్ని పెంచడం కోసం సలహాలు ఇవ్వటానికి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి డాక్టర్ చద్దా కమిషన్ 10 రాష్ట్రాల్లో సుమారుగా 50 లక్షల ఎకరాలు సాగుకి అనుకూలమని తెలిసింది. కానీ ఈ 50 ఏండ్ల కాలంలో 9 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు అందులో నాలుగున్నర లక్షల ఎకరాల నుంచి పంట గిట్టుబాటు గాక ప్రభుత్వం, ప్రయివేటు కంపెనీల ప్రోత్సాహం లేక పీకి వేశారు. దీన్ని ప్రధానంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

వాస్తవానికి నర్సరీ మొక్కలను 12 నెలల నుంచి 15 నెలలలోపు పెంచిన మొక్కలను రైతులకివ్వాలి. మొక్కల లభ్యత మీద పూర్తి దృష్టి పెట్టాలి. ఎందుకంటే నర్సరీ పెంపకం వాటిని పంటకు సిద్ధం చేయటం అనేది అనేది ఒక సుదీర్ఘ ప్రక్రియ. తోటలలో గ్యాప్ ఫిల్లింగ్‌కు నర్సరీలో కొంత వయసు వరకు కొన్ని మొక్కలను పెంచాలి. భూగర్భ జలాలను చెక్ చేసుకోవాలి. పామాయిల్ ఒక మొక్క తప్పడానికి రోజుకి 300 లీటర్ల నీళ్లు కావాలి. అలాగే కరువు పరిస్థితులు వస్తే తోటలను ఎలా కాపాడుకోవాలి అనే ప్రణాళిక ఉండాలి. గెలలు వానాకాలంలో వస్తాయి కనుక గెలలు బయటకు పోవడానికి ఉపయోగంగా దారులను, డొంకలను సరిచేసుకోవాలి. పాలినేషన్ ఈవెన్ అనేది పామాయిల్ తోటలో చాలా ముఖ్యం. వీటి ద్వారానే పామాయిల్ తోటలో పరపరాగ సంపర్కం జరిగి ఆడగెలలు ఏర్పడతాయి. వాటికి వాతావరణం సరిపోతుందో లేదో చూసుకోవాలి. ఇవి సరిగా లేకపోవడం వల్ల వనపర్తి, సిద్దిపేట జిల్లాల్లో సమయం దాటినా గెలలు రావడం లేదు. మొత్తం తెలంగాణలో సాగులో ఉన్న భూమి నుండి పంట ఉత్పత్తి వస్తే వాటిని ప్రాసెస్ చేయడానికి సరిపడా యూనిట్లు రాష్ట్రంలో లేవు. గతంలో 14 ఫ్యాక్టరీలకు అనుమతిస్తే అందులో మూడు ఫ్యాక్టరీలు మాత్రమే నడుస్తున్నాయి.

ఒక టన్ను పామాయిల్ గెలలనుంచి 193 కేజీల నూనె వస్తుంది. దీనిని కాకినాడ పోర్ట్ నుంచి అమ్ముతున్నారు. ఏరోజుకారోజు అంతర్జాతీయ క్రూడాయిల్ మార్కెట్‌ని బట్టి రేటు నిర్ణయిస్తారు. దీనిని నెలంతా సరాసరి యావరేజ్ చేసి రైతుకి రేటు చెల్లిస్తారు.పామాయిల్ మొక్కలు పెంచాలనుకుంటే అక్కడ భూములు పరీక్ష చేయాలి. వాతావరణ అనుకూల పరిస్థితులు చూడాలి. కనీసం ఐదేండ్లు అక్కడ పరీక్షలు నిర్వహించాకే రైతులను ప్రోత్సహించాలి. లేదంటే సాగు విధానం తెలియక రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ఇప్పటికే ప్రయివేటు కంపెనీ అయిన గోద్రెజ్ ఆగ్రోవేట్ వారు రైతుల కోసం ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించి, రైతులకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. కానీ ప్రభుత్వ రంగ సంస్థ అయినా ఆయిల్ ఫెడ్‌లో ఆ విధానాన్ని ప్రవేశపెట్టకపోవడంతో రైతులకు సరైన సమాచారం ఉండటం లేదు.

వరి సాగును తగ్గించే క్రమంలో గత ప్రభుత్వాలు 25 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని నిర్ణయం తీసుకుంది. కానీ 1970 మధ్యలో దేశంలో నూనె పంటల విస్తీర్ణాన్ని పెంచడం కోసం సలహాలు ఇవ్వటానికి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి డాక్టర్ చద్దా కమిషన్ 10 రాష్ట్రాల్లో సుమారుగా 50 లక్షల ఎకరాలు సాగుకి అనుకూలమని తెలిసింది. కానీ ఈ 50 ఏండ్ల కాలంలో 9 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు అందులో నాలుగున్నర లక్షల ఎకరాల నుంచి పంట గిట్టుబాటు గాక ప్రభుత్వం, ప్రయివేటు కంపెనీల ప్రోత్సాహం లేక పీకి వేశారు. దీన్ని ప్రధానంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం కేంద్రం వ్యవసాయ సహకార రైతు సంక్షేమ శాఖ ద్వారా 2017-18 సంవత్సరానికి అంచనా వేసిన విధంగా తెలంగాణలో ఒక టన్ను పామాయిల్ గెలల ఉత్పత్తికి అవుతున్న ఖర్చు రూ.10,837ను నిర్ధారించింది. కానీ, 2023-24 నాటికి టన్నుకు ఒక ఇంటికి సుమా రుగా రూ.15వేలకు పైగా ఖర్చు అవుతుంది. మరి కేంద్రం మద్దతు ధర రూ.13346గా పేర్కొనటం ఎమ్మెస్ స్వామినాథ కమిషన్ సిఫార్సులకు పూర్తి విరుద్ధం. ప్రభుత్వం టన్నుకు కనీసం రూ.20వేలు మద్దతు ధర ఇస్తే గాని పామాయిల్ రైతాంగం బతికి బట్టకట్టే పరిస్థితి లేదు. దేశంలో ఆయిల్ ఫామ్ పంట ప్రవేశించి మూడు దశాబ్దాలు దాటింది. కానీ నేటికీ ఈ పంటను ప్రోత్సాహకాలు, సబ్సిడీల పేరుతోనే లాగించుకురావడం వ్యవసాయరంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు.








వేలం ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలం వేస్తున్నదని, సింగరేణి కంపెనీ కూడా ప్రయివేట్ సంస్థలతో వేలం పాటలో పోటీ పడాలనే స్థితికి తీసుకొచ్చిందని నేతలు విమర్శించారు. బొగ్గు గనులన్నింటినీ ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదే ముంటుందని, క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో సీపీఐ(ఎం) నాయకులు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఖమ్మం నగరంలోని సరిత క్లినిక్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా సరిత క్లినిక్ సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోయారని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణి 40



వేల మంది పర్మినెంట్ కార్మికులకు, మరో 26 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని, రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి

కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను ప్రయివేటీకరణ చేయడానికి వేలం వేయాలని చూస్తోందని, రాష్ట్రంలోని గనులను నేరుగా సింగరేణికే కేటాయించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తీగల సాగర్, నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకులో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి కానీ వేలంపాట ద్వారా ప్రయివేటు సంస్థలకు అవకాశం కల్పించడం సరైంది కాదన్నారు. బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న రాష్ట్ర బీజేపీ నేత కిషన్‌రెడ్డి స్వయంగా పాల్గొని హైదరాబాద్ కేంద్రంగా వేలం పాటను ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్‌లను కూడా తక్షణమే సింగరేణికి అప్పగించాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి.. ధర్నా చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ధర్నా చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలంపాట ఆపాలని, సింగరేణికే నేరుగా గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సీపీఐ(ఎం) శ్రేణులు నిరసనలు తెలిపారు. ముషీరాబాద్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని గనులను ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు యత్నిస్తోందన్నారు. బొగ్గు గనుల వేలం పాట చర్యను మానుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే, అంబర్‌పేట్, బంజారాహిల్స్, గుడిమల్కాపూర్ లక్ష్మీనగర్ చౌరస్తాలోనూ నిరసన తెలిపారు. అడ్డగుట్టలో, రహమత్ నగర్ డివిజన్‌లోని రెండు బొమ్మల సెంటర్ వద్ద, బన్సీలాల్‌పేట్‌లో ధర్నా చేపట్టారు. కంటోన్మెంట్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.






మహిళలకు అన్ని రంగాల్లో సమానత్వం కల్పించాలి

- మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించాలి
- విద్య,వైద్యం ఉచితంగా అందించాలి :

ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి

నవతెలంగాణ-సూర్యాపేట

మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమానత్వం కల్పించాలని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్థానిక మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో శుక్రవారం ఐద్వా జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు హాజరైన ఆమె ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. గడిచిన పదేండ్ల కాలంలో దేశంలో మహిళలపై హత్యలు, లైంగికదాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక చట్టాలు వస్తున్నప్పటికీ సక్రమమైన పద్ధతిలో అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళా లోకం తమ హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. న్యూయార్క్ నగరంలో కుట్టు మిషన్ పని చేసే శ్రామిక మహిళలు ఎనిమిది గంటల పని దినం, పని ప్రదేశాల్లో మెరుగైన



సౌకర్యాలు కల్పించాలని, శ్రమకు తగ్గ వేతనం, ఓటు హక్కు కావాలని పోరాడి హక్కులు సాధించుకున్నారని వివరించారు. వారి త్యాగాలు వెలకట్ట లేనివన్నారు.

విద్య, వైద్యం, క్రీడా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు పోతున్న మహిళల పట్ల వివక్ష, అసమానత, లైంగిక వేధింపులు కూడా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లింగ సమానత్వ సూచిలో 146 దేశాల్లోకెల్లా మన దేశం 127వ స్థానంలో ఉందని చెప్పారు. సాధించుకున్న హక్కులు నిర్వీర్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల హక్కులు పరిరక్షించబడాలంటే నిర్ణయ అధికారంలో భాగస్వామ్యం కావాలన్నారు. మహిళలకు పని, భద్రత కల్పించాలని కోరారు. వాటిని కల్పించే వరకు మహిళలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, నాయకులు మద్దెల జ్యోతి, జూలకంటి విజయలక్ష్మి, అండం నారాయణమ్మ, సురభి లక్ష్మి, గోలి భాగ్యమ్మ, నెమ్మాది లక్ష్మి, ఋజన, రజిత, దేవిరెడ్డి జ్యోతి తదితరులు ఉన్నారు.

కంప్రెషర్ పేలి ఐదుగురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

రోషన్(36), ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాం ఆశిష్(20) అక్కడికక్కడే మృతిచెందారు. శరీర భాగాలు ముక్కలు ముక్కలుగా తెగి పడి ఎవరినీ గుర్తుపట్టలేని విధంగా మారింది. సుమిత్, సుబోధ, మంటుకుయా, గోవింద్, కార్తీక్, సుజాత, నేలమ్మా, రోషన్‌తోపాటు సుమారు 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని షాద్‌నగర్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. శంషాబాద్ డీసీపీ రాజేష్, షాద్‌నగర్ ఏసీపీ, ఇతర పోలీసు సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

మృతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : కార్మిక సంఘాల నాయకులు

ప్రాణం కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. సేఫ్టీ పరికరాలు లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

షాద్‌నగర్ ఘటన పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి

షాద్ నగర్‌లోని గ్లాస్ పరిశ్రమలో పేలుడు జరిగి ఆరుగురు కార్మికులు మృతి చెందటం పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలనీ, సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా, భద్రతా చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిం చటం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



షాద్‌నగర్ ప్రమాద ఘటనపై అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. కలెక్టర్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమల శాఖల అధికారులు, వైద్య బృందాలు ఘటనా స్థలిలోనే ఉండి సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు.

కార్మికులు చనిపోవడం బాధాకరం : సీఐటీయూ

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రాంతంలోని సౌత్‌గ్లాస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు కార్మికులు చనిపోవడం, 15 మందికిపైగా కార్మికులు తీవ్రంగా గాయపడటం బాధాకరమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ పేర్కొన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.40 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఆ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయించాలనీ, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

చనిపోయిన, గాయపడిన కార్మికుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వలసొచ్చిన కార్మికులే ఉన్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.40 లక్షల చొప్పున, గాయపడిన కార్మికులకు రూ.10 లక్షల చొప్పున యాజమాన్యంతో ప్రభుత్వం తక్షణమే ఇప్పించాలని డిమాండ్ చేశారు.

పీవీ జీవితం ఆదర్శనీయం

- మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-భీమదేవరపల్లి

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితం అందరికీ ఆదర్శనీయమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పీవీ జయంతి సందర్భంగా శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పీవీ స్వగ్రామం వంగరలో ఆయన విగ్రహానికి మంత్రి పొన్నం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవీ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. భారతదేశానికే కాకుండా ప్రపంచానికి పీవీ నరసింహారావు ఆదర్శప్రాయుడిగా నిలిచారని కొనియాడారు. భూ సంస్కరణలు, విదేశాంగ విధానం, ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ముందుకు నడిపించిన ఘనత పీవీకి దక్కిందన్నారు. నవోదయ కేంద్రీయ విద్యాలయాలు తీసుకొచ్చి దేశంలో విద్యావ్యవస్థను పటిష్టం చేశారన్నారు. పీవీ స్ఫూర్తి, ఆలోచన విధానంతో ప్రభుత్వం ముందుకు వెళ తుందని చెప్పారు. వంగరలో వాటర్ ప్లాంట్, రోడ్లు ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొద్ది రోజుల్లోనే రైతులకు రుణమాఫీ అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్, మాజీ ఎంపీ రాజయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పీవీ కుటుంబ సభ్యులు పీవీ మదన్ మోహన్, శరత్, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

- స్కూల్ అసిస్టెంట్ బదిలీల ప్రక్రియ షురూ
- జులై 2న ప్రమోషన్ల ఉత్తర్వులు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసిన విషయం తెలిసిందే. మల్టీజోన్-1లో 11,177 మంది, మల్టీజోన్-2లో 7,765 మంది కలిపి మొత్తం 18,942 మంది ప్రభుత్వ, స్థానిక సంస్థల పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. హైకోర్టులో కేసు ఉండడంతో రంగారెడ్డి జిల్లాలో అప్పుడు ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు మార్గం సుగమమైంది. 40 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఖాళీగా ఉంచాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి శుక్రవారం ఖాళీల వివరాలను ప్రకటించాలని కోరారు. అదేరోజు ఎస్జీటీలు, తత్సమా క్యాడర్‌కు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ జాబితాను విడుదల చేయాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు శనివారం అభ్యంతరాలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అదే రోజు వాటిని డీఈవో పరిష్కరిస్తారని తెలిపారు. ఈనెల 30న తుది సీనియార్టీ జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయుల నుంచి వెబ్‌ఆప్షన్లను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అదేరోజు బదిలీల ఉత్తర్వులను జారీ చేస్తామని వివరించారు. వచ్చేనెల ఒకటిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీల వివరాలను ప్రకటిస్తామని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం తుది సీనియార్టీ జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు. అదేనెల రెండున వెబ్‌ఆప్షన్లను స్వీకరిస్తామనీ, సవరణకు అవకాశమిస్తామని వివరించారు. అదేరోజు పరిశీలించి పదోన్నతుల ఉత్తర్వులను జారీ చేస్తామని తెలిపారు. వచ్చేనెల మూడు నుంచి ఐదో తేదీ వరకు ఎస్జీటీలకు బదిలీల ప్రక్రియను చేపడతామని వివరించారు. రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది రోజుల్లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపట్టేందుకు షెడ్యూల్‌ను విడుదల చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి.

వాస్తవ పరిస్థితుల అంచనాకే

భగీరథ 'ఇంటింటి' సర్వే

- 90 శాతం పూర్తి
- జలజీవన్ మిషన్ కింద కేంద్రం నిధులు పొందే యోచన
- పీఆర్, ఆర్డీ సిబ్బందితో మొబైళ్ల ద్వారా నిర్వహణ
- టీసీఎస్ పర్యవేక్షణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ తాగునీటి ప్రాజెక్టు ప్రస్తుత వాస్తవ పరిస్థితిని నిర్ధారించేందుకుగాను ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. తద్వారా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో భగీరథ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ అందుతున్న తాగునీటి సరఫరా పరిస్థితులను అంచనా వేయనుంది. సర్వే నివేదిక వచ్చిన అనంతరం ప్రభుత్వం భగీరథ ప్రాజెక్టును ప్రజలకు మరింత ప్రయోజనకారిగా ఉండేలా మలచాలని భావిస్తున్నది. అనేక గ్రామాలకు భగీరథ కింద తాగునీరు సరఫరా కావడం లేదనీ పలు ప్రాంతాల్లో నల్లా కనెక్షన్లు లేవనీ, పైపులైన్లు మాత్రమే ఉన్నాయనీ, పైపులు దెబ్బతిన్నాయని ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వేకు ఆదేశించింది. సమగ్ర ఇంటింటి సర్వేను జూన్ 10 నుంచి చేపట్టారు. 15 రోజుల్లో పూర్తిచేయాలని సర్కారు ఆదేశించింది. అంటే ఈ నెలాఖరులోపు ముగించాలని చెప్పింది.



పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఈ సర్వేకు ప్రధాన బాధ్యత వహిస్తున్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ద్వారా సర్వే పర్యవేక్షిస్తున్నారు. ఆ సంస్థ రూపొందించి సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు. ఇప్పటివరకు సంబంధిత సర్వే 90 శాతం పూర్తయింది. ఇంకా ఐదు శాతం మిగిలి ఉంది. మరో పది రోజులు పట్టే అవకాశమున్నట్టు అధికారులు అంటున్నారు. టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌ను వాడుకుంటూ ఆయా ప్రశ్నల ఆధారంగా సమాచారం, ఫోటోలను అప్‌లోడ్ చేస్తున్నట్టు సమాచారం.

నిధుల కోసమే

గత ప్రభుత్వం మిషన్ భగీరథను ప్రతిష్టాత్మక పథకంగా ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని ప్రతిగ్రామానికి సురక్షిత తాగునీటిని అందిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. అయితే రాష్ట్రంలో చాలా గ్రామాలకు తాగునీరు అందడం లేదని ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీలకు ఫిర్యాదులు అందాయి. దీంతో తాజా ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అంచనా వేసి మరోసారి కేంద్రానికి నివేదిక పంపనున్నారు. అంతేగాక జల్‌జీవన్ మిషన్ కింద నిధులు మంజూరు చేయాలని కోరనున్నారు. గ్రామాల్లో కొత్త ఇండ్లకు కనెక్షన్లు, మరమ్మత్తులు, నిర్వహణ తదితర చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు, ఇందిరా క్రాంతి పథం(ఐకేపీ) సిబ్బందితోపాటు స్థానిక విద్యుత్ సిబ్బందిని ఇంటింటి సర్వే చేయడానికి వినియోగిస్తున్నారు. మిషన్ భగీరథ స్థితిపై ఇండ్లల్లో ఉన్న నల్లా కనెక్షన్ల ఫోటోను వారి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అలాగే లబ్దిదారులకు భగీరథ కింద తాగునీరు అందుతున్నదా ? తదితర వివరాలను సైతం నమోదు చేస్తున్నారు. నల్లా కనెక్షన్ ఉన్నా, లేకపోయినా, పైప్‌లైన్లకు ఏదైనా నష్టం జరిగినా, గ్రామాల్లోని కుటుంబాలన్నీ నీటిని తాగుతున్నాయా, మరేదైనా అవసరాలకు వాడుతున్నాయా అనే అంశాలపై కూడా సర్వే ద్వారా తేల్చనున్నారు. ఈ ఇంటింటి సర్వేలో నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ శాఖలకు భాగస్వామ్యం కల్పించలేదు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికార యంత్రాంగం చేపట్టింది. ఇందుకు టీసీఎస్ సహకారం తీసుకుంటుండటం గమనార్హం.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- ముందున్న లారీని ఢీకొన్న మేకల లారీ
- ఐదుగురు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- 200కు పైగా మేకలు మృత్యువాత



నవతెలంగాణ - చేగుంట

మెదక్ జిల్లా చేగుంట మండలంలోని 44వ జాతీయ రహదారిపై వడియారం సమీపంలో రెండు లారీలు ఢీకొనడంతో ఐదుగురు మేకల వ్యాపారులు మృతిచెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో 200పైగా మేకలు మృత్యువాత పడ్డాయి. వ్యాపారులు లారీలో హైదరాబాద్‌కు మేకలు తరలిస్తుండగా.. ముందుగా వెళ్తున్న పశువుల దానా లారీని వేగంగా వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి..

మధ్యప్రదేశ్ రాష్ట్రం గుహరేవకు చెందిన ఎండీ ఇబ్రహీం(21), చిక్వా రాజు(57), చిక్వ మనీష్ కుమార్(30), ఎండీ షబ్బీర్ ఖాన్ (48), ఎండీ జిషన్(21) మేకల వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే నాగ్‌పూర్ నుంచి లారీలో హైదరాబాద్‌కు మేకలు తరలిస్తున్నారు. వారి లారీ.. ముందున్న పశువుల దానా లారీని చేగుంట మండలంలోని 44వ జాతీయ రహదారిపై వడియారం సమీపంలో ఢీకొట్టింది. దాంతో మేకల లారీ క్యాబిన్‌లో కూర్చున్న ఇద్దరు, వెనుక కూర్చున్న ముగ్గురి మీద మేకలు పడి ఊపిరి ఆడక మృతిచెందారు. వీరు మేకల వ్యాపారంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ ప్రమాదంలో రమేష్, మహేష్, శుక్లాల్, బుట్టా సింగ్, లాల్‌మనీకి గాయాలయ్యాయి. 200కు పైగా మేకలు కూడా మృత్యువాత పడ్డాయి. ఘటనా స్థలానికి స్థానిక పోలీసులతో పాటు ఎస్పీ బాలస్వామి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చేగుంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారుల నిర్మాణంలో

వేగం పెంచాలి

అధికారులకు మంత్రి కోమటిరెడ్డి దిశానిర్దేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రానికి రహదారులు జీవనాడులని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వీటిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం మూలంగా గత మూడేండ్లలో కేంద్రం నుంచి అతి తక్కువగా నిధులు మంజూరయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి అలాంటి అలసత్వానికి తావులేకుండా కషి చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు మంత్రి మార్గనిర్దేశం చేశారు. శుక్రవారం హైటెక్ సిటీలోని 'న్యాక్' కార్యాలయంలో జాతీయ రహదారులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రహదారులు, ఎన్‌హెచ్ అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రానికి మణిహారం గా మారనున్న ఆర్‌ఆర్‌ఆర్‌పై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాలని సూచించారు. జులై మొదటి వారంలో రాష్ట్రానికి ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల బందం రానున్న నేపథ్యంలో ప్రస్తుతం మంజూరీ అయి పనులు నడుస్తున్నవి, పలు అనుమతుల కోసం ఆగిపోయినవి, అప్‌గ్రేడ్ కోసం విన్నవించిన జాతీయ రహదారులకు సంబంధించిన సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో అధికారులు ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పనులను ముందుకు తీసుకుపోదామని సూచించారు. అనంతరం ఎన్.హెచ్-65 (హైదరాబాద్-విజయవాడ) జాతీయ రహదారికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఫోర్ క్లోజ్ చేసి.. వచ్చే నెలలో కొత్త టెండర్లు పిలవాలని ఆదేశించారు. సెప్టెంబర్‌లో పనులు పునఃప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇందులో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా ప్రతీది నిత్యం పర్యవేక్షించాలని జాతీయ రహదారుల సంస్థ ఆర్.ఓ. రాజాక్‌ను ఆదేశించారు. అంతేగాక, ఎన్.హెచ్-645ను గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మించేందుకు డీపీఆర్ కూడా సిద్ధంగా ఉందని తెలిపిన మంత్రి, ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో మరింత చురుగ్గా పనులు చేయాలని చెప్పారు. ఒక్క ఆర్‌ఆర్‌ఆర్ పనులు ప్రారంభమైతే రాష్ట్రానికి ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు,



డిస్నీల్యాండ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు, ట్రాన్స్‌పోర్ట్ హబ్‌లు, పారిశ్రామిక కారిడార్లు ఏర్పడి రాష్ట్రం ఎంతో అభివద్ధిని సాధిస్తుందని మంత్రి అధికారులకు చెప్పారు. మన్నెగూడ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంపై అధికారులను మంత్రి ప్రశ్నించారు. అయితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశానుసారం 930 చెట్లను రిలోకేట్ చేయాల్సి ఉండటంతో పాటు పలు అనుమతుల వల్ల ఆలస్యం అవుతుందని ఎన్‌హెచ్ అధికారులు చెప్పగా, చెట్లు లేకుండా రోడ్డు నిర్మాణానికి అనువుగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డు ఎందుకు నిర్మించడం లేదని మంత్రి తిరిగి ప్రశ్నించారు.

ఇక ఆర్మూర్-మంచిర్యాల జాతీయ రహదారి కోసం 1573 ఎకరాల భూమి కావాల్సి ఉండగా ఇప్పటికే 1309 ఎకరాలు సేకరించామని చెప్పిన అధికారులు, మిగతా పనులను ఈ నెలలో పూర్తి చేస్తామని మంత్రికి వివరించారు. వీటితోపాటు ఉప్పల్-ఘట్‌కేసర్ ఫ్లై ఓవర్ పనులపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాల మేరకు టెండర్లు ఫోర్ క్లోజ్ చేసి కొత్త టెండర్లు పిలుస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా సంస్థలను ఖరారు చేసి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎల్బీనగర్-మల్కాపూర్ రోడ్డులో మన్నెగూడ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద నిర్మించాల్సిన బ్రిడ్జి సమస్యలపై మంత్రికి అధికారులు వివరించగా, త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, జాయింట్ సెక్రెటరీ హరీశ్‌తో పాటు జాతీయ రహదారుల సంస్థ ఆర్.ఓ. రజాక్, రీజినల్ ఆఫీసర్ కుష్వాతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



నీట్ లీకేజీపై మోడీ స్పందించాలి

విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నం
- విద్యార్థి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-అంబర్‌పేట

'పరీక్షా పే చర్చ' నిర్వహించే ప్రధాని మోడీ.. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై మాట్లాడకపోవడం సిగ్గు చేటని, వెంటనే స్పందించాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ బర్కత్‌పురాలోని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు యత్నించారు. పోలీసులు భారీగా అక్కడకు చేరుకుని నేతలను కిషన్‌రెడ్డి ఇంటివైపు వెళ్లకుండా బర్కత్‌పురాలో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు విద్యార్థి, యువజన నాయకులకు మధ్య తోపులాట జరిగింది. దాంతో కొద్ది సేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం విద్యార్థి, యువజన నేతలను అరెస్టు చేసి కాచిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ హైదరాబాద్ నగర అధ్యక్షుడు అభిజిత్ మాట్లాడుతూ.. నీట్ సమస్యపై చర్చించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరితే ఇవ్వలేదని, అందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా పరీక్షతో పాటు, ఎన్టీఏను రద్దు చేయకుండా ప్రధాని మోడీ మౌనంగా ఉండటం దురదృష్టకరమన్నారు. నీట్‌పై ప్రధాని తీరును చూస్తుంటే లీకేజీల వెనుక కేంద్ర ప్రభుత్వం, మోడీ హస్తం ఉందని అనుమానం కలుగుతోందన్నారు. నీట్ పరీక్షను, ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, కేంద్రం స్పందించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడితే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే దిశగా ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రితీష్‌రావు నాయకులు, శ్రీకర్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ చెగువేరా, పీవైఎల్, విజేఎస్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

జామకాయలు తెంపితే కట్టేసి కొడతారా?

- బాలుడిని చిత్రహింసలు పెట్టిన వారిని అరెస్టు చేయాలి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు డిమాండ్



నవతెలంగాణ-షాబాద్

జామ కాయలు తెంపితే కట్టేసి కొడతారా.. దళిత బాలున్ని తాళ్లతో కట్టేసి.. కొట్టి చిత్ర హింసలు పెట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కేసారం గ్రామంలో రిటైర్డు ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, అతని కుమారుడు కలిసి దళిత బాలుడు బేగరి యాదగిరిని తాళ్లతో కట్టేసి, కాళ్లతో తన్ని కులం పేరుతో దూషించి చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడ సామేల్, ఎం.ప్రకాష్ శరత్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్‌తో కలిసి స్కైలాబ్‌బాబు గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జామకాయలు తెంపుకున్నాడనే నెపంతో దళిత బాలుడు యాదగిరిని చిత్రహింసలు పెట్టడం సరైంది కాదన్నారు. పోలీసులు వెంటనే తండ్రీకొడుకును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

హేమంత్ సోరెన్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆయనకు స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు ఆయనకు అనుకూలంగా నినాదాలు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే తాను ఏ తప్పు చేయకపోయినా తప్పుడు కేసులో ఇరికించారని అన్నారు. భూ కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఈ ఏడాది జనవరి 31న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయనను అరెస్టు చేసింది. అరెస్టుకు ముందు ఆయన తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. నెల రోజులకు పైగా ఈ కేసును విచారించిన అనంతరం జస్టిస్ రంగన్ ముఖోపాధ్యాయ సోరెన్ తప్పు చేసినట్లు ప్రాథమిక ఆధారాలేవీ లేవని పేర్కొంటూ ఆయనకు బెయిలు మంజూరు చేశారు. ఇడి తరవపు న్యాయవాది వాదిస్తూ సాక్షి ఇచ్చిన వాంగ్మూలమే ఆధారమని చెప్పారు. హేమంత్ సోరెన్ తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాంచిలో 8.86 ఎకరాల భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఈడీ కేసు నమోదు చేసింది. 'నేరం చేసినందుకు వచ్చిన లాభం'గా ఇడి చేసిన వాదనను హైకోర్టు తిరస్కరించింది. 'పిటిషనర్ నేరానికి పాల్పడలేదని నమ్మడానికి కారణం వుంది.' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. రాంచిలోని శాంతినగర్‌లో 8.86 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడంలో సోరెన్‌కు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రమేయం వున్నట్లుగా కనిపించడం లేదని ఈ కేసును సమగ్రంగా పరిశీలిస్తే తెలుస్తోందని పేర్కొంది. కేసు రికార్డులను, ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిశీలించిన హైకోర్టు 'ఈ భూమి స్వాధీనంలో ఎక్కడా పిటిషనర్ సోరెన్‌కు ప్రత్యక్షంగా జోక్యం వుందనిపించేలా రిజిస్టర్ కానీ రెవిన్యూ రికార్డులు కానీ లేవని' పేర్కొంది. 2010లోనే ఈ భూమిని సోరెన్ స్వాధీనం చేసుకున్నారని సాక్షుల స్టేట్‌మెంట్లు పేర్కొంటుండగా, 'సకాలంలో తీసుకున్న చర్య వల్ల భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకో కుండా నివారించగలిగాం' అని ఇడి చెప్పడాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రూ.50వేల చొప్పున రెండు పూచీ కత్తులపై ఆయనకు బెయిల్‌మంజూరు చేసింది.

నాణ్యమైన కరెంటివ్వండి

- బోనాల ఏర్పాట్లపై సీఎమ్‌డీ ముషారఫ్ సమీక్ష



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బోనాలు పండుగ సందర్భంగా ప్రజలకు నాణ్యమైన కరెంటును సరఫరా చేయాలని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ అధికారుల్ని ఆదేశించారు. జులై 7 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు బోనాల వేడుకలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారంనాడిక్కడి కార్పొరేట్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్లు (సీఈ), సూపరింటెండింగ్ ఇంజనీర్ల (ఎస్ఈ)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోనాలు పండుగ ప్రారంభానికి ముందే విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనుల్ని పూర్తి చేయాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి, పనుల్ని పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి దేవాలయానికి ఓ నోడల్ అధికారి, ఏఈని కేటాయించాలనీ, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఆర్ అండ్ బీ శాఖతో పాటు ఆలయ కమిటీలతో సమన్వయం చేసుకోవాలనీ, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, తాత్కాలిక లైట్లు, ఎయిర్ కండిషనింగ్, సౌండ్ సిస్టమ్ మొదలైన వాటిని ముందస్తుగా సమకూర్చుకోవాలని చెప్పారు. విద్యుత్ సిబ్బంది, అధికారులు 24 గంటలు విధుల్లో ఉండాలనీ, ప్రజలు గుమిగూడే చోట్ల కరెంటు స్తంభాలు షాక్ కొట్టకుండా తనిఖీలు చేయా లనీ, ఎక్కడా విద్యుత్ లీకేజీలు ఉండరాదని ఆదేశించారు. ప్రతి గంటకూ విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల రీడింగ్‌లు తీసుకోవాలనీ, ఏదైనా అసాధారణంగా కనిపిస్తే వెంటనే సరిదిద్దాలని చెప్పారు. సమా వేశంలో ఇంచార్జి డైరెక్టర్లు నందకుమార్, డాక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజనీర్లు కె సాయి బాబా, ఎల్ పాండ్య వి శివాజీ, పి బిక్షపతి, పి ఆనంద్, సిజీఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బడులు' శిథిలం.. సౌకర్యాలు అధ్వమం..!

- ఎన్నో ఏండ్లుగా మరమ్మతులు బంద్
- అధ్వానంగా గిరిజన ప్రాథమిక పాఠశాలలు
- అవస్థల మధ్యే గిరి విద్యార్థుల చదువు
- ఆలస్యంగా 'అమ్మ ఆదర్శం' నిధుల విడుదల



ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు అధ్వాన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గోడలు పగుళ్లు తేలి.. స్లాబ్‌లు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. కిటికీలు విరిగిపోయి.. తలుపులు పగిలిపోయి దుర్భరంగా ఉన్నాయి. ఏండ్ల కిందట నిర్మించిన భవనాలు కావడంతో శిథిలమవుతున్నాయి. మధ్యలో కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. ప్రభుత్వం ఈ బడులను కూడా అమ్మ ఆదర్శ పాఠశాలల తరహాలోనే మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని సంకల్పించినా.. నిధుల విడుదలలో ఆలస్యం వల్ల గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో ఇంకా ప్రారంభించలేదు. గిరిజన ఆశ్రమ పాఠశాలలను 'నవతెలంగాణ' పరిశీలించగా.. అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

▸▸గాదిగూడ మండలం పర్సువాడ(కే) పంచాయతీ పరిధిలోని ధర్మగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడి పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో విద్యార్థులకు చెట్ల కింద చదువులు చెబుతున్నారు.

▸▸ఆదిలాబాద్ గ్రామీణ మండలం అంకోలి పంచాయతీ పరిధిలోని చింతగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పరిస్థితి ఇది. ఇక్కడి పాఠశాల భవనం పగుళ్ల తేలడంతో పాటు కింద ఫ్లోరింగ్ గుంతలు పడింది. కిటికీలు కూడా లేకపోవడంతో విష పురుగులు లోనికి వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన ప్రాథమిక పాఠశాలలు 900 ఉన్నాయి. ఒకటి, రెండు తరగతులుంటాయి. ఆ పాఠశాలల పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పాఠశాలల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 'అమ్మ ఆదర్శం' కింద నిధులు కేటాయించారు. ఆయా గ్రామాల్లో ఏండ్ల కిందట నిర్మించిన ఈ పాఠశాలల భవనాలు చాలా చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. స్లాబ్ పెచ్చులూడిపోయి ఉండటంతో వర్షం వచ్చినప్పుడు తరగతి గదుల్లోకి నీరు చేరుతోంది. మరోపక్క కింద ఫ్లోరింగ్‌కు గుంతలు పడి కూర్చునేందుకు వీల్లేకుండా మారాయి. కిటికీలకు తలుపులు ఊడిపోవడంతో వర్షం జల్లు నేరుగా తరగతి గదిలోకి వస్తోందని పిల్లలు చెబుతున్నారు. వంట గదులు ప్రత్యేకంగా లేకపోవడం కూడా సమస్యగా మారుతోంది. కొన్ని చోట్ల తరగతి గదుల్లో కూర్చునేందుకు వీల్లేకుండా ఉండటంతో చెట్ల కిందనే చదువులు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మరోపక్క అనేక చోట్ల ఇప్పటికే ఉన్న విద్యుత్ సరఫరాను కూడా తొలగించడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని ఓ పాఠశాలలో కనెక్షన్ లేని విద్యుత్ మీటరుకు పిట్టగూడు పెట్టడం గమనార్హం. మరో పాఠశాలలో ఫ్యాన్లు ఉన్నా కరెంటు సరఫరా లేకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది.

ప్రారంభంకాని పనులు..!

ఇప్పటికే జిల్లా పరిషత్, ప్రభుత్వరంగ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మౌలిక వసతులు కల్పిస్తున్నారు. మేజర్, మైనర్ రిపేర్లు, విద్యుద్దీకరణ, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా చేపడుతున్న ఈ పనులు దాదాపు 80శాతం పాఠశాలల్లో పూర్తి కావచ్చాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వీటి మాదిరిగానే ఐటీడీఏ పరిధిలోని సుమారు 900 గిరిజన ప్రాథమిక బడులను సైతం తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తాజాగా ఇటీవల ఈ బడుల్లో మౌలిక సదుపాయాల కోసం ఒక్కో పాఠశాలకు రూ.25వేల చొప్పున నిధులు విడుదల చేసినట్టు అధికారవర్గాలు చెబుతు న్నాయి. కానీ ఒకటి, రెండు చోట్ల తప్పితే ఎక్కడా ఈ పనులు ప్రారంభం కాలేదు. కొన్ని గ్రామాల్లో ఈ పథకం కింద చేపడుతున్న పనులపై అవగాహన కూడా లేకపోవడం గమనార్హం. క్షేత్రస్థాయి వరకు ఈ పథకంపై ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించడం లేదని తెలుస్తోంది.

నిధులు ఆలస్యంగా మంజూరయ్యాయి
దిలీప్, ఐటీడీఏ డీడీ

ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమ్మ ఆదర్శ పాఠశాలల మాదిరిగా సౌకర్యాలు కల్పిస్తాం. నిధులు ఆలస్యంగా మంజూరు కావడంతో పనులు ప్రారంభం కాలేదు. త్వరలోనే ఆయా బడుల్లో పనులు మొదలుపెట్టి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం.

కాంగ్రెస్ చేతికి నల్లగొండ డీసీసీబీ

- నెగ్గిన అవిశ్వాసం
- నూతన చైర్మెన్‌గా శ్రీనివాస్ రెడ్డి !
- మహేందర్ రెడ్డికి వ్యతిరేకంగా 15 మంది డైరెక్టర్ల ఓటు
- సోమవారం చైర్మెన్ ఎన్నిక



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ.. 14 మంది డైరెక్టర్లు ఈనెల 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని డీసీఓ కార్యాలయంలో డీసీఓ కిరణ్ కుమార్‌కు లేఖ అందజేశారు. దాంతో, శుక్రవారం ఉదయం 11 గంటలకు నల్లగొండ డీసీసీబీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. 15 మంది డైరెక్టర్లు మహేందర్ రెడ్డికి వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మహేందర్ రెడ్డి తన చైర్మెన్ పదవిని కోల్పోయారు. నూతనంగా చైర్మెన్ బాధ్యతలను కాంగ్రెస్ పార్టీకి చెందిన కుంభం శ్రీనివాస్ రెడ్డి చేపట్టే అవకాశం ఉంది. కొత్త చైర్మెన్ ఎన్నిక జరిగే వరకు, ప్రస్తుతం వైస్ చైర్మెన్‌గా కొనసాగుతున్న దయాకర్‌రెడ్డి ఇన్‌చార్జి చైర్మెన్‌గా వ్యవహరించనున్నారు.

ఎలాంటి రాజకీయ కోణమూ లేదని డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. నల్లగొండ డీసీసీబీలో మరోసారి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరిందన్నారు. రాజకీయాలకతీతంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా బ్యాంకును ముందుకు తీసుకుపోతామన్నారు. రైతులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందనో బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉందనో అవిశ్వాసం పెట్టలేదన్నారు. కేవలం మహేందర్ రెడ్డి ఒంటెద్దు పోకడలు, అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెట్టామని చెప్పారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్లు ఎసిరెడ్డి దయాకర్ రెడ్డి, పాశం సంపత్ రెడ్డి, అంజయ్య, గుడిపాటి సైదులు, వీరస్వామి, కొండా సైదులు, కోడి సుష్మ, కరుణ, అనురాధ, అందేల లింగయ్య యాదవ్, రామచంద్రయ్య, జూలూరు శ్రీనివాస్, జయరాం నాయక్, బంటు శ్రీను, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ జూకూరి రమేష్ పాల్గొన్నారు.

మా భూములు మాకివ్వండి

- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రికి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ (పీఎస్‌యూ)లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కేటాయించిన భూములను వెనక్కు తిరిగి ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం కింద విక్రయించాలని నిర్ణయించినందున వీటి మిగులు భూములను తిరిగి అప్పగించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 ఏండ్లలో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయగా వాటికి అప్పట్లో వేలాది ఎకరాల భూములను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖాయిలా పడిన ఆదిలాబాద్ సీసీఐ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించి స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరారు. 4 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ సిమెంటు పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం 2,100 ఎకరాల సున్నపు రాతి గనులతో పాటు మొత్తం 2,290 ఎకరాల భూమిని ఉచితంగా అందజేసిందని గుర్తు చేశారు. దీనిని ప్రయివేట్ పరం చేసే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. తెలంగాణాలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నందున కొత్తగా ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రీస్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం ముందుంది. ఇక్కడ భూములు, నీరు, విద్యుత్తు అవసరాల మేరకు అందుబాటులో ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో శిక్షణ పొందిన మానవ వనరులకు కొదవ లేదని, ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ స్థాయిల్లో స్కిల్డ్ మ్యాన్ పవర్ సమృద్ధిగా ఉందని వెల్లడించారు. రాష్ట్రాన్ని సందర్శించి ఇక్కడి అభివద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్న రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అభ్యర్థనకు కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. త్వరలో హైదరాబాద్‌కు వచ్చి తన దృష్టికి తెచ్చిన అన్ని విషయాలపై అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

నీట మునిగిన ఢిల్లీ

- 88 ఏండ్ల తరువాత రికార్డు వర్షపాతం
- కూలిన విమానాశ్రయం టెర్మినల్ 1 పైకప్పు
- ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు




న్యూఢిల్లీ : ఢిల్లీ - దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)ను భారీ వర్షాలు ముంచెత్తాయి. గురువారం నుంచి ప్రారంభమైన ఈ భారీ వర్షాలతో ఢిల్లీ నీట మునిగింది. అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, ట్రాఫిక్ జామ్, విద్యుత్- మంచి నీటి సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలతో జనజీవనం అవస్థవ్యవస్థమయింది. 24 గంటల వర్షపాతం విషయంలో 88 ఏండ్ల తర్వాత రికార్డుస్థాయి వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 8.30 నుంచి శుక్రవారం ఉదయం 8.30 వరకు 24 గంట వ్యవధిలో ఢిల్లీలో 228 మి.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు తెలిపారు. 1936 జూన్‌లో 24 గంటల వ్యవధిలో 235.5 మీమీ వర్షపాతం తరువాత ఇదే అత్యధికమని చెప్పారు. సాధారణంగా జూన్‌లో సగటును 80.6 మీమీ వర్షపాతం కురుస్తుంది. గురువారం నుంచి కురుస్తున్న వర్షాలతో ఢిల్లీ వాతావరణం చల్లబడింది. గత రెండు నెలల నుంచి ఢిల్లీలో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం మాత్రం కనిష్ట ఉష్ణోగ్రత 24.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. భారీ వర్షాలతో ఢిల్లీ రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో సాధారణ ప్రజలే కాదు.. ఎంపీలు సైతం ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై నీరు నిలిచి ఉండడంతో ఎస్‌పి ఎంపి రామ్‌గోపాల్ యాదవ్ పార్లమెంటుకు వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన సిబ్బంది చేతుల్లో మోసి కారులో కూర్చోబెట్టారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. 'పార్లమెంట్ సమావేశాలకు వెళ్లేందుకు నేను చాలా ఇబ్బందిపడ్డాను. ఉదయం 4 గంటల నుంచి ఎంసీడీ అధికారులతో మాట్లాడినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. రోడ్డుపై నిలిచిన వర్షం నీటిని మోటార్ ద్వారా తొలగించి ఉంటే బాగుండేది. రెండు రోజుల కిందటే బంగ్లా మొత్తం ఫ్లోరింగ్ పనులు చేయించాము. వర్షం వల్ల లక్షల్లో నష్టం వాటిల్లింది.' అని తెలిపారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణ లోపంపై ఆయన మండిపడ్డారు.

తన ఒక్క బంగ్లానే కాదు.. హోమ్‌శాఖ సహాయ మంత్రి, ఆర్మీ జనరల్స్, నేవీ అడ్మిరల్స్ బంగ్లాలు కూడా జల దిగ్బంధంలో చిక్కుకున్నాయని, వీరందరూ కూడా ఇబ్బందులు పడుతున్నారని రామ్ గోపాల్ యాదవ్ చెప్పారు. ట్రాఫిక్ జామ్‌లతో పాటు చాలా కాలనీల్లో విద్యుత్, మంచినీటి సరఫరా నిలిచిపోయింది. మింటో రోడ్డులో ఒక ట్రక్కు పూర్తిగా నీట మునిగింది.

కూలిన విమానాశ్రయం టెర్మినల్ 1 పైకప్పు
ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు

భారీ వర్షాల కారణంగా ఢిల్లీ విమానాశ్రయం టెర్మినల్1 పై కప్పు కూలిపోయింది. శుక్రవారం ఉదయం 5:00 గంటల సమయంలో డిపార్చర్ గేట్ 1, గేట్ 2 వద్ద టెర్మినల్ 1 పై కప్పు కూలిపోవడంతో ఈ ప్రమాదంలో ఒక క్యాబ్ డ్రైవర్ మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. ఈ ప్రమాదం వార్త తెలిసినవెంటనే సంఘటన స్థలానికి అధికారులు మూడు ఫైర్ టెండర్లను తరలించారు. క్షతగాత్రులను సమీపంలోని మేదాంత ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. అలాగే ఈ ప్రమాదంలో నాలుగు వాహనాలు దెబ్బతిన్నాయి. వీటిలో ఒక కారు నుంచి ఒకరిని రక్షించారు. ఈ ప్రమాదంతో టెర్మినల్ 1ను పూర్తిగా ఖాళీ చేసి మూసివేశారు. ప్రమాద ప్రాంతాన్ని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. పరిస్థితిని సమీక్షించారు. మృతి కుటుంబానికి రూ. 20 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ .3 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేయడానికి సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ విమానాశ్రయ అధికారులు ప్రకటించారు. కాగా, టెర్మినల్ 1 డిపార్చర్ హాల్‌ను విస్తరణ పనుల తరువాత ఈ ఏడాది మార్చిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. అయితే శుక్రవారం ఉదయం కుప్పకూలిన భవనం యొక్క భాగాన్ని 2008-2009లో నిర్మించారని మంత్రి రామ్మోహన్ నాయుడు తెలపడం విశేషం. కాగా, టెర్మినల్ 1 పై కప్పు కూలడం, భారీ వర్షాల కారణంగా అనేక విమాన సర్వీసులను శుక్రవారం, శనివారం రద్దు చేశారు. కొన్ని సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. తమ విమాన సర్వీసులను నిర్ధారణ చేసుకున్న తరువాతే వినియోగదారులు విమానశ్రయానికి రావాలని ఇండిగో వంటి సంస్థలు ప్రయాణీకులకు విజ్ఞప్తి చేశాయి. అదేవిధంగా ఢిల్లీల్లో మరో వారం రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా ఆదివారం భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు.

కేసీఆర్ పిటిషన్ విచారణార్హతపై తీర్పు రిజర్వు





(ఫైల్)

నవతెలంగాణ -హైదరాబాద్

భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన నిర్ణయాల్లో లోటుపాట్లును తేల్చేందుకు జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు సవాల్ చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా? లేదా? అనే దానిపై తీర్పును కోర్టు రిజర్వు చేసింది. రెండు పక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును సోమవారం ప్రకటిస్తామని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ చెప్పింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, కేసీఆర్ పిటిషన్‌ను తొలి దశలోనే కొట్టేయాలని కోరారు. చట్ట ప్రకారమే కమిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. కమిషన్ తప్పు చేయలేదన్నారు. విలేకరుల సమావేశంలో జస్టిస్ నర్సింహారెడ్డి ఎవరిపైనా తప్పుడు ఆరోపణలు చేయలేదనీ, ఏవిధమైన అభియోగాలు చేయలేదన్నారు. మూడో ప్రతివాదిగా హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి వ్యక్తిగత ప్రతివాదిగా ఉన్నారనీ, ఆయనకు నోటీసులు జారీ చేయొద్దని కోరారు.

ఇప్పటికిప్పుడు ఆదేశాలు ఇవ్వబోమనీ, రెండు వైపులా వాదనలు విన్నాకే ఉత్తర్వులు ఇస్తామని కోర్టు చెప్పింది. ఏజీ వాదిస్తూ, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వం మధ్య జరిగిన కేసు తీర్పు ప్రకారం పిటిషన్‌ను డిస్మిస్ చేయాలన్నారు. కమిషన్ విచారణ నివేదికను మాత్రమే ఇస్తుందనీ, న్యాయపరమైన ప్రక్రియలు చేపట్టదనీ, నిజ నిర్ధారణ కమిషన్ అడ్డుకునేందుకు నిరాకరించిందని గుర్తు చేశారు. ఆ తీర్పును పిటిషనర్ తరుపు న్యాయవాది తనకు అనుకూలమని ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్‌ను విచారణకు హాజరుకావాలని కమిషన్ ఈ నెల 19న రెండోసారి నోటీసు జారీ చేస్తే అది వేధింపు ఎలా అవుతుందన్నారు. ఇప్పటి వరకు కమిషన్ 15 మంది సాక్షులను విచారించిందనీ, జెన్‌కో, ట్రాన్స్‌కో, ఆ సంస్థల చైర్మెన్‌గా చేసిన ప్రభాకర్‌రావు, విద్యుత్ శాఖ అధికారులనూ విచారించిందని తెలిపారు.

బహిరంగ విచారణ చేస్తున్నందున కొన్ని విషయాలను కమిషన్ వెల్లడిస్తే తప్పుకాదన్నారు. పిటిషనర్‌కు 8బి నోటీసు జారీ సబబేనని చెప్పారు.కేసీఆర్ తరపున సీనియర్ అడ్వకేట్ ఆదిత్య సోంధి వాదిస్తూ, గత మార్చి 14న జారీ చేసిన జీవో 9లో జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఉందనీ, ఎంక్వయిరీ కమిషన్ అని చెప్పి జ్యుడీషియల్ కమిషన్ వేయడం ఏమిటని ప్రశ్నించారు. కమిషన్ విచారణ పూర్తి కాకుండానే విద్యుత్ కొనుగోళ్లు, విద్యుత్ థర్మల్ ప్లాంట్ల ఏర్పాట్ల వల్ల ప్రభుత్వానికి ఆర్థిక నష్టాలొచ్చాయని నర్సింహారెడ్డి మీడియాకు చెప్పారన్నారు. కమిషన్ నిజ నిర్ధారణ కోసమే అయినప్పుడు ఆ విధంగా చెబితే తప్పేముందని హైకోర్టు ప్రశ్నించగా, థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ వ్యవహారంలో రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు నష్టం వచ్చిందని చెప్పడం వల్ల తుది నివేదిక ఏవిధంగా ఉంటుందనేది చెప్పకనే చెప్పారని ఆదిత్య వాదించారు.

గతంలో ఒక కమిషన్ విషయంలో ఇదే విధంగా విలేకరులకు వివరాలు చెబితే ఇదే హైకోర్టు ఆ కమిషన్‌ను రద్దు చేసిందని గుర్తు చేశారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

కవితతో హరీశ్‌రావు ములాఖాత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తీహార్ జైలులో ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు శుక్రవారం ఉదయం ములాఖాత్ అయ్యారు. ఆయన కవిత యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కవితకు ధైర్యంగా ఉండాలని సూచించారు.

నేడు వరంగల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటించనున్నారు. అక్కడ టెక్స్ టైల్ పార్క్‌తో పాటు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆయన సందర్శించనున్నారు. హనుమకొండ ఐడిఓసీ వద్ద మహిళా శక్తి క్యాంటీన్‌ను రేవంత్ ప్రారంభిస్తారు. అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) అభివృద్ధిపై సమీక్ష నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం హనుమకొండలో మెడికోవర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు

317 జీవో అమలులో ఉన్న సందేహాల నివృత్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ గురుకుల సంస్థలో 317 జీవో అమలులో ఉన్న సందేహాలను ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి నివత్తి చేశారని గురుకుల జేఏసీ టిగారియా నేతలు నారాయణ, మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యక్ష పద్ధతిలో సాఫీగా జరిగే కౌన్సిలింగ్ వల్ల ప్రతి ఉపాధ్యాయుడికి న్యాయం జరుగుతుందని తెలిపారు. కోర్టు కేసులో ఉన్న మిత్రులు కూడా ఆలోచించి అవసరమైతే కేసులు ఉపసంహరించుకోవాలని కోరారు.

బిజినెస్

శ్రీరామ్ ఫార్మ్ నుంచి ఐదు పంట సంరక్షణ ఉత్పత్తులు

హైదరాబాద్ : ఐదు రకాల నూతన తరం పంట సంరక్షణ, స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ ఉత్పత్తులను ఆవిష్కరించినట్లు శ్రీరామ్ ఫార్మ్ సొల్యూషన్స్ తెలిపింది. హైదరాబాద్‌లో వీటిని ఛానెల్ భాగస్వాముల సమక్షంలో విడుదల చేసినట్లు ఆసంస్థ పేర్కొంది. కలుపు నిర్వహణ పరిష్కారానికి శ్రీరామ్ బికుటాను పరిచయం చేసినట్లు వెల్లడించింది. అదే విధంగా తన క్రిమిసంహారక పోర్ట్‌ఫోలియోలో శ్రీరామ్ సైషో, శ్రీరామ్ క్రోన్, శ్రీరామ్ ట్రెక్సురల్, స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ అయినా శ్రీరామ్ ప్రోటోబజ్‌ను పరిచయం చేసినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ చబ్రా తెలిపారు.

బిఎండబ్ల్యు మానుసూన్ సర్వీసు క్యాంపెయిన్

గూర్‌గావ్ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు గ్రూపు తన డీలర్ నెట్‌వర్క్ ద్వారా మాన్‌సూన్ సర్వీస్ క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ క్యాంపెయిన్‌లో వర్షాకాల సీజన్‌కు గాను కార్ల భద్రతను, పనితీరును మెరుగుపరచడానికి మెయింటెయినెన్స్, అవసరమైన అప్‌గ్రేడ్‌లతో కారును పూర్తిగా సంసిద్ధంగా రూపొందించి ఇవ్వనున్నట్లు బిఎండబ్ల్యు గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పవాహ్ పేర్కొన్నారు.

మ్యాక్స్ ఫ్యాషన్‌లో మాన్యా సేల్ ఆఫర్లు

హైదరాబాద్ : మ్యాక్స్ ఫ్యాషన్‌లో మాన్యా సేల్ ఆఫర్లను ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఇందులో రూ.399 లోపే అందరికీ అందుబాటులో ఉండే అద్భుత కలెక్షన్లను అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఆఫర్లు తమ అన్ని స్టోర్లలో అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. తమ ఉత్పత్తులు, బ్రాండెడ్ క్లాతింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని తమ వినియోగదారుల కోసం అతి తక్కువ ధరలో ఆకర్షణీయ కలెక్షన్లను అందుబాటులోకి తెచ్చినట్లు మ్యాక్స్ ఫ్యాషన్ పేర్కొంది.

ఆన్‌లైన్‌లోనూ ప్రత్యక్ష పన్ను వసూళ్ల సేవలు

- బంధన్ బ్యాంక్ వెల్లడి

ముంబయి : తమ బ్యాంక్ ఆన్‌లైన్‌లోనూ ప్రత్యక్ష పన్నుల వసూళ్ల సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందని బంధన్ బ్యాంక్ తెలిపింది. దేశ వ్యాప్తంగా తమ కస్టమర్లతో పాటు ఇతర ఖాతాదారులు కూడా దీన్ని ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. ఆదాయపు పన్ను శాఖకు చెందిన టిన్ 2.0 ప్లాట్‌ఫాం ద్వారా ఈ సేవలను అందించనున్నట్లు తెలిపింది. తమ 1700 పైగా శాఖల ద్వారా ఆఫ్‌లైన్‌లో కూడా ప్రత్యక్ష పన్నుల చెల్లింపులను స్వీకరిస్తున్నట్లు గుర్తు చేసింది.

హెచ్‌డిఎఫ్‌సి ఎర్గోతో ట్రూకాలర్ జట్టు

న్యూఢిల్లీ : డిజిటల్ కమ్యూనికేషన్ మోసాల నుంచి వినియోగదారులకు మెరుగైన రక్షణ కల్పించే లక్ష్యంతో అంతర్జాతీయ కమ్యూనికేషన్ సంస్థ ట్రూకాలర్‌తో హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఫ్రాడ్ ఇన్సూరెన్స్ పథకాన్ని విడుదల చేశాయి. ఈ ఫ్రాడ్ ఇన్సూరెన్స్ ఉత్పత్తి అండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు రూ.10,000 వరకు కవరేజ్ అందిస్తుందని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో పేర్కొంది. ఈబ సమగ్ర బీమా పథకం డిజిటల్ కమ్యూనికేషన్స్ మోసాల నుంచి రక్షణతో పాటు ఆర్థిక సమిష్టితత్వాన్ని ప్రోత్సహిస్తుందని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో ప్రతినిధి వికాస్ సికండ్ పేర్కొన్నారు.

జులై 18 నుంచి డీఎస్సీ రాతపరీక్షలు

ఆగస్టు 5 వరకు నిర్వహణ

- ఆన్‌లైన్‌లో రోజు రెండు విడతల్లో
- పూర్తిస్థాయి షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మెగా డీఎస్సీ రాతపరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో ఆన్‌లైన్‌లో వచ్చేనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు ఐదో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పోస్టు కేటగిరీ, మాధ్యమం వారీగా డీఎస్సీ రాతపరీక్షలకు సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం విడుదల చేశారు. మెగా డీఎస్సీకి 2,79,966 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సంగతి విదితమే. ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో రెండో విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల 18న మొదటి విడతలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్), స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) తెలుగు మాధ్యమం అభ్యర్థులకు రాతపరీక్షలుంటాయని పేర్కొన్నారు.

రెండో విడతలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టుకు హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, కన్నడ, తెలుగు మాధ్యమాల్లో పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు.

అదేనెల 19న మొదటి విడత, రెండో విడతలో ఎస్జీటీ తెలుగు మాధ్యమం అభ్యర్థులకు పరీక్షలుంటాయని వివరించారు. ఆగస్టు ఐదో తేదీన మొదటి విడతలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు మాధ్యమంలో, రెండో విడతలో లాంగ్వేజ్ పండిట్ (హిందీ) అభ్యర్థులకు రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.


(ఫైల్)

మెగా డీఎస్సీ ఆన్‌లైన్‌లో రాతపరీక్షల వివరాలు

పరీక్ష తేదీ		కేటగిరీ	మాధ్యమం
జులై 18న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)	తెలుగు
		స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	
	రెండో విడత	పీఈటీ	హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, కన్నడ
జులై 19న	మొదటి విడత	ఎస్జీటీ	తెలుగు
	రెండో విడత	"	"
జులై 20న	మొదటి విడత	ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)	తెలుగు, ఉర్దూ
జులై 22న	మొదటి విడత	ఎస్జీటీ	తెలుగు
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	ఇంగ్లీష్,
హిందీ, కన్నడ			
			మరాఠీ, తెలుగు, ఉర్దూ
జులై 23న	మొదటి విడత	ఎస్జీటీ	ఇంగ్లీష్, తెలుగు
	రెండో విడత	"	తెలుగు
జులై 24న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్)	తెలుగు
జులై 25న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)	--
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ, తెలుగు,ఇంగ్లీష్, మరాఠీ)	
జులై 26న	మొదటి విడత	లాంగ్వేజ్ పండిత్ (తెలుగు)	--
		ఎస్జీటీ	హిందీ, బెంగాలీ, కన్నడ తమిళం, ఉర్దూ, మరాఠీ
	రెండో విడత	పీఈటీ	తెలుగు
జులై 30న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్)	హిందీ,
తెలుగు, ఉర్దూ, మరాఠీ			
	రెండో విడత	"	ఇంగ్లీష్, తెలుగు
జులై 31న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	తెలుగు హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ,
మరాఠీ			
		స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్)	తెలుగు
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	తెలుగు, ఉర్దూ
ఆగస్టు 1న	మొదటి విడత	ఎస్జీటీ	ఇంగ్లీష్, తెలుగు
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్)	తెలుగు
ఆగస్టు 2న	మొదటి విడత	లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	--
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	తెలుగు, ఉర్దూ
		స్కూల్ అసిస్టెంట్ (హిందీ, కన్నడ, మరాఠీ, సంస్కృతం, ఉర్దూ)	
ఆగస్టు 5న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు
	రెండో విడత	లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	

ఒకే వేదికపైకి చంద్రబాబు, రేవంత్..

- వచ్చే నెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో కమ్మ మహాసభ
- హాజరుకానున్న ఇరువురు సీఎంలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌లు ఒకే వేదికను పంచుకోనున్నారు. వచ్చే నెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే కమ్మ మహాసభకు వారిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సీఎంలుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు, రేవంత్ ఇప్పటి వరకూ కలుసుకోలేదు. అందువల్ల జులైలో వారి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. గత డిసెంబరులో రేవంత్ సీఎంగా ప్రమాణం చేసినప్పటికీ... అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ కాలేదు. అటువైపు నుంచి జగన్ కూడా రేవంత్‌ను కలవలేదు. ఈలోగా ఏపీలో ఎన్నికలు రావటం, ఆ తర్వాత జగన్ ఓడిపోవటం చకచకా జరిగాయి. అనంతరం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రేవంత్‌కు ఆహ్వానం అందిందా? లేదా ? అన్నది తెలియదుగానీ, ఆయన ఆ కార్యక్రమానికి హాజరు కాలేదు. చంద్రబాబు ఎన్డీయే కూటమిలో ఉన్న నేపథ్యంలో... ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎంగా రేవంత్ ఆ కార్యక్రమానికి గైర్హాజరయ్యారనే అభిప్రాయాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో త్వరలో జరగబోయే వీరిద్దరి భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒకే వేదికను పంచుకోనున్న సీఎంలు ఇరు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలపై చర్చిస్తారా? లేదా..? అన్నది వేచి చూడాలి. కాగా కమ్మ మహాసభకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా హాజరుకానున్నారని నిర్వాహకులు జెట్టి కుసుమకుమార్ తెలిపారు.

పీవీ గొప్ప దార్శనికుడు

- మాజీ సీఎం కేసీఆర్ నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టిన గొప్ప దార్శనికుడని మాజీ సీఎం కేసీఆర్ కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలేసిన కేసీఆర్ దేశానికి మాజీ పీఎం చేసిన సేవలను స్మరించుకున్నారు. పీవీ తెలంగాణ బిడ్డ కావటం మనందరికీ గర్వకారణమని తెలిపారు. బహుభాషా కోవిదుడైన పీవీ తన ప్రజ్ఞా పాఠవాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కవిగా, కథకుడిగా, మేధావిగా, సంస్కరణ శీలిగా ఆయన దేశానికి చేసిన సేవలను ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారని నివాళులర్పించారు.

పాడి రైతులు ఆందోళన చెందొద్దు

- విజయా డెయిరీ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విజయ తెలంగాణ పాడి రైతులకు గిట్టుబాట ధర కల్పించాలనే సదుద్దేశంతో ఎన్నడూ లేని విధంగా పాల సేకరణ ధరను పెంచామని విజయ డెయిరీ అని ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో పాలసేకరణ పెరగడంతో రైతులకు చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నదని తెలిపింది. రైతులు ఆందోళన చెందొద్దనీ, త్వరలోనే బకాయి బిల్లులు చెల్లిస్తామని రైతులకు విజ్ఞప్తి చేసింది.

గెస్ట్ లెక్చరర్లు కొనసాగింపు

- ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను 2024-25 విద్యాసంవత్సరంలో కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ శృతి ఓజా శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గత విద్యాసంవత్సరంలో పనిచేసిన వారిని ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్వర్వులను విడుదల చేయడం పట్ల గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ హర్షం ప్రకటించారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి

- ఆదాయపు పన్ను పరిమితిని పెంచండి
- కేంద్ర ఆర్థిక మంత్రికి టీఎన్జీవో, టీజీవో వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని టీఎన్జీవో, టీజీవో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఆదాయపు పన్ను పరిమితిని రూ.రెండున్నర లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచాలని కోరాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కె నిర్మలాసీతారామన్‌ను శుక్రవారం టీఎన్జీవో, టీజీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న పన్ను విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు దాదాపుగా మూడు నెలల వేతనాన్ని ఆదాయపన్ను పరిధి కింద కోల్పోతున్నారని తెలిపారు. మెడికల్ ఖర్చులు, విద్య మీద పెట్టే ఖర్చులు పెరుగుతున్న సందర్భంగా అదనంగా రూ.ఏడున్నర లక్షలకు ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని పేర్కొన్నారు. సేవింగ్ పరిమితిని రూ.ఒకటిన్నర లక్షల నుంచి రూ.నాలుగు లక్షలకు పెంచాలని కోరారు. హౌసింగ్ రుణాల మీద వడ్డీని రూ.4.50 లక్షలకు పెంచాలని సూచించారు. మెడికల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి రూ.25 వేల పరిమితిని రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ అంశాల పట్ల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీపీఎస్ రద్దు విషయంలో కేంద్రం పరిధిలో ఒక కమిటీని వేశామనీ, ఆ నివేదిక వచ్చిన తర్వాత అందులోని అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి తప్పకుండా సీపీఎస్‌ను రద్దు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆదాయపన్ను పరిధి పరిమితి విషయంలో తప్పకుండా మోడీ ప్రభుత్వం వేతన జీవులను ఆదుకునే పద్ధతిలో అతి త్వరలో కొత్త విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ విషయంలో ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం రాకుండా ఉండేటట్టు కేంద్ర ఆర్థిక శాఖ పక్షాన తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, టీజీవో నాయకులు రామారావు, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞశాలి పీవీ

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ పీవీ ఘాట్ వద్ద నివాళి

నవతెలంగాణ-సిటీబ్యూరో



నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి, బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని, దేశ ప్రధానిగా ఆయన సేవలు మరువలేనివని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పీవీ జ్ఞానభూమి, పీవీ ఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీవీ నూతన ఆర్థిక విధానాల రూపాశిల్పి అని, భూసంస్కరణలు, ఆర్థిక సంస్కరణలు తేవడంతో భారతదేశం ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్నారు.

ఫామ్ హౌస్‌కు పంపినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదు

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ఫామ్‌హౌస్‌కు పంపినా మాజీ సీఎం కేసీఆర్‌కు బుద్ధి రాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు.అధికారంపై ఆయన ఇంకా పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియాపాయింట్‌లో రామ్మోహన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. సీఎం కుర్చీ నుంచి జనం లాగి పడేసినా కేసీఆర్ వాస్తవాన్ని గ్రహించడం లేదన్నారు. బాద్‌షా సినిమాలో బ్రహ్మానందం క్యారెక్టర్‌లా ఆయన తీరు ఉందన్నారు. ప్రజాపాలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తావా? అని ప్రశ్నించారు. నిరుద్యోగుల సమస్యలంటూ కేటీఆర్ ఇంకా డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే సీతారామ ప్రాజెక్టు ఆలస్యం
ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే సీతారామ ప్రాజెక్టు ఆలస్యమైందని సత్తుపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే మట్టా రాగమయి విమర్శించారు. ఆ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు వరప్రదాయని అన్నారు. 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు ట్రయల్ రన్ పట్ల రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. 2014 కు ముందే మూడు వేల కోట్ల అంచనాతో దుమ్ముగూడెం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిందనీ, కేసీఆర్ రీ డిజైన్ పేరుతో కాలయాపన చేశారని విమర్శించారు. రూ. 18,500 వేల కోట్లకు అంచనా వ్యయం పెంచారనీ, ప్రాజెక్టు పూర్తి చేయకుండా సగం తొవ్వి వదిలేశారని గుర్తు చేశారు. నిర్వాసితులకు పరిహారం కూడా ఇవ్వలేదని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది 1.2 లక్షల ఎకరాలకు నీళు ఇవ్వబోతున్నట్టు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో టన్నల్‌ను వచ్చే ఏడాది పూర్తి చేసి సాగు నీరు అందిస్తామన్నారు. జిల్లాకు అండగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఆమె ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు.

జాతీయ ఉత్తమ టీచర్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

- రిజిస్ట్రేషన్‌కు తుది గడువు జులై 15

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాదికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి కేంద్ర విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వాటి సమర్పణకు వచ్చేనెల 15 వరకు గడువుందని పేర్కొన్నారు. దరఖాస్తులను http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ వెబ్‌సైట్‌ను సంప్రదించి ఎంపిక మార్గదర్శకాలు, ఇతర వివరాలను తెలుసుకోవాలని కోరారు.

దీర్ఘకాలిక ఆర్థిక లోటుపై అమెరికాకు ఐఎమ్ఎఫ్ హెచ్చరిక



అమెరికా లోటు బడ్జెట్లు, చేస్తున్న విపరీతమైన అప్పులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెరుగుతున్న ప్రమాదాన్ని తెలియజేస్తున్నాయని, అవి తక్షణమే పరిష్కరించబడాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్-ఐఎమ్ఎఫ్) గురువారం హెచ్చరించింది. అమెరికా జాతీయ రుణం 35 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటోందని డేటా చూపిస్తుంది. తాజా గణాంకాల ప్రకారం, అమెరికా ఫెడరల్ బడ్జెట్ లోటు 2022 ఆర్థిక సంవత్సరంలో 1.4 ట్రిలియన్ నుంచి గత సంవత్సరం 1.7 ట్రిలియన్లకు పెరిగింది. ద్రవ్యలోటు ఈ సంవత్సరం 1.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని అమెరికాలోని అధికారిక ఆర్థిక పర్యవేక్షణ సంస్థ అయిన కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ ఈ నెల ప్రారంభంలో అంచనా వేసింది. ఇది స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో 7శాతానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇటువంటి అధిక లోటులు, అప్పులు అమెరికా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు పెరుగుతున్న ప్రమాదాన్ని, అధిక ఆర్థిక ఫైనాన్సింగ్ ఖర్చులకు, పరిపక్వ బాధ్యతలను సజావుగా జరగడానికి పెరుగుతున్న ప్రమాదాన్ని సూచిస్తాయి అని అమెరికా ఆర్థిక విధానాలపై జరిపిన సమీక్షలో ఐఎమ్ఎఫ్ పేర్కొంది. ఈ దీర్ఘకాలిక ఆర్థిక లోటులు నిరంతర విధానపరమైన లోపాలను సూచిస్తాయి. వీటిని అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది అని అది జోడించింది. జనవరి 2023లో చట్టబద్ధంగా 31.4 ట్రిలియన్ డాలర్లుగా నిర్ణయించబడిన రుణ పరిమితిని అమెరికా అతిక్రమించింది. అమెరికా ట్రెజరీ నుండి ఆసన్న దివాళా గురించి నెలల తరబడి హెచ్చరికల తర్వాత అధ్యక్షుడు జో బైడెన్ జూన్ 2023లో రుణ బిల్లుపై సంతకం చేశారు. అది జనవరి 2025 వరకు పరిమితిని నిలిపివేసింది. ఇది ప్రభావవంతంగా వచ్చే ఏడాది వరకు పరిమితులు లేకుండా రుణాలు తీసుకోవడాన్ని ప్రభుత్వం అనుమతించింది. బిల్లు ఆమోదం పొందిన రెండు వారాలలోపే రుణభారం 32 ట్రిలియన్లకు పెరిగింది. అప్పటినుండి పెరుగుతూనే ఉంది. అమెరికా దూకుడు వాణిజ్య విధానాల పెరుగుదలను ఐఎమ్ఎఫ్ తీవ్రంగా విమర్శించింది. చైనాతో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా వ్యాపార పరిమితుల విస్తరణ, 2023 బ్యాంక్ వైఫల్యాల ద్వారా వెల్లడైన దుర్బలత్వాలు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయని ఐఎమ్ఎఫ్ పేర్కొంది. అమెరికా అధిక వ్యయంపై తాజాగా ఐఎమ్ఎఫ్ ఈ హెచ్చరిక చేసింది. అమెరికా రుణం-స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) నిష్పత్తి రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధికంగా ఉందని మంగళవారంనాడు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఇసిడి)పేర్కొంది. డెట్(అప్పు)-టు-జీడీపీ నిష్పత్తి ని ఒక దేశం చేసిన అప్పులను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఉపయోగిస్తారు.

ఓఇసిడి ప్రకారం గత సంవత్సరం అమెరికా రుణం దాని జీడీపీలో లో 122 శాతానికి పెరిగింది.

ప్రపంచ గమనం

బ్రిక్స్‌లో చేరేందుకు కాంగో ఆసక్తి



బ్రిక్స్‌లో సభ్యత్వం పొందేందుకు తమ దేశ ఆసక్తిని రిపబ్లిక్ ఆఫ్ కాంగో అధ్యక్షుడు డెనిస్ సస్సౌ న్గెస్సో వ్యక్తం చేశారు. ఆఫ్రికన్ నాయకుడు ఈ వారం రష్యా చేరుకున్నారు. అక్కడ అతను అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. ఆఫ్రికా దేశం బ్రిక్స్‌తో సంబంధాలను పెంపొందించుకోవడానికి ఆసక్తి చూపుతుందని గురువారంనాడు రష్యా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సస్సౌ న్గెస్సో నొక్కి చెప్పారు. 'బ్రిక్స్‌ను 2006లో బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా స్థాపించాయి. దక్షిణాఫ్రికా 2011లో చేరింది. ప్రస్తుతం రష్యా బ్రిక్స్ చైర్మెన్‌గా ఉంది. ఈ సంవత్సరం ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పూర్తి సభ్యులుగా మారినప్పుడు బ్రిక్స్ విస్తరించింది' అని తెలిపారు.

సస్సౌ న్గెస్సో మంగళవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన సందర్భంగా ఆఫ్రికన్ నాయకుడికి రష్యన్ ఆర్డర్ ఆఫ్ ఆనర్ లభించింది. రష్యన్ ఫెడరేషన్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో మధ్య సంబంధాల అభివృద్ధి, పటిష్టతలకు ఆయన చేసిన గణనీయమైన కృషికి డెనిస్ సాసౌ న్గెస్సో ఈ అవార్డును అందుకున్నారు.

ఈ సమావేశంలో, రష్యా-కాంగోల సంబంధాల అభివృద్ధికి సాసో న్గెస్సో గణనీయమైన వ్యక్తిగత సహకారం అందించాడని పుతిన్ మెచ్చుకున్నారు. సాసో న్గెస్సో రెండు రష్యా-ఆఫ్రికా శిఖరాగ్ర సమావేశాలలో పాల్గొన్నారు. మేము అన్ని రంగాలలో మా సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాము అని పుతిన్ చెప్పారు. రష్యా, రిపబ్లిక్ ఆఫ్ కాంగో దౌత్య సంబంధాల 60వ వార్షికోత్సవాన్ని ఈ సంవత్సరం జరుపుకుంటున్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని కాంగో గౌరవ కాన్సుల్ జోసెలిన్-పాట్రిక్ మాండ్‌జెలా ప్రకారం, సాసౌ న్గెస్సో ఉత్తర రష్యన్ నగరాన్ని కూడా సందర్శిస్తారు. అక్కడ స్థానిక గవర్నర్‌తో సమావేశమవటంతోపాటు అనేక కార్యక్రమాలలో పాల్గొంటారు. జూన్ ప్రారంభంలో, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కాంగోకు అధికారిక పర్యటన చేశారు. అక్కడ ఆయన దేశ నాయకత్వంతో చర్చలు జరిపారు. వాణిజ్యం, ఆర్థిక సంబంధాలను పెంపొందించడం, ఇంధన రంగ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం, సైనిక-సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడంవంటి విషయాలపై లావ్రోవ్ చర్చించాడు.

దాడులను ఆపండి

- మంత్రి దామోదరకు ఆర్‌ఎంపీల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డాక్టర్లు రాష్ట్రంలో ఆర్‌ఎంపీలపై దాడులు, తనిఖీలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆర్‌ఎంపీ, పీఎంపీ, వైద్యసంఘాల తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు వెంకట్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆర్‌ఎంపీ వైద్యులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ మంత్రి త్వరలోనే అన్ని సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా బోధనా వైద్యుల నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ జిల్లా ఆస్పత్రిలో వైద్యుల పనితీరుపై ఇతర విభాగాల అధికారులు పర్యవేక్షించేలా నల్లగొండ కలెక్టర్ జారీ చేసిన 45 రోజుల రోస్టర్ ఉత్తర్వులకు నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బోధనా వైద్యులు నిరసన తెలిపారు. వివిధ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యరంగంపై ఇతరుల పెత్తనాన్ని సహించేది లేదని తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నిజామాబాద్ ప్రభుత్వ బోధనాస్పత్రులతో పాటు 26 వైద్య కళాశాలలు, వాటి అనుబంధ ప్రభుత్వాస్పత్రుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శనలు నిర్వహించారు. దీంతో టీజీజీడీఏ రాష్ట్ర నాయకులు, నల్లగొండ విభాగం నాయకులతో నల్లగొండ కలెక్టర్ చర్చించారు. ఉత్తర్వుల్లో రోస్టరును సవరించడంతో పాటు వైద్యులకు సంబంధించిన అంశాలను తొలగించారు. ఇతర విభాగాల పర్యవేక్షణను కేవలం మౌలిక వసతుల పరిశీలనకే పరిమితం చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రావడంతో నిరసనను విరమిస్తున్నట్టు తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల తెలిపారు.

'రామగుండం' జెన్‌కోకే ఇవ్వాలి

- టీఎస్‌యూఈఈయూ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రామగుండంలో కొత్తగా నిర్మించనున్న 800 మెగావాట్ల బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్‌ను తెలంగాణ జెన్‌కోకే కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌యూఈఈయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే ఈశ్వర్‌రావు, వీ గోవర్ధన్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 1971లో 62.5 మెగావాట్లతో ఉత్పత్తి ప్రారంభించిన రామగుండం బీ థర్మల్ స్టేషన్ 50 ఏండ్లు నిరాటంకంగా సేవలు అందించిందని తెలిపారు. ఈ కేంద్రానికి 560 ఎకరాల భూమి జెన్‌కో ఆధీనంలో ఉందనీ, రూ.9 వేల కోట్ల అంచనా వ్యయంతో, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా జెన్‌కోనే ఇక్కడ 800 మెగావాట్ల విద్యుత్కేంద్రాన్ని నిర్మించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. జెన్‌కో ఆస్తుల్ని సింగరేణికి కట్టబెట్టే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు.

సీఎమ్‌డీకి జేఏసీ వినతి

రామగుండంలో నూతనంగా నిర్మించనున్న 800 మెగావాట్ల విద్యుత్కేంద్ర నిర్మాణాన్ని టీజీఎస్‌జెన్‌కోకే ఇవ్వాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంస్థ సీఎమ్‌డీకి యూనియన్ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ స్థలాన్ని, థర్మల్ కేంద్ర నిర్మాణాన్ని సింగరేణికి ఇవ్వాలనే ప్రతిపాదన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ నాయకులు వైస్ చైర్మెన్ వజీర్, అనిల్ కుమార్, జేఏసీ నాయకులు వీ.వెంకట నారాయణరెడ్డి, ఈశ్వర్‌గౌడ్, నెహ్రూ, పి.సదానందం, ఎస్. సురేష్ కుమార్, పీవీ రావు, వేణుగోపాల్, కుమార స్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి గురికావద్దు

- ఎంఎన్‌జేకు రండి...అంతా ఉచితమే : ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవగాహన లేకపోవడంతో క్యాన్సర్ పేరుతో జరిగే దోపిడీకి ప్రజలు బలవుతున్నారని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కొన్ని చోట్ల చేస్తున్న రోగ నిర్ధారణ పరీక్షలకు కనీసం విలువ ఉండటం లేదని చెప్పారు. అవసరం లేకపోయినా పెట్-సీటీని సూచిస్తూ చేయిస్తున్నారని చెప్పారు. ప్రసార మాధ్యమాల్లో క్యాన్సర్ రోగ నిర్ధారణ అంటూ తప్పుడు ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని హెచ్చరించారు. ఇంటర్నెట్‌లో దొరికే సమాచారంలో ఏది తప్పు? ఏది సరి? నిర్ధారించుకోలేక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆమోదిత వాస్తవిక సమాచారాన్ని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. క్యాన్సర్ రోగ నిర్ధారణ, చికిత్సకు సంబంధించి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలున్నప్పటికీ కొంత మంది ప్రయివేటు వైద్యానికి వెళుతున్నారని చెప్పారు. అక్కడికి వెళ్లి మొత్తంగా గుల్ల చేసుకున్నాక ....చివరి దశలో ఎంఎన్‌జేకు వస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు మీలా జయదేవ్, డైరెక్టర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ అధికారిపై దాడికి టీజీవో ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీఏ అధికారి, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేష్‌పై ఆటో యూనియన్ పేరుతో వ్యక్తి దాడి చేయడం అమానుషమనీ, ఈ దాడిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) ఖండించింది. దాడి విషయం తెలుసుకున్న టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ బి శ్యామ్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, కృష్ణయాదవ్, ఆర్టీఏ అధికారుల సంఘం అధ్యక్షులు రవీందర్‌కుమార్, నాయకులు ఏఎంవీఐ ఏఎంరెడ్డి తదితరులు రమేష్‌ని కలిసి సంఘీభావం ప్రకటించారు. అధికారులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. అధికారులు, ఉద్యోగుల మనోస్థైర్యం దెబ్బతీసేలా మాట్లాడిన, దాడి చేసే వ్యక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లోకి అనుమతించొద్దని తెలిపారు.

సివిల్స్ ఆప్షనల్ ఎంపికపై ఉచిత అవగాహన తరగతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూపీఎస్సీ-2025లో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆప్షనల్ ఎంపికపై ఆదివారం నుంచి ఉచిత అవగాహన తరగతులను నిర్వహిస్తున్నట్టు క్రిష్ణప్రదీప్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ తెలిపింది. అందుకు సంబంధించిన పోస్టర్‌ను మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, అకాడమీ ఛైర్మెన్ క్రిష్ణప్రదీప్ శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఆదివారం నుంచి వచ్చేనెల ఆరో తేదీ వరకు ఏడు రోజులపాటు ఉచిత అవగాహన తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. సివిల్స్ ర్యాంకు సాధనలో ఆప్షనల్ ఎంపిక కీలకమని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఆప్షనల్ సబ్జెక్టుపై నిపుణులతో అవగాహన కల్పిస్తామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి సివిల్స్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్ నెంబర్ 9133517733 నెంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఆగస్టు తర్వాతే రైతు భరోసా...?

- సాగు చేయని భూములపై సర్కార్ ఫోకస్
- జులై 12 లోపు
- మంత్రివర్గ ఉపసంఘం నివేదిక శాసనసభలో ఆ నివేదికపై విస్తృత చర్చ
- ఆ తర్వాతనే రైతుల ఖాతాల్లోకి నిధులు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాళ్లు, రప్పలు, గుట్టలు, రియల్ఎస్టేట్‌వెంచర్లు, రోడ్లు, భవనాలు వంటి సాగు చేయని భూములకు రైతు భరోసా కట్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రైతు భరోసా అమలుపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం... జులై 12లోపు తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. శాసనసభ సమావేశాల్లో ఆ నివేదికపై విస్తృతంగా చర్చించిన తర్వాత దాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్నది. జులై చివరి వారంలో శాసనసభ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నది. ఈ లెక్కన రైతు భరోసాపై ఓ క్లారిటీ వచ్చేందుకు నెలన్నర రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్టు వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో ఆ భూములకు రైతు భరోసా ఇవ్వబోమంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగానే రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తున్నది. అందుకనుగుణంగా కార్యాచరణను సిద్ధం చేసేందుకు పూనుకుంది. దీంతో రైతు భరోసా ఆగస్టు తర్వాతే అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.వానాకాలం సీజన్‌లో రైతు భరోసా ఆలస్యమవుతున్న కొద్దీ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. యాసంగి సీజన్‌లో కూడా రైతు భరోసా ఆలస్యంగా పూర్తి చేసిన సంగతి తెలిసిందే. యాసంగి సీజన్ ముగిసే సమయానికి రైతు భరోసాను రైతుల ఖాతాల్లో జమ చేసింది. అప్పటికే రైతులు పెట్టుబడి సాయం కోసం అష్టకష్టాలు పడ్డారు. వానాకాలంలోనూ అదే పరిస్థితి రావడం పట్ల రైతులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికితోడు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పని ముట్ల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. ఇప్పటికే రైతులు దుక్కులు దున్ని విత్తనాలు నాటారు. ఎండలకు భూమి వేడెక్కడంతో విత్తనం మొలకెత్తకపోవడంతో మళ్లీ విత్తనాలు నాటాల్సిన పరిస్థితులొచ్చాయి. అందుకు నేలను మళ్లీ సదును చేయాల్సి ఉంటుంది. విత్తనాలు, ఎరువులు కూడా కొనాల్సి వస్తుంది. రెండోసార్లు విత్తనాలు, ఎరువులు కొనాల్సి రావడంతో రైతులపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతున్నది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీపై కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో రైతులకు బ్యాంకులు కొత్త అప్పులు ఇచ్చే అవకాశాలు సన్నగిల్లాయి.

రుణమాఫీ రద్దు నిర్ణయం మంచి శుభ పరిణామమే అయినా ఈ సమయంలో బ్యాంకులు రైతులకు కొత్త చిక్కులు తెచ్చి పెడుతున్నాయి. రుణమాఫీ పూర్తి అయిన తర్వాతనే కొత్త అప్పులిస్తామంటూ బ్యాంకర్లు మెలిక పెడుతున్నారు. మరోవైపు సకాలంలో విత్తనం వేయకపోతే సీజన్ మొత్తం రైతు నష్టపోయే ప్రమాదముంది. దీంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ప్రయివేటు అప్పులు చేయాల్సి ఉంటుందని ఆందోళన చెందుతున్నారు.

రైతులకు ఇచ్చిన హామీని ప్రధాని నిలబెట్టుకోవాలి

- సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు
- హైదరాబాద్ చేరుకున్న యాత్ర



నవతెలంగాణ-బంజారాహిల్స్

రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను ఉపసంహరించుకునే సమయంలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతుల మద్దతు కూడగట్టేందుకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరుగుతున్న యాత్ర హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా జాతీయ రైతు నాయకులు జగ్జిత్ సింగ్ దల్లెవాల్ మాట్లాడారు. ప్రధాని మోడీ చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కనీస మద్దతు ధరకు సంబంధించిన చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రధానిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించి రోజులు గడుస్తున్నా రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 700 మందికిపైగా రైతుల మరణానికి కారణమైన మోడీ.. ఎన్నికలలో సుమారు 30 మందికి పైగా ఎంపీలను కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు. సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలతో పాటు ఎన్‌డీఏ కూటమిలోని ఎంపీలకు వినతి పత్రాలు అందిస్తామని చెప్పారు. అవసరమైతే ప్రతిపక్ష పార్టీలు రైతుల అంశంపై పార్లమెంట్‌లో ప్రయివేటు బిల్లును పెట్టాలని కోరారు. ప్రయివేటు బిల్లు పెట్టిన సమయంలో బిల్లుకు మద్దతు పలికేవారు ఎవరు.. పలకని వారెవరో స్పష్టంగా తెలిసిపోతుందని, దాంతో వారు రైతు వ్యతిరేకులుగా ముద్రపడే అవకాశం ఉంటుందని అన్నారు. ఇందుకోసం ప్రతిపక్ష పార్టీ నాయకులను కలవనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల రైతు నాయకులు, దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త కురుబురు శాంత కుమార్, తెలంగాణ రాష్ట్ర నాయకులు చంగాలిరెడ్డి, హరియాణ నాయకులు అభిమన్యు, లఖ్విందర్ సింగ్, న్యూఢిల్లీ నాయకులు జఫర్ ఖాన్, సుఖిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చెంచు కుటుంబంపై దాడి, భూఆక్రమణలపై విచారణ జరపాలి

- బాధితులకు న్యాయం చేయాలి : సీఎంకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం, మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు కుటుంబంపై జరిగిన దాడి, వారి భూముల ఆక్రమణపై హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీజీఏజీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్, ఉపాధ్యక్షులు తొడసం భీంరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దాడి చేసిన పెత్తందార్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం, లైంగికదాడి, అపహరణ కేసులను నమోదు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, రకరకాల ప్రలోభాలు, ఒత్తిడులతో పెత్తందార్లు కాజేసిన చెంచు ఆదివాసీల భూములను తిరిగి వారికి ఇప్పించాలని డిమాండ్ చేశారు. భూమిని అక్రమంగా కాజేయడానికి సహకరించిన తహశీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులను విధుల నుంచి తొలగించి వారిపై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ గ్రామంలో రెండేండ్ల నుంచి నిలిపేసిన ఉపాధి హామీ పథకాన్ని తిరిగి ప్రారంభించాలని, నిర్వాసిత చెంచు కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆదిమ చెంచు కుటుంబాలన్నింటికీ తక్షణమే పోషకాహారం అందించాలని వారు కోరారు.

కాట్రాజు ఈరన్న రెండెకరాల భూమిని అదే గ్రామానికి చెందిన బండి వెంకటేశం, బండి శివుడు (శివ), వెంకటేశం భార్య బండి శివమ్మ కౌలు చేస్తున్నారని తెలిపారు. ఆ భూమిని తమకే అమ్మాలని కౌలుదారులు కాట్రాజు ఈరన్నపై ఒత్తిడి తెచ్చి ఎకరాకు రూ.2.25 లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ.ఒక లక్ష ఈరన్నకు చెల్లించారు. అయితే ఈరన్న కుమారుడు ఈదన్న, కోడలు ఈశ్వరమ్మ భూమి అమ్మకాన్ని వ్యతిరేకించి దస్తావేజు పై సంతకాలు పెట్టడానికి నిరాకరించారు. దీంతో వారిని తిట్టడం, కొట్టడం కూడా చేశారు. పెత్తందార్ల భయంతో ఈశ్వరమ్మ పిల్లలను వదిలేసి పారిపోతే, ఆమెను పట్టుకుని ఈడ్చుకెళ్లి బండి వెంకటేశం ఇంట్లో వారం రోజుల పాటు లైంగిక హింసకు పాల్పడ్డారని వారు తెలిపారు. ఈశ్వరమ్మ ఎదుర్కొన్న చిత్రహింసలే దీనికి సాక్ష్యమని వారు తెలిపారు. ఈశ్వరమ్మ ఎదుర్కొన్న చిత్రహింసలే దీనికి మూడు వాతలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 73.03 శాతం ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా విడుదలయ్యాయి. అనంతరం ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల మూడు నుంచి 13 వరకు పరీక్షలను నిర్వహించామని తెలిపారు. 51,272 మంది దరఖాస్తు చేసుకుంటే, 46,731 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని పేర్కొన్నారు. వారిలో 34,126 (73.03 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఇందులో 29,142 మంది బాలురు పరీక్షలు రాస్తే, 20,694 (71.01 శాతం) మంది పాసయ్యారని తెలిపారు. 17,589 మంది బాలికలు పరీక్షలు రాయగా, 13,126 (76.37 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. బాలుర కన్నా బాలికలు 5.36 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత పొందారని తెలిపారు. రాష్ట్రంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఆ జిల్లా నుంచి 75 మంది పరీక్ష రాస్తే, అందరూ ఉత్తీర్ణత సాధించారని వివరించారు. 99.15 శాతం ఉత్తీర్ణతతో జనగామ జిల్లా రెండోస్థానంలో నిలిచిందని తెలిపారు. 42.14 శాతం ఉత్తీర్ణతను సాధించి వికారాబాద్ జిల్లా చివరిస్థానంలో ఉందని పేర్కొన్నారు. ఆ జిల్లా నుంచి 5,847 మంది పరీక్షలు రాయగా, 2,464 (42.14 శాతం) మంది పాసయ్యారని తెలిపారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రీకౌంటింగ్ దరఖాస్తు గడువు జులై 8

మార్కులు తిరిగి లెక్కింపు (రీకౌంటింగ్) కోరుకునే విద్యార్థులు సబ్జెక్టుకు రూ.500 చొప్పున వచ్చేనెల ఎనిమిదో తేదీ వరకు ఎస్‌బీఐ ద్వారా హెడ్ ఆఫ్ అకౌంట్ కింద చలానా చెల్లించాలని కృష్ణారావు తెలిపారు. ఆ దరఖాస్తులను నేరుగానూ, పోస్టు ద్వారానూ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయం, హైదరాబాద్‌కు పంపించాలని కోరారు. డిమాండ్ డ్రాఫ్టులు అంగీకరించబోమని స్పష్టం చేశారు. హాల్‌టికెట్ జిరాక్స్ కాపీ, కంప్యూటరైజ్డ్ మెమో కాపీతో రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసే దీటిలో కార్యాలయానికి సమర్పించిన వాటినే అంగీకరిస్తామని పేర్కొన్నారు. ఎస్ఎస్సీ బోర్డుకు పోస్టు ద్వారా పంపిన దరఖాస్తులు ఆమోదించబోమని స్పష్టం చేశారు. ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున వ్యక్తిగత చలానా చెల్లించాలని సూచించారు. రీవెరిఫికేషన్, జిరాక్స్ కాపీల సరఫరా కోసం దరఖాస్తులను వచ్చేనెల ఎనిమిదో తేదీ వరకు స్వీకరిస్తామని తెలిపారు.

పోలవరాన్ని చూస్తే కండ్ల నుంచి నీళ్లొచ్చాయి

- ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి: పోలవరాన్ని జగన్ గోదావరిలో ముంచారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం కంటే జగన్ వల్ల జరిగిన నష్టమే ఎక్కువన్నారు. పోలవరం ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు శుక్రవారం శ్వేతపత్రం విడుదల చేశారు. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించిన పురోగతిని రాష్ట్ర ప్రజల ముందుంచిన ఆయన.. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పరిస్థితి చూసి తన కళ్ల వెంట నీళ్లొచ్చాయన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.." పోలవరం గురించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలిపేందుకే శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం. ఏడు శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నాం. మేధావులు, నిపుణులు సహా అందరి సలహాలు తీసుకుంటాం. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి. కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువగా నిధులు తెచ్చుకోవాలి. 25 రోజుల్లో బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. వెబ్‌సైట్‌లో దాని పత్రాలన్నీ అందుబాటులో ఉంచుతాం" అన్నారు. పోలవరం ప్రాజెక్టుపై గత సీఎం జగన్ అసెంబ్లీ వేదికగా ఏటా చేసిన ప్రసంగాలతో పాటు ఏపీ మంత్రిగా అంబటి రాంబాబు చేసిన ప్రకటన వీడియోలను మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రదర్శించారు.

పోలవరానికి జగన్ ఓ శాపం..: చంద్రబాబు

"పోలవరంపై మొదటి శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులపై రెండో శ్వేతపత్రం ఇస్తాం. రాష్ట్ర అభివృద్ధికి జీవనాడి పోలవరం. నదుల అనుసంధానానికి గుండెకాయలాంటిది. ఇలాంటి పోలవరానికి జగన్ ఒక శాపంలా మారారు. ఈ ప్రాజెక్టు విషయంలో క్షమించరాని నేరం చేశారు. రాష్ట్రానికి అమరావతి, పోలవరం రెండూ రెండు ప్రధాన ప్రాజెక్టులు. ఈ రెండు రాష్ట్రానికి రెండు కండ్లు లాంటివి. ఈ రెండూ పూర్తి చేసుకుంటే విభజనలో జరిగిన అన్యాయాన్ని, నష్టాన్ని పూడ్చుకొనే అవకాశం ఉంటుంది. రాష్ట్రాన్ని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. పోలవరం ధ్వంసం జాతికి జరిగిన ద్రోహం. రాష్ట్ర అభివృద్ధికి జలవిద్యుత్ కీలకం. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే వ్యవసాయ రంగానికి ఊతం వస్తుంది. విభజన వల్ల జరిగిన నష్టం కంటే జగన్ చేసిన నష్టమే అధికం. 2014-19 మధ్య పోలవరానికి రూ.11,762 కోట్లు ఖర్చు చేశాం. వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. జగన్ మూర్ఖత్వం వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. జగన్ ప్రభుత్వం చేస్తూనే పోలవరం పనులు ఆపేశారు" అన్నారు.

ఆ హెచ్చరికలనూ పెడచెవిన పెట్టారు..

ప్రత్యామ్నాయం లేకుండా కాంట్రాక్టర్లను తొలగించారు. సమర్థులైన అధికారులను బదిలీ చేశారు. డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ బృందం చెప్పింది. ఆ విషయం జగన్‌కు రెండేళ్ల తర్వాత తెలిసింది. కాంట్రాక్టర్లను మార్చొద్దని పీపీఏ హెచ్చరించింది. 2009లోనూ వైఎస్ కాంట్రాక్టర్లను మార్చారు. వైఎస్ కాంట్రాక్టర్లను మార్చడం వల్ల హెడ్ వర్క్స్ నిలిచిపోయాయి. ఆయన చేసిన తప్పే జగన్ కూడా చేశారు. పీపీఏ హెచ్చరికలను జగన్ పెడచెవిన పెట్టారు. 2019 ఆగస్టు 16న సీఎస్‌కు పీపీఏ లేఖ రాసింది. ఏజెన్సీలను మార్చొద్దని స్పష్టంగా చెప్పింది.అని అన్నారు.

సలీం సాబ్ రిటైర్‌మెంట్

- గాంధీ మార్చురీతో 32 ఏండ్ల అనుబంధం
- 60 వేలకుపైగా శవపరీక్షల్లో ఆయన పాత్ర : రిటైర్‌మెంట్ సభలో పాల్గొన్న గాంధీ సూపరింటెండెంట్ ఎం. రాజారావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గాంధీ ఆస్పత్రిలో ఓ మూలన పడి ఉండే మార్చురీ అంటేనే అందరికీ భయం...అటువైపు వెళ్లేందుకు మరణించిన వారి బంధువులు సైతం జంకేంత భయానకం...ఓ పక్క కుళ్లిన మృతదేహాల నుంచి వెలువడే దుర్గంధం..మరోపక్క శవాలతో సహవాసం..అలాంటి చోట మహ్మద్ సలీం అనే ఉద్యోగి 32 ఏండ్ల సుదీర్ఘ కాలం పాటు తన సేవలు అందించి అందరి మన్ననలు పొందారు. ఆయన 42 ఏండ్ల ఉద్యోగ కాలంలో 32 ఏండ్ల ప్రస్థానం మార్చురీలోనే కొనసాగింది. 60 వేలకుపైగా శవపరీక్షల్లో ఆయన డాక్టర్లతో పాలుపంచుకున్నారు. చిక్కుముడిగా మారిన మరణాలకు సంబంధించిన ఎన్నో కేసుల పరిష్కారంలో తన వంతు సహకారాన్ని పోలీసులకు పోస్టుమార్టం రిపోర్టుల ద్వారా అందించారు. అంతకాలం సేవలందించిన ఆయన శుక్రవారం గాంధీ ఆస్పత్రిలో ఉద్యోగ విరమణ పొందారు. ఆ సమయంలో గాంధీ ఆస్పత్రి మార్చురీతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. గాంధీ ఆస్పత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ శాఖ అధిపతి డాక్టర్ కృపాల్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో సలీం ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.రాజారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజారావుతోపాటు మార్చురీలో పనిచేస్తున్న ప్రస్తుత సిబ్బంది, వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న గాంధీ పూర్వ విద్యార్థులు మహ్మద్ సలీమ్‌ను ఘనంగా సన్మానించారు. రాజారావు మాట్లాడుతూ..వైద్య విద్యార్థులకే కాకుండా ట్రైనీ ఐపీఎస్‌లకు, జ్యుడీషియల్ స్టాఫ్‌కు శవపరీక్షపై అవగాహన కల్పించేవారని గుర్తుచేశారు. సలీం విరమణ తర్వాత ఆయన స్థానాన్ని భర్తీ చేయడం అంత సులువు కాదన్నారు. ఆయన ఎంతో నిబద్ధతతో సేవలు అందించేవారని కొనియాడారు. తాము వైద్య విద్య అభ్యసించే సమయంలో అనేకాంశాల్లో సలీం సహాయపడేవాడని, తన సుదీర్ఘ అనుభవంతో శవపరీక్ష సమయంలో మరణానికి గల కారణాలను అనేక కోణాల్లో విడమర్చి చెప్పేవారని గాంధీ పూర్వ విద్యార్థులు గుర్తుచేసుకున్నారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- వచ్చే నెల మూడున కలెక్టరేట్ల ముందు ధర్నాలు : ఎన్‌పీఆర్‌డీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆసరా పింఛన్లు పెంచుతామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు వెంకట్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పింఛన్లకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.300లను రూ.3000లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏఐడీఐ ఆదివరకు డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల మూడున రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పెన్షన్లకు కేంద్ర ప్రభుత్వ వాటాగా 2011 నుంచి కేవలం రూ.300లే ఇస్తుందని వాటితో ఎలా బతకాలని ప్రశ్నించారు. నిత్యావసర సరుకుల ధరలు గడిచిన 13ఏండ్ల కాలంలో 300 రెట్లు పెరిగాయని గుర్తు చేశారు. ధరల పెరుగుదల సూచిక అనుగుణంగా పెన్షన్లు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగుల పింఛన్లను రూ.ఆరు వేలు, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర పింఛన్లను రూ. 4000లకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి ఏడు నెలలైనా వాటి ఊసే ఎత్తటం లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయం కోసం 44,49,767 మంది ఆసరా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు రాజు, మధు బాబు, అరిఫా, కాశప్ప, స్వామి, సహాయ కార్యదర్శులు ఏ.పెంటేశ్, దశరథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సురేపంగా ప్రకాష్, ఆశన్నగారి భుజంగా రెడ్డి, కొట్ల గౌతమ్, వీరయ్యలు వెంకన్న పి శశికళ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ, కౌన్సిల్ ప్రోరోగ్

నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో

మూడవ తెలంగాణ శాసనసభ రెండో సెషన్, శాసనమండలి 20వ సెషన్‌ను ప్రోరోగ్ చేస్తూ శుక్రవారం అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫిబ్రవరి 8న ప్రారంభమైన సెషన్ జూన్27తో ముగిసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ఆమోదంతో అసెంబ్లీ, కౌన్సిల్ ప్రోరోగ్‌కు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు అసెంబ్లీ కార్యదర్శి పేర్కొన్నారు.

నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌పై చర్యలు తీసుకోండి

- బీఆర్ఎస్ నాయకులు ఎం.వి.గుణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత విద్యాసంవత్సరంలో జీఎన్ఎం మొదటి ఏడాది కోర్సులో 35 మంది విద్యార్థులకు ప్రవేశం ఇచ్చి ఒక్క క్లాసు చెప్పని నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు, హైకోర్టు అడ్వకేట్ ఎం.వి.గుణ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆయన హైదరాబాద్‌లోని నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

9
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శనివారం జూన్ 29, 2024 www.navatelangana.com

విజయ భారతిని కలిసిన జగన్



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఢిల్లీలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మెన్ విజయ భారతిని పబ్లిక్ హెల్త్ విక్టింస్ ఫోరమ్ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మెంబర్ అడ్వకేట్ జగన్ కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో వైద్యం విషయంలో ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్‌పై హ్యూమన్ రైట్స్ కమిషన్ దృష్టి పెట్టాలని, పేద, మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. జగన్ వెంట సుప్రీంకోర్టు అడ్వకేట్ వంశీకృష్ణ ఉన్నారు.

రాఘవేంద్ర కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ - వనస్థలిపురం
మార్నింగ్ వాక్‌లో భాగంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్రవారం హయత్ నగర్ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వచ్చే నెలలో బోనాల పండుగ నేపథ్యంలో ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కొట్ట రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాల రెడ్డి, నారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జేటీసీపై దాడికి నిరసనగా పెన్‌డౌన్



నిరసన చేపట్టిన ఆర్టీఏ అధికారులు, సిబ్బంది

మద్దతు పలికిన ఉద్యోగ సంఘాల నాయకులు

ప్రభుత్వం, రాష్ట్ర కమిషనర్ భరోసాతో పెన్‌డౌన్ విరమణ

నల్లబ్యాడ్జీలతో విధులు కొనసాగించిన అధికారులు, సిబ్బంది

నవతెలంగాణ-సిటీబ్యూరో
హైదరాబాద్ జేటీసీపై జరిగిన దాడిని నిరసిస్తూ.. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీఏ ఆఫీసుల్లో రవాణాశాఖ అధికారులు, సిబ్బంది పెన్‌డౌన్‌కు దిగారు. ఈ నిరసనకు అన్ని ఉద్యోగ సంఘాలు సైతం మద్దతు తెలిపాయి. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. నిందితుడు ఆటో యూనియన్ నాయకుడు మహ్మద్ అమానుల్లాఖాన్‌ను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు.

రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నిరసనలో గ్రేటర్ పరిధిలోని జేటీసీలు, డీటీసీలు, ఆర్టీవోలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. వీరికి మద్దతుగా టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్‌తో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొని వారికి మద్దతు ప్రకటించారు. ఆర్టీఏ ఉన్నతాధికారిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ నినదించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీఏ అధికారులు, సిబ్బంది పెన్‌డౌన్‌తో అప్పటికే ఆర్టీఏ స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాలకు వచ్చిన వినియోగదారులు రెండు గంటల పాటు ఇబ్బందులు పడగా పలు ఫిర్యాదులు కమిషనర్‌కు అందాయి. వెంటనే రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ ఆర్టీఏ అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జేటీసీపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కమిషనర్‌తో చర్చల అనంతరం అధికారులు, ఉద్యోగులు పెన్‌డౌన్ ఆలోచనను విరమించుకుని.. రోజంతా నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపుతూ ప్రజలకు సేవలందించారు. కొంత మంది వ్యక్తులు యూనియన్ల ముసుగులో నాయకులుగా చెలామణి అవుతూ బ్లాక్‌మెయిల్, బెదిరింపులకు పాల్పడుతూ.. అధికారులు, ఉద్యోగులపై దాడులతో పాటు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యక్తులను ఆర్టీఏ ఆఫీసుల్లోకి రానియొద్దని.. దాడులకు పాల్పడే వారినుంచి తమకు రక్షణ కల్పించాలని అధికారులు, ఉద్యోగులు కోరారు. ఇలాంటి వాతావరణంలో ప్రజలకు సేవలు అందించాలేమని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారిపై జరిగిన దాడిని కొంతమంది వినియోగదారులు సైతం ఖండించారు. అదే సమయంలో తమను ఇబ్బందుల గురిచేయటం సరికాదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా స్లాట్ ఉన్నవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మధ్యాహ్నం 2గంటల తర్వాత కూడా సేవలు అందించామని ఆర్టీఏ అధికారులు తెలిపారు.

ఉద్యోగ సంఘాల మద్దతు..!
జేటీసీ రమేష్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. చేపట్టిన నిరసనకు అన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు తెలిపాయి. శుక్రవారం ఖైరతాబాద్ కేంద్ర కార్యాలయంలో ఆర్టీఏ అధికారులు, ఉద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. జేటీసీ రమేష్‌పై దాడిచేసిన అమానుల్లా ఖాన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం రవాణాశాఖ కమిషనర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. జేటీసీపై దాడితో ఉద్యోగులంతా భయాందోళనలకు గురవుతున్నారని రవాణా శాఖ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రవీందర్ కుమార్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. జేటీసీపై దాడి ఘటన హేయమని, ఈ ఘటన సకల ఉద్యోగులకు సంబంధించిన అంశమని గ్రూప్-1 ఆఫీసర్స్ అసోసియేషన్, ప్రెసిడెంట్ ఎం.చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. గుర్తింపు లేని ఆటో యూనియన్లను బ్యాన్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై దాడులు చేయడం సరికాదని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్) చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, టీజీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్, టీఎన్జీవోస్ ఆర్టీఏ-యూనిట్ అధ్యక్షులు ఎం.ఎన్.అరుణేందర్ ప్రసాద్, నాన్ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి. ప్రదీప్ రామకృష్ణ, జిల్లా అధ్యక్షురాలు ఏంజుల రెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాస్, తెలంగాణ లాస్ట్ గ్రేడ్ ఎంప్లాయీ యూనియన్ అధ్యక్షుడు జి. జ్ఞానేశ్వర్, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బిల్డర్ల కంటే ఆర్కిటెక్ట్‌లదే కీలక పాత్ర



- ఆర్ అండ్ బీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో
నేటి సమాజంలో బిల్డర్ల కంటే ఆర్కిటెక్ట్‌లదే కీలక పాత్ర అని ఆర్ అండ్ బీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్, హైదరాబాద్ చాప్టర్‌లోని ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు నిర్వహించిన ఎక్స్‌పో ఐదో ఎడిషన్‌ను డిజైన్ ఇంటెలిజెన్స్ థీమ్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. వారితో పాటు ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఐఐడీ జాతీయ అధ్యక్షుడు సరోష్ వాడియా హాజరయ్యారు. సాయంత్రం జరిగిన ఫెలోషిప్ మీట్‌లో, దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బంకు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ పీటర్ రిచ్, ఆర్.హెచ్‌ఐసీసీలో లోటస్ ఆర్కిటెక్ట్స్ సిద్ధార్థ్ తల్వార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 50 ఏండ్ల ఐఐడీ చరిత్రలో ఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2024 5వ ఎడిషన్‌ను స్వాగతిస్తున్నామన్నారు. భారతదేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉన్నందున ఇలాంటి మరిన్ని ప్రదర్శనలను ఆహ్వానిస్తున్నామన్నారు.



మంత్రిని కలిసిన కార్పొరేటర్లు

నవతెలంగాణ-హయత్‌నగర్
ప్రజల సౌకర్యార్థం విజయవాడ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శుక్రవారం మాదాపూర్ హైటెక్స్‌లో ఆర్ అండ్ బీ కార్యాలయంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు విజయవాడ నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధిలో భాగంగా దుర్గా విలాస్ హోటల్ నుండి హయత్ నగర్ వరకు నిర్మిస్తున్న అండర్ పాస్ రోడ్డు నిర్మాణం వలన ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను మంత్రికి వివరించారు. అండర్ పాస్ రోడ్డు నిర్మాణ విషయంలో స్థానికంగా ఉండే కార్పొరేటర్ల సమక్షంలో ప్రజల అభిప్రాయాల సేకరణ కోసం అధికారులు పర్యటించి..అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించాలని మంత్రిని కోరారు. వివరించిన పలు సమస్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ రెడ్డి, శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెడ్మాస్టర్ పీటర్ పదవీ విరమణ సభ



నవతెలంగాణ-ఎల్బీనగర్
నాగోల్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ పీటర్ పదవీ విరమణ అభినందన సభను నాగోల్ శుభం కన్వెన్షన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడుగా 36 సంవత్సరాలుగా సేవలందించిన కాకర్లమూడి పీటర్ దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. తర్వాత జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెడ్మాస్టర్ రవి కుమార్, నోసా అధ్యక్షుడు కందికంటి కన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, సభ్యులు జిల్కపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లె లింగం గౌడ్, అనంతుల శ్రీనివాస్ రెడ్డి, నాళ్ళ ఉమామహేశ్వర గుప్త, సిద్ధి రమేష్ గుప్త, డప్పు రాజు, కిషన్, ప్రధానోపాధ్యాయులు విజయేందర్ రెడ్డి, పద్మ రావు, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, రవి కుమార్, పిచ్చి రెడ్డి, కృష్ణ రెడ్డి, నారాయణ పలువురు పాల్గొన్నారు.

టీకేఆర్ విమెన్స్ క్రికెట్ టీ20 కప్ విజేత ఎలైట్ గర్ల్స్

నవతెలంగాణ-మీర్‌పేట్
టీపీఆర్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీకేఆర్ విమెన్స్ క్రికెట్ టీ20 ఛాంపియన్ షిప్-2024 విజేత ఎలైట్ గర్ల్స్ అని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ విద్యాసంస్థల చైర్మెన్ తీగల కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహిళల క్రికెట్ కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతిభ ఉన్న పిల్లలకు టీకేఆర్ విద్యాసంస్థల నుండి స్కాలర్ షిప్ కూడా అందిస్తానని చెప్పారు. క్రీడాకారులు మంచిగా ఆడి ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఎలైట్ గర్ల్స్ విజేతగా నిలువగా...టీపీఆర్ గర్ల్స్ రన్నర్‌గా నిలిచారన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. తర్వాత ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారిణి కోట అనితకు బహుమతి అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ అక్కి మాధవి, టీపీఆర్ అకాడమీ మేనేజర్ అక్కి ఈశ్వర్ గౌడ్, కోచ్ కిరణ్ రెడ్డి, దయానంద్ పటేల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



నేడు డయల్ యూవర్ డీఎం

నవతెలంగాణ-హయత్‌నగర్
ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే నేడు (శనివారం) సాయంత్రం 4గంటల నుంచి 5గంటల సమయం వరకు తమ సలహాలు, సూచనలు కూడా ఇవ్వాలని హయత్‌నగర్ 2 డిపో మేనేజర్ శ్రీనివాస్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 9959226419 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అతిథి అధ్యాపకుల నియామకాల దరఖాస్తులు

ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక

నవతెలంగాణ-బడంగ్‌పేట్
బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను వివిధ సబ్జెక్టుల వారీగా అతిథి అధ్యాపకుల నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టుల వివరాలు..బోటనీ- 1, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్-1, కామర్స్-1, హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్- 1, మ్యాథమెటిక్స్-1, ఇంగ్లీషు-1 మొత్తం 07 సబ్జెక్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యా అర్హతలు...1) పీజీలో మినిమం 55% మార్కులు (50% ఎస్సీ/ఎస్టీలకు), 2) సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, పీహెచ్‌డీ అభ్యర్థులు లేని పక్షంలో నెట్, సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. వీరు కూడలేని పక్షంలో పీజీ అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. 3) బోధనానుభవం కలిగిన వారికి వెయిటేజి ఇస్తామని, వీరు తమ సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రకారం అవర్లీ బేసిస్ (72 గంటల ప్రాతిపదికన) గౌరవ వేతనం లభిస్తుందన్నారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికేట్‌తో తమ పూర్తి బయోడేటాతో దరఖాస్తు తేది 02.07.2024 సాయంత్రం 5:00 గంటల లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రాధిక సూచించారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్
మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లో సీనియర్ నాయకులు కటికరెడ్డి శ్రీరామ్ రెడ్డి నివాసంలో జరిగిన చండీ హోమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, తోట శ్రీధర్ రెడ్డి, నాయకులు పేతుళ్ళ ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్
సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామానికి చెందిన ఎం.చంద్రకళ భర్త శంకర్‌కు సీఎం సహాయ నిధి నుండి రూ.1,50,000 విలువ గల ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. ఈ మేరకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆ చెక్కును శుక్రవారం లబ్దిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రామ్ శేఖర్, కో ఆప్షన్ సభ్యులు రఘునందన్ చారి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తులం బంగారం కోసం వేచిచూస్తున్న లబ్దిదారులు



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్
గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా తులం బంగారం కోసం వేయి కన్నులతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులు వేచి చూస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి మున్సిపాలిటీలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం లబ్దిదారులకు మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, జల్ పల్లి మున్సిపల్ చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాదిలతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 30 చెక్కులు, జల్‌పల్లి మున్సిపాలిటీలో 42 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా లబ్దిదారులందరికీ తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కంటే ముందు మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి కోసం రూ.250 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఆ పనులు ప్రారంభించలేదని.. ఆ నిధులను అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిని అడ్డుకోవద్దని, తక్షణమే ఆ నిధులను తిరిగి మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. చెక్కుల పంపిణీలో డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, బాలాపూర్ తహశీల్దార్ మాధవి రెడ్డి, డి.టీ.మణిపాల్ రెడ్డి, బడంగ్‌పేట్, జల్ పల్లి కమిషనర్లు రఘు, వీణారెడ్డి, కార్పొరేటర్లు, ఫ్లోర్ లీడర్ అర్జున్, కో ఆప్షన్ సభ్యులు, జల్ పల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్య తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే బలాల



నవతెలంగాణ-మలక్‌పేట్
వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రయినేజీ సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట్ నియోజక వర్గంలోని సాయినగర్ ముషారంబాగ్‌లో అధికారులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా డ్రయినేజీ, రహదారులు తదితర సమస్యలున్న ప్రాంతాలను గుర్తించారు. అధిక వర్షాలు కురుస్తున్నాయని..రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు డ్రయినేజీలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించాలన్నారు. వర్షాలు కురిసినప్పుడు తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో జీహెచ్‌ఎంసీ అధికారులు, హెచ్‌ఎండబ్లూఎస్ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ వీసీని సస్పెండ్ చేయాలి



- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-హయత్‌నగర్
హెచ్‌సీయూ వీసీని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రెసిడెంట్ మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో శివకుమార్ పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్షుడిని, తోటి నాయకులను అన్యాయంగా కుట్ర చేసి సస్పెండ్ చేసిన యూనివర్సిటీ వీసీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హయత్‌నగర్‌లో సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులపై పెట్టిన సస్పెండ్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికుమార్, సందీప్, అనిల్, రాము తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసిన బండారి



నవతెలంగాణ-కాప్రా, ఉప్పల్

జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారిని ఆమ్రపాలిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గంధం నాగేశ్వర్ రావు, ప్రవీణ్ ముదిరాజ్, సాయి జెన్ శేఖర్, ఆకుల మహేందర్, నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, జెట్ట కిషోర్, సుక్క కిరణ్, నిరంజన్ చారి, రామ్‌రెడ్డి, కంచర్ల సోమిరెడ్డి, కాలేరు నవీన్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రయాణికుల రవాణా సంబంధిత సమస్యల పరిష్కారానికి నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపో పరిధిలోని ఆయా రూట్లకు సంబంధించి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలిపేందుకుగాను నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ప్రయాణికులు వినియోగించుకో వాలని కోరారు. శనివారం సాయంత్రం 3.00 గంటల నుంచి 4.00 గంటల వరకు ప్రయాణికులు డిపో మేనేజర్ 7893088433, అసిస్టెంట్ మేనేజర్ 9110505820లకు కాల్ చేయగలరని ఆమె కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా సంస్థ కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

వర్షాకాలం దృష్ట్యా ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-కాప్రా

వచ్చే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని కాప్రా మున్సిపల్ కార్యాలయంలో డీసీ ముకుందరెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం ఇంజనీరింగ్ సెక్షన్, వాటర్ వర్క్స్, యూజీడీ, ఎలక్ట్రికల్ విభాగం, ఆర్టికల్చర్, ఎస్‌పీడీసీఎల్, శానిటేషన్ విభాగం ఎంటమాలజీ డిపార్టుమెంట్ మాన్సూన్ టీం, డీఆర్ఎఫ్, పోలీస్, ట్రాఫిక్ పోలీస్, అన్ని శాఖల అధికారులు వర్షాకాలంలో సమన్వయంతో విధులు నిర్వహించాలని చర్చించారు. వర్షాలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాప్రా మున్సిపల్ డీసీ ముకుంద రెడ్డి, ఏఈ హరిలాల్, వెంకటరమణ, కార్పొరేటర్లు స్వర్ణరాజ్, దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బోనాల నిధుల కోసం అప్లై చేసుకోండి

- వారంలో ముగియనున్న గడువు
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో బోనాలను నిర్వహించేందుకు నిర్వహణ కమిటీలు నిధుల కేటాయింపు కోసం హబ్సిగూడలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈవోకు దరఖాస్తు అందజేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. దరఖాస్తుకు వారం రోజుల్లో గడువు ముగియనుందని పేర్కొన్నారు. గతేడాది దరఖాస్తు చేసుకున్న వారు సైతం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆశాఢ బోనాల ఉత్సవాల ఏర్పాటు చేస్తున్నటుపై త్వరలోనే రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.

ముదిరాజ్‌లకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం కాకుండా జారీ చేయాలి



- మల్కాజిగిరి మండల ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి మండలంతోపాటు మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న ముదిరాజ్ కులస్తులకు విద్య, ఉద్యోగ, ఉపాధి, ప్రభుత్వ సబ్సిడీ బ్యాంక్ ఋణాలు, ప్రభుత్వం అందించే ఇతర అవకాశాల కోసం కుల, నివాస, ఆదాయ, ఇతర, ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని మల్కాజిగిరి మండల ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు చెరుకు సాంబరాజు ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు రొయ్యల కృష్ణమూర్తి ముదిరాజ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తహశీల్దార్ సీతారాంకు వినతిపత్రం అందజేశారు. అర్హత పత్రాలను పరిశీలించి తక్షణమే ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తామని తహశీల్దార్ ముదిరాజ్ సంఘం నాయకులకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దండు ప్రసాద్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు కటికల భిక్షపతి ముదిరాజ్, ప్రచార కార్యదర్శులు, శివంది ఆంజనేయులు ముదిరాజ్, బతికె మల్లయ్య ముదిరాజ్, మన్నే రమేష్ ముదిరాజ్, కృష్ణవేణి ముదిరాజ్, ఆంజనేయులు, తదితరులున్నారు.

ఘనంగా చీర్యాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మెన్ లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కీసర

చీర్యాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఫౌండర్, చైర్మెన్ మల్లారపు లక్ష్మీ నారాయణ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆలయ చెర్మెన్‌కు స్వామి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలతో వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ పార్టీ లకు చెందిన నాయకులు లక్ష్మీనారాయణకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త మల్లారపు శ్రీహరిగౌడ్, పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను తక్షణమే బదిలీ చేయాలి

- ధనరాజ్ నాయక్
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ తహశీల్దార్‌ను తక్షణమే బదిలీ చేయాలని మేడ్చల్‌కు చెందిన వ్యక్తి ధనరాజ్ నాయక్ అనే వ్యక్తి కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్‌కు బదిలీపై వచ్చిన తహశీల్దార్ ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తహశీల్దార్ కబ్జాదారులతో కుమ్మకై ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు వినతి పత్రంలో అందజేసినట్టు తెలిపారు. మేడ్చల్ మండల పరిధిలోని సైదోనిగడ్డ తండా గ్రామ రెవెన్యూ పరిధిలోని 747,748 సర్వే నెంబర్లలోని 3.33 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ తతంగంపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. దాదాపు పది కోట్ల విలువ గల ప్రభుత్వ భూమి విషయంలో భూ కబ్జాదారులకు తహశీల్దార్ సహకరిస్తుందని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు విచారణ జరిపి తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు

- పట్టింపులేని పాలకులు, అధికారులు
- ఆర్టీసీకి కేటాయించిన స్థలంలో బస్టాండ్, డిపో నిర్మాణం చేపట్టాలని ప్రజల విన్నపం





నవతెలంగాణ-జవహర్‌నగర్

నిత్యం వేలాది మంది ప్రజలు జవహర్ నగర్ నుంచి వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్ మహ నగరానికి ఆర్టీసీ బస్సులలో రాకపోకలు సాగిస్తుంటారు. జవహర్ నగర్ నుంచి వెళ్లే బస్సులు ప్రయాణికులతో ఎప్పుడు కిటకిటలాడుతుంటాయి. కానీ రద్దీకి అనుగుణంగా బస్ షెల్టర్లు లేక ప్రజలు రోడ్లపైనే నిలబడి ఇబ్బంది పడుతున్నారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలో ప్రధాన బస్ స్టాప్‌లైన అంబేద్కర్ నగర్, చెన్నాపురం, బాలాజీ నగర్‌లో బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగం

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మేడ్చల్ శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి జవహర్ నగర్ ప్రజల సౌకర్యార్థం అంబేద్కర్ నగర్‌లో ఆర్టీసీ బస్టాండ్, డిపోకు కావాల్సిన స్థలాన్ని కేటాయించారు. పన్నెండేండ్లు గడిచినా అట్టి స్థలంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టకపోగా అట్టి స్థలాన్ని ఇతర అవసరాలకు పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రయివేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చి ఆర్టీసీ సొమ్ము చేసుకుంటుంది. డిపోకు కేటాయించిన స్థలంలో డిపో ఏర్పాటు చేస్తే హైదరాబాద్ మహానగరంతో పాటు జిల్లాలకు కూడా ఇక్కడ నుంచి బస్సు సర్వీసులు నడుస్తాయనుకున్న జవహర్ నగర్ ప్రజలకు నిరాశే ఎదురైంది. ఇప్పటికే హైదరాబాద్ మహానగరంలో ఉన్న చెత్తను రాంకీ డంపింగ్ యార్డ్ పేరుతో ఇక్కడికి తీసుకురావడంతో దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానికి తోడు ఆర్టీసీ వారు కూడా హైదరాబాదులోని వివిధ డిపోలకు చెందిన నిరుపయోగంగా ఉన్న పాత బస్సులను (స్క్రాప్) తీసుకువచ్చి ఆర్టీసీ డంపింగ్ ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఆర్టీసీకి కేటాయించిన స్థలాలు ఆర్టీసీ అవసరాలకు వినియోగించాలని, నూతన బస్టాండ్, డిపో ఏర్పాటు చేసి ప్రజల అవసరాలు తీర్చాలని కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం అయ్యేటట్టు చూస్తా..

ఆర్టీసీ ప్రజల సౌకర్యార్థం పనిచేస్తుంది. ప్రయాణికులే మా సంస్థకు ఓనర్లు. జవహర్ నగర్ బస్ స్టాండ్, డిపో నిర్మాణం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రజల ఆకాంక్ష మేరకు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. బస్ షెల్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ వారే ఏర్పాటు చేస్తారు. విషయాన్ని జవహర్ నగర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం.

-కుషాయిగూడ డిపో మేనేజర్, శశిధర్



ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీలో చాలా మార్పులు చేశాం. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్ళి, ఆర్టీసీ యాజమాన్యంతో చర్చించి త్వరలోనే బస్టాండ్ నిర్మాణం, డిపో ఏర్పాటుకు కృషి చేస్తాం.

-మేయర్ శాంతి కోటేష్ గౌడ్, -డిప్యూటీ మేయర్, శ్రీనివాస్

ఒక్క బస్ షెల్టర్ కూడా లేదు..



ఇతర మున్సిపాలిటీలలో బస్సు షెల్టర్లు ఉన్నాయి. కానీ జవహర్ నగర్‌లోనే ఎందుకు లేవు అనేది అంతు చిక్కడం లేదు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒక్క బస్ షెల్టర్ కూడా లేదు. బస్ షెల్టర్ లేక రోడ్లమీద నిలబడాల్సిన పరిస్థితి. దీనివల్ల ప్రతిరోజు భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఆక్సిడెంట్లు అయిన సందర్భాలు ఉన్నాయి. వర్షం వచ్చినప్పుడు చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇకనైనా ఆర్టీసీ అధికారులు బస్సు సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

-ఉప్పునూతుల గణేష్ గౌడ్, అంబేద్కర్ నగర్ నివాసి, ప్రయాణికుడు

డివిజన్‌ను దశలవారీగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

డివిజన్‌ను దశల వారీగా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ధర్మ పురి కాలనీలో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో, బస్తీల్లో ప్రజలకు ప్రణాళిక బద్ధంగా దశలవారీగా మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఇందులో భాగంగా ధర్మపురి కాలనీలో సీసీ రోడ్డును నిర్మిస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్ గీత మాట్లాడుతూ.. ధర్మపురి కాలనీలోని సాయిబాబా దేవాలయం అత్యంత ప్రాచుర్యం పొందిన ఆలయమని డివిజన్‌లోని ప్రజలు, ఆలయానికి వచ్చే వారి సౌకర్యార్థం నూతన సీసీ రోడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో చిల్కానగర్ డివిజన్‌ను ఉప్పల్ నియోజకవర్గంలోనే నంబర్ వన్ డివిజన్‌గా తీర్చి దిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉద్యమ నాయకులు, మహిళ నాయకురాలు, ధర్మపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులున్నారు.

మెడికల్ క్యాంపు సేవలను వినియోగించుకోవాలి

- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఉచిత మెడికల్ క్యాంపు సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని, ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని గబ్బిలాల పేటలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హెూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ వారు అందిస్తున్న అన్ని సేవలను వినియోగించుకొని, వారు ఇచ్చే సలహాలు సూచనలను పాటించాలన్నారు. పేద ప్రజలు ఎక్కువగా నివసించే జవహర్ నగర్‌లో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హెూప్ యజమాన్యానికి అభినందనలు తెలుపుతూ, యాజమాన్యాన్ని, వైద్య సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గొడుగు వేణు, మేక లలిత యాదవ్, కాలనీ వాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నేతలు



నవతెలంగాణ-కీసర

కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఢిల్లీలో కీసర మండల బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కీసర మండల ప్రధానకార్యదర్శి కోల బాల్ రాజ్ యాదవ్, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు నల్లా వెంకట్ రెడ్డి, బస్వరాజు గౌడ్, సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించిన ఎంపీపీ

- అధికారుల తీరుతో జీపీ ఆదాయానికి గండి పడుతున్నదని ఆగ్రహం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండల పరిధిలోని ఎదులాబాద్ గ్రామంలో రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో గ్రామపంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులకు విరుద్ధంగా వందల సంఖ్యలో ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇకనైనా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-శామీర్‌పేట

మండల కేంద్రం శామీర్ పేటలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ, కళాశాలలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇస్రత్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీకాం, బీఏ, బీకాంసీఏ, ఎంపీసీ, ఎమ్మెస్సీ, ఎంజెడ్సీ, బీజెడ్సీ, బీఎస్సీ హనర్స్, ఎం ఎస్‌డీఎస్ గ్రూపుల్లో చేరడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లు తీసుకొని నేరుగా కళాశాలకు వచ్చి మీకు నచ్చిన గ్రూపులో చేరవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ.51 వేలు అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి, ఓం సాయి కన్‌స్ట్రక్షన్ అధినేత యాటవెళ్లి హన్మంత్‌రెడ్డి గ్రామంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.51 వేలు విరాళంగా ఆలయ వ్యవస్థాపకులు వెంకటరమణ రెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ సాయిబాబా దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు, దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు శెషి కుమార్, సాకేత్ రెడ్డి, చెన్నయాదవ్, తుపాకుల మల్లికార్జున్, గోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం



- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నిరసన

నవతెలంగాణ-అల్వాల్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులు సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఇందిరా గాంధీ చౌరస్తా పరిసర ప్రాంతాల్లో గంటల కొద్ది ట్రాఫిక్ దిగ్బంధనంలో ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సమస్యలను పరిష్కరించాలని ఇందిరా గాంధీ చౌరస్తాలో నిరసన చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా ట్రాఫిక్ ఉందని తెలిపారు. ఫుట్‌పాత్‌లను క్లియర్ చేసి ట్రాఫిక్ సమస్యలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరాగాంధీ చౌరస్తాను వెడల్పు చేసేందుకు అనుమతి ఉందని, అందుకు గతంలోనే నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. దానిని అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ అధికారులతో, టౌన్ ప్లానింగ్ అధికారి రాజేందర్‌తో కలిసి ట్రాఫిక్ సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డోలీరమేష్, ఢిల్లీ పరమేష్ మల్లేష్ గౌడ్, వి.ఎస్.రాజు, పవన్, కన్నా గౌడ్, రాజేందర్, యాదగిరి గౌడ్, సత్యనారాయణ, రాజు, గిరి, రాజేందర్ యాదవ్, సులోచన, శారద కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్వాక్రా రుణాలపై అధికారులు విచారణ జరిపించాలి



- డ్వాక్రా మహిళ వార్షికోత్సవంలో పలువురు మహిళా సంఘం సభ్యులు డిమాండ్

నవతెలంగాణ-కీసర

కీసర స్నేహ మహిళా సొసైటీలో ఇటీవల జరిగిన రుణాల అవకతవకలపై అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం కీసర మండల స్నేహ మహిళ సొసైటీ కార్యాలయంలో జరిగిన వార్షికోత్సవంలో పలువురు మహిళా సంఘం సభ్యులు మాట్లాడారు. డ్వాక్రా గ్రూప్‌లో సంఘం సభ్యులకు కాకుండా వేరే వ్యక్తులకు ఎలాంటి పత్రాలు లేకుండా రుణాలు ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బి.వెంకటేష్, మండల వైస్ చైర్మెన్ జే.సత్తిరెడ్డి, ఎంపీటీసీలు నారాయణ శర్మ, కిరణ్ జ్యోతి ప్రవీణ్, వెంకట్ రెడ్డి, అధికారులు, బ్యాంక్ డైరెక్టర్లు, మహిళలు పాల్గొన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డిని గ్రీన్ పీస్ ఎన్విరాన్మెంట్ వాటర్ హార్వెస్టింగ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

-నవతెలంగాణ, కాప్రా

నీట్ పరీక్షలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ ఇచ్చిన చలో పార్లమెంట్ పిలుపు మేరకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆదేశాలతో ఘట్కేసర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్ పార్లమెంటు ముట్టడికి బయలుదేరారు. జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు.

-నవతెలంగాణ,ఘట్కేసర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరడం జరిగింది. ఆంగ్లము, సంస్కృతము, రాజనీతి శాస్త్రం కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బీబీఏ, బయోటెక్నాలజీ సబ్జెక్టులు బోధించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.అలువేలు మంగ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్, సక్సెస్ స్టోరీస్, గైడెన్స్ సిలబస్, ప్రివియస్ పేపర్స్, ఎఫ్ఏక్యూస్, ఆన్‌లైన్ క్లాస్, ఆన్‌లైన్ టెస్ట్స్ అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 1వ తేదీ సాయంత్రం 5గం॥లోపు దరఖస్తు చేసుకోగలరని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ 55 శాతం, నెట్/సెట్/ పిహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ వివరించారు. అభ్యర్థులు కళాశాలలో 12 గం॥ నుంచి 5 గం॥లోపు కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను ఇవ్వగలరని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

గాగిల్లాపూర్ డీపీపల్లి సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 33/11 కె.వి ఫీడర్‌లో మరమ్మతుల కొత్త సర్వీస్ కనెక్షన్ల, నిర్వహణ పనుల కారణంగా, నేడు ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గం వరకు ఎంఎల్ఆర్ కళాశాల, నాగ్లూర్ గ్రామం, దుండిగల్ గ్రామం, టెక్ మహీంద్రా ఫీడర్ డీపీపల్లి ఎస్ఎస్-2 ఫీడర్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు టెక్ మహీంద్రా రోడ్, సత్యం, గండిమైసమ్మ ఎక్స్ రోడ్ , పోచా రెడ్డి కాలనీ, లోరాజీవ్ గృహకల్ప 11 కేవీ కృషి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి 01.00 వరకు సంతోష్ నగర్, దయానంద్ నగర్, సూరారం మార్కెట్ ,సుందర్ నగర్, సూరారం కాలనీలో 11 కేవీ గండిమైసమ్మ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి 01.00 వరకు ఆంధ్రా బ్యాంక్, రాజరాజేశ్వరి కాలనీ, ప్రగతి స్కూల్, జీ9 కాలనీ, మొదలైన ప్రాంతాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందిని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డిపి పల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

లిఫ్ట్ గుంతలో పడి మేస్త్రి మృతి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ లిఫ్ట్ కోసం తీసిన గుంతలో ప్రమాదవశాత్తు ఓ మేస్త్రి పడి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జీడిమెట్ల డివిజన్ పరిధి సుచిత్రలోని గ్రీన్ పార్క్‌లో గణేష్ బిల్డింగ్ గ్రౌండ్ 5 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని చేస్తున్నారు. నిర్మాణ పనులలో భాగంగా ఛత్తీస్గఢ్ చెందిన రామ (30) మేస్త్రి పని చేస్తున్నాడు. అయితే గతంలో అదే అపార్ట్‌మెంట్ లో రెండు నెలలు మేస్త్రి పని చేసిన అతను ఇటీవల స్వగ్రామానికి వెళ్లి గురువారం మధ్యాహ్నం తిరిగి వచ్చాడు. వచ్చినప్పటి నుంచి రాత్రి అతను మద్యం సేవిస్తూనే ఉన్నాడని ప్రత్యేక సాక్షులు తెలుపుతున్నారు. అయితే శుక్రవారం ఉదయం లెఫ్ట్ కోసం తీసిన గుంతలోని నీటిలో పడి శవమై వారికి కనిపించాడు. రాత్రి వరకు తమ తోటే ఉన్నాడని, ఏ సమయంలో లెఫ్ట్ గుంతలో పడ్డాడో తెలియదని, ఉదయం 9 గంటల ప్రాంతంలో లెఫ్ట్ గుంత వద్దకు అని వెళ్తే శవమై కనిపించాడని వాచ్ మెన్ తెలిపారు. దాంతో వెంటనే బిల్డర్, సూపర్‌వైజర్లకు సమాచారం అందించానన్నాడు.

లిఫ్ట్ గుంతే క్యూరింగ్ సంపు... రక్షణ లేని లిఫ్ట్ గుంత ...

లిఫ్ట్ కోసం తీసినా గుంతనే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణదారులు క్యూరింగ్ (నిర్మాణానికి నీరు కొట్టేందుకు) లెఫ్ట్ గుంతలో సుమారు 5 అడుగుల మేరకు నీటిని నింపి, దానిని సంపుగా వినియోగించుకోవడం గమనార్హం.. దానిలో మోటర్‌ను ఏర్పాటు చేసి పైప్ లైన్ ద్వారా నిర్మాణానికి క్యూరింగ్ చేస్తున్నారు. దాని కారణంగానే మేస్త్రి ఆ గుంతలో పడి మరణించాడని విమర్శలు వెలువెత్తుతున్నాయి. లిఫ్ట్ గుంతకు అడ్డంగా ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం.. కనీస జాగ్రత్తలు పాటించకుండా ప్రమాదకరంగా ఉండడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. లెఫ్ట్ గుంత నిండా నీరు ఉండడం మేస్త్రి మద్యం సేవించి అందులో పడిపోవడంతో మరణించాడని లేకుంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని తోటి కార్మికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన అనంతరం లిఫ్ట్ గుంతకు పాత తలుపులను అడ్డంగా ఏర్పాటు చేశారు. నిర్మాణదారులు వచ్చిన అనంతరం సుమారు 11 గంటలకు శవాన్ని పోసుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కి తరలించారు.



పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. ఈ నెల 30 నుంచి జూలై 4వ తేదీ వరకు కొనసాగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్ష నేపథ్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా చూడాలన్నారు. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షలో నిర్ణీత తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9:30 లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఆలస్యమైతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని తెలిపారు. పరీక్షలు సాఫీగా కొనసాగేలా సంబంధిత అధికారులతోపాటు చీఫ్ సూపరిం టెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలనీ, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ చికిత్సకు ఏఎంఎంలను ఏర్పాటు చేయాలనీ, సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్ వార్డు కార్యాలయంనందు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్ని విభాగాల అధికారంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే వర్షాకాలం విష జ్వరాలు ప్రబలకుండా శానిటేషన్ విషయంలో కానీ పరిశుభ్రత విషయంలో ఎప్పటికప్పుడు స్వచ్ఛత పాటించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అంతకుముందు వాటర్ పైప్ లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, అసోసియేషన్ సభ్యులు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

బౌరంపేట్ సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 33/11 కె.వి బౌరంపేట ఎస్ ఎస్ ఫీడర్‌లో మరమ్మతుల కొత్త సర్వీస్ కనెక్షన్ నిర్వహణ పనుల కారణంగా, నేడు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గం వరకు ప్రణీత్ నేచర్ బౌంటీ, కె.వి.ఆర్ కాలనీ, స్ప్రింగ్ వుడ్, జేఎస్ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హెూమ్స్, శంభీపూర్ విలేజ్ మొదలైన ప్రాంతాల్లో బహదూర్‌పల్లి ఎస్ఎస్ నుంచి వెలువడే 11 కెవి లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి 1.00 గంటల వరకు సూరారం గ్రామం, అయ్యప్ప సంఘం, విశ్వకర్మ కాలనీ మొదలైన ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంది. మల్లంపేట్ ఫీడర్ లోడ్రీమ్ వ్యాలీ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, ఆకాష్ లేఅవుట్, మల్లంపేట్ విలేజ్, ఏపీఆర్ విల్లాలు, జి ఎల్ సి భవన్ విల్లాలు మొదలైనవి. బౌరంపేట్ కేబుల్ ఫీడర్ బౌరంపేటలో మధ్యాహ్నం 12.30 నుంచి 1.00 వరకు బౌరంపేట్ గ్రామం, ఆర్‌కే లేఅవుట్, సారెగుడ్డం రోడ్డు, సింహపురి కాలనీ, డిపిఎస్ స్కూల్ రోడ్, బౌరంపేట్ విలేజ్, డీజే హెూమ్స్, ల్యాండ్‌మార్క్ 2, కీర్తి హెూమ్స్, ప్రణీత్ బ్లూమ్స్, ప్రణీత్ ప్రణవ్ మెడోస్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంది. కోకాకోలా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుంచి 1:00 వరకుసింహపురి కాలనీ, ఎస్బిఐ కాలనీ, డాలర్ డ్రీమ్స్, కేఎల్ యూనివర్సిటీ మొదలైన ప్రాంతాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట ఏఈ బి.సాయి కిరణ్ తెలిపారు.

పారిశుధ్య కార్మికున్ని ఢీకొట్టిన ఉబర్ క్యాబ్





- తీవ్రంగా గాయపడిన కార్మికుడు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మితిమీరిన వేగంతో అజాగ్రత్తగా కారు నడిపి రహదారి పక్కన విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుని ఢీ కొట్టి తీవ్రంగా గాయపరచిన ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గాజులరామారం సర్కిల్ పారిశుధ్య విభాగంలో కార్మికుడిగా శాంతారావు పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా రోజువారి గానే గణేష్ నగర్ ప్రధాన రహదారి పక్కన ఓ ద్విచక్ర వాహన షోరూమ్ ఎదురుగా చెత్త సేకరణ చేస్తున్నారు. ఈ క్రమంలో ఐడీపీఎల్ నుంచి చింతల్ వైపుకు ఉబర్ క్యాబ్ (టీఎస్ 07యుఎం0507) అజాగ్రత్తగా మితిమీరిన వేగంతో వెళుతున్న కార్ డ్రైవర్ నాగాంజ నేయ, కాంతారావును బలంగా ఢీకొట్టాడు. దాంతో కార్మికుడు ఎగిరి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని గుద్దుకొని కిందపడిపోయాడు. దీంతో తీవ్రం గా గాయపడిన కార్మికుడిని, స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన డ్రైవర్‌ను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్మికుడి రెండు కాళ్ల తీవ్రంగా గాయపడడంతో... ఎర్రగడ్డ ఈఎస్ఐ హాస్పిటల్‌కి తరలించారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తా..



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మైసమ్మ నగర్ (బి) బ్లాక్ ప్రాంతంలో నెలకొని ఉన్న పెండింగ్ సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసం వద్ద సంక్షేమ సంఘం సభ్యులు కలిసి కాలనీలో సీసీ రోడ్డు పనులను చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత పదేండ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కాలనీలను, మురికి వాడలను రాజకీయాలకు అతీతంగా "మన ప్రాంత అభివృద్ధి - మన అభివృద్ధి" అనే ఒకే ఒక నినాదంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఇందులో భాగంగా మైసమ్మ నగర్‌లో దాదాపు అన్ని అభివృద్ధి పనులు చేపట్టామని ఇంకా ఏవైనా అభివృద్ధి పనులు మిగిలిపోయినట్లయితే ప్రారంభిస్తామన్నారు. అనంతరం త్వరలో జరగబోయే బొడ్రాయి (నాభిశిల) గ్రామ దేవత పునః ప్రతిష్ఠ మహెూత్సవానికి ఎమ్మెల్యేకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైసమ్మ నగర్ (ఏ)(బి)బ్లాక్ ల అధ్యక్షులు బ్రహ్మానందం చారి, పిల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులు ముఖేష్ నేత, బండారు రవీందర్ రెడ్డి, కోశాధికారి జమేదార్ సంతోష్, కమిటీ సభ్యులు పాపిరెడ్డి,కే.రాములు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే...

కుత్బుల్లాపూర్ :130 - సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్‌లో కొనసాగుతున్న ఇండోర్ స్టేడియం పనులను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలా అభివృద్ధి కోసం గతంలో కేటాయించిన ఖాళీ స్థలాలలో ఇండోర్ స్టేడియం, పార్కుల అభివృద్ధి వంటి పనులను చేపట్టడం ద్వారా కాలనీవాసులతోపాటు క్రీడాకారులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో చేపట్టవలసిన పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, యూసుఫ్, ప్రభాకర్, ఎస్ఆర్ నాయక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టిటికే శ్రీనివాస్ రావు, మల్లికార్జునరావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి..

కుత్బుల్లాపూర్/దుండిగల్: కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కొంపల్లి మున్సిపాలిటీ అవని గార్డెన్స్ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేపీ. వివేకానందని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు అయినప్పుడే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు వెంకటే శ్వర రెడ్డి, అధ్యక్షులు వై.రాజా రమణ గౌడ్, ప్రధాన కార్యదర్శి శేషవరావు, కోశాధికారి కె. శ్రీకాంత్, ఉపాధ్యక్షులు సతీష్, కమిటీ సభ్యులు రాజు, గోవర్ధన గౌడ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



పీవీ నరసింహారావును ఆదర్శంగా తీసుకోవాలి



- కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పీవీ నరసింహారావు లాంటి గొప్ప నాయకుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీలో శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఉద్ధరించి, దేశం ఈ నాడు ఇంత గొప్ప ఆర్థిక శక్తిగా వెలుగొందడానికి పునాదులు వేసిన అపర చాణుక్యుడు అని కొనియాడారు. పీవీ నరసింహ రావు ఆమోఘమైన తెలివి తేటలు అని అన్నారు. ఇహలోక బంధాలన్నీ వదిలేసి, కుర్తాలం పీఠాధిపతిగా వెళ్దామని సిద్ధపడుతున్న తరుణంలో దేశమాత పిలుపు వచ్చిందన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దిన జ్ఞాని అన్నారు. పదవిలో ఉండగానే, కోర్టు ఖర్చు కోసం, ఇల్లు కూడా అమ్ముకున్న స్థిత ప్రజ్ఞుడని కొనియాడారు. ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు రజితమ్మ, జోజమ్మ, బి.సంజీవరావు, మేకల మైకల్, బి బ్లాక్ అధ్యక్షరాలు రేష్మ, మాజీ వార్డు సభ్యురాలు మనీ అమ్మ ,వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా



- కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ ఉషోదయ టవర్స్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణ కొడుకు సుదీప్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేకపోవటంతో.. కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వెంటనే స్పందించి, రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50,000 వేలు సీఎం సహాయనిధి-ఎల్వోసీని మంజూరి చేయించారు. శుక్రవారం బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో రూ. 2,50,000 సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి మంజూరి పత్రాలను సత్యనారాయణ కుటుంబ సభ్యులకు కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, మాజీ కౌన్సిలర్ రషీద్, సిద్ధయ్య, సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, గాదె వినోద్, ఎండీ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కంఠంలో ఉన్న ఇండ్లకు రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దు



- సామాజిక కార్యకర్త కోల రవీందర్
- ఎమ్మెల్యే కేపీ వివేకానందకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో గల సుమారు ఐదు శివారు గ్రామలు ,గ్రామ కంఠంలో ఉన్న ఇండ్లు, ఇండ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దని సామాజిక కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ శివారు గ్రామ ప్రజలతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ పరిధిలోగల వందలాది గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా పోయాయని, అందులో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోగల సుమారు ఐదు శివారు గ్రామలు కూడా సరియైన అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. అంతేకాకుండా ఇక్కడ నివసిస్తున్న వారియొక్క మరణించిన తాతలు, తండ్రుల పేరున ఉన్న ఇండ్లు, ఇండ్ల స్థలాలు తమ పేరున రిజిస్ట్రేషన్ కాకపోవడం మూలన ఇప్పటివరకు మరణించిన వారిపేరు మీదనే పన్నులు చెల్లిస్తున్నామన్నారు. తాము ఇక్కడి స్థలాలలో నిర్మాణాలు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ, పురపాలక సంఘాలు, కార్పొరేషన్లు కూడా ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. అంతేకాకుండా ఇక్కడి రెవెన్యూ అధికారులు గ్రామ కంఠ ధ్రువీకరణ పత్రాలుగానీ, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలు కానీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ఇండ్లు , ఇండ్ల స్థలాలకు బ్యాంకు వారు రుణాలు ఇవ్వడంలేదని,రి జిస్ట్రేషన్ శాఖ వారు రిజిస్ట్రేషన్ చేయడం లేదని పేర్కొన్నారు. కాబట్టి తాము ఇండ్లు నిర్మించుకునేందుకు అధిక వడ్డీతో ప్రయివేటు అప్పులు తీసుకొని, లేదా ఉన్న నాలుగైదు గుంటల భూమిని అమ్ముకొని ఇండ్లు నిర్మించుకుంటే జీహెచ్ఎంసీ వారు 100 శాతం ఇంటి పన్ను అధికంగా వేస్తున్నారని వాపోయ్యారు. కాబట్టి ఇక్కడి ఇండ్లు, ఇండ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దని కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి శివారు గ్రామ ప్రజలకు మేలు చేయాలని కోల రవీందర్ ముదిరాజ్ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రావు, బుచ్చిరెడ్డి, సంబంధిత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పైప్ లైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఇండియన్ బ్యాంక్ నుంచి, ఎల్లమ్మ చెరువు సర్ ప్లస్ నాలా వద్దకు,రూపాయలు రెండు కోట్ల నిధులతో జరుగుతున్న, భూగర్భ పైప్ లైన్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి ప్రధాన రహదారిలోని శుభోదయ కాలనీ పరిసర ప్రాంతాలలో, రోడ్డు మీద నిలిచిపోతున్న వరద నీటిని ప్రస్తుతం నిర్మిస్తున్న పైప్ లైన్ల ద్వారా నేరుగా, ఎల్లమ్మచెరువు సర్ ప్లస్ నాలలో కలిసేటట్లుగా ఏర్పాటుచేసి పైప్ లైన్ నిర్మాణం జరుగుతుందని అన్నారు. చిన్న వర్షానికి కూడా గతంలో చాలాసార్లు ఇండియన్ బ్యాంక్ వద్ద నీరు నిలిచిపోయి పక్కన ఉన్న ఇండ్లలోకి, అపార్టుమెంట్ సెల్లార్‌లలోకి నీరు చేరి, ప్రజలు చాలా ఇబ్బంది పడేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ఈ భూగర్భ పైప్ లైన్ నిర్మాణంతో వరద నీటి సమస్య తొలగిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, నజీర్, మోజెస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్ నిర్మాణంతో వరద నీటి సమస్య తొలగిపోయి శాశ్వత పరిష్కారం జరుగుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీనగర్, వివేక్ నగర్ లలో (ఐ.డి.ఎల్) శ్రీ రంగాధముని చెరువు సర్ ప్లస్ నాలా వద్దకు వచ్చే మురుగు నీరు ఓవర్ ఫ్లో కారణంగా, పురాతన పైప్ లైన్ల కారణంగా బెట్ లెట్ పూర్తిగా కుంగిపోయింది. బాలాజీనగర్ సంబంధించిన కాలనీలలో భూగర్భ డ్రయినేజీతో ఎదురవుతున్న ఇబ్బందుల కారణంగా నూతన భూగర్భ పైప్ లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ఈ.ఈ సత్యనారాయణ, వాటర్ వర్క్స్ జి.ఎం ప్రభాకర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలాజీనగర్ డివిజన్ పరిసర ప్రాంతాలలో రోడ్డు మీద నిలిచిపోతున్న వరద నీరుని ప్రస్తుతం నిర్మిస్తున్న పైప్ లైన్ల ద్వారా నేరుగా రంగాధముని చెరువు సర్ ప్లస్ నాలలో కలిసేటట్లుగా ఏర్పాటుచేసి పైప్ లైన్ నిర్మాణం జరుగుతుందని అన్నారు. చిన్న వర్షానికి కూడా పరిసర ప్రాంతాలలో గతంలో చాలాసార్లు నీరు నిలిచిపోయి పక్కన ఉన్న ఇండ్లలోకి, అపార్టుమెంట్ సెల్లార్ లలోకి నీరు చేరి ప్రజలు చాలా ఇబ్బంది పడేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, డిఈ ఆనంద్, ఏఈఎం రషీద్, కాంట్రాక్టర్ నరసింహ రెడ్డి, ఇతర సిబ్బంది, జిమ్ గోపాల్, శీలం రమేష్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ కొడిచెర్ల మాట్లాడుతూ దోమల పెరుగుదలకు గుర్రపు డెక్కనే ముఖ్య కారణం కాబట్టి, చెరువులలో పేరుకపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలన్నారు. ఫాగింగ్ మెషీన్స్ పెంచి క్రమం తప్పకుండా బస్తీల్లో, కాలానీల్లో ఫాగింగ్ చేపట్టాలి. యాంటి లార్వా స్ప్రే చేయించాలని, ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు వెంటనే స్పందించిన సర్కిల్ -23 డీసీ రమేష్ వచ్చి వినతి పత్రం తీసుకొని, వీలైనంత త్వరగా ఈ సమస్య లను పరిష్కరిస్తా అని హామీ ఇచ్చారు. నవతెలంగాణ- కూకట్‌పల్లి



వ్యవసాయ అధికారుల సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో పని చేస్తున్న వ్యవసాయ అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం చిన్నారెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారుల బదిలీలు, పదోన్నతులు, మొబిలిటి అలివెన్స్‌లు, జీవోనెంబర్ 317 సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. చిన్నారెడ్డిని కలిసిన వారిలో వ్యవసాయ అధికారుల సంఘం చైర్మెన్ బి. కృపాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. కృపాకర్‌రెడ్డి, ట్రెజరర్ రవీందర్, సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్, శశిధర్‌రెడ్డి, వికాస్పటేల్, కరుణాకర్, హరి, ప్రసాద్, మాలిక్ తదతరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై దృష్టి సారించండి



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట నియోజకవర్గంలో పెండింగ్ పైన అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, పద్మా వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా అంబర్పేట్ నియోజకవర్గానికి సంబంధిం చిన పెండింగ్ పనుల గురించి చర్చించారు. ప్రధానంగా అంబర్పేట్ 6(చే) నెంబర్ ఫ్లై ఓవర్ పనులు సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇంకా వర్షాకాలం కావడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ విషయంలో కమిషనర్ ఆమ్రపాలి ప్రత్యేక చొరవ తీసుకొని పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లవంగు అంజనేయులు,మహేష్ ముదిరాజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై చర్చించాలని గవర్నర్‌కు వినతి

- రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కోరిన విద్యార్థి యువజన సంఘ నేతలు



నవతెలంగాణ-ముషీరాబాద్

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, అవకతవకలపై చర్చించడానికి గవర్నర్ సమయం కేటాయించాలని విద్యార్థి యువజన సంఘ నేతలు కోరారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) రాష్ట్ర కార్యాలయం విద్యానగర్ మార్క్స్ భవన్ విద్యానగర్ లో పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షతన విద్యార్థి, యువజన సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మూర్తి, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మహేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి. జావిద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, కల్లూరు ధర్మేంద్ర, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.ప్రదీప్ హాజరై మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో మెడికల్ విద్య కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న (అండర్ గ్రాడ్యుయేషన్) నీట్ పరీక్ష 2024 మే 5న నిర్వహించారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయగా తెలంగాణ రాష్ట్రం నుండి 7 లక్షల మంది విద్యార్థులు రాశారు. వీటి ఫలితాలు జూన్ 4 న విడుదల అవుతాయని ఎన్టీఏ (నేష నల్ టెస్టింగ్ ఏజెన్సీ) ప్రకటించింది కానీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4 న వెలువడగా అదే రోజు హుట హుటిన నీట్ ఫలితాలను ఎన్టీఏ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు బహిరంగ క్షమపణ చెప్పాలని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 24 లక్షల మందికి న్యాయం జరగాలంటే పూర్తిస్థాయిలో పేపర్ రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలి. ఎన్టీఏ ను రద్దు చేయాలని పేపర్ లీకేజికి కారణమైన వాళ్లపై చర్యలు తీసుకోవాలని నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్ప చెప్పా లని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ శ్రీకర్, ఎస్ఎఫ్ఐ అశోక్ రెడ్డి, రజినీకాంత్ పీడీఎస్‌యు శ్రీహరి, సాయి, కృష్ణ, ఏఐవైఎఫ్, నెర్లకంటి శ్రీకాంత్ శ్రీమాన్, షేక్ మహమూద్, మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనీల్ కుమార్, బాలు,డి.వై. ఎఫ్.ఐ హష్మీ బాబు, పి.వై.ఎల్ బి.ఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలి







- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ.నరసింహారావు

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలంపాట ఆపాలని, సింగరేణికే నేరుగా గనులు కేటాయించాలని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ. నరసింహారావు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు హాజరై మాట్లాడుతూ.. తిరిగి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనులను వేలం పాట వేసి తెలంగాణకు తీవ్ర అన్యాయాన్ని చేస్తుందని, సింగరేణి మనుగడకే ప్రశ్నార్థకంగా మారుస్తుందన్నారు.

సింగరేణి కంపెనీ కూడా ప్రయివేట్ సంస్థలతో వేలంపాటలో పోటీపడాలని, తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనులను తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ, కానీ నేడు కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయించకుండా తెలంగాణ రాష్ట్రంలోని గనులను ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పేటువంటి ప్రయత్నం చేస్తుందన్నారు. బొగ్గు గనుల వేలంపాట చర్యను మానుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఎం దశరథ్, నగర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, ఏ పద్మ జోన్ నాయకులు రమేష్, పాషా, విమల, చారి, పుష్ప, వెంకటేష్, మల్లయ్య, ఆంజనేయులు, పద్మమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాట ఆపి సింగరేణికి నేరుగా కేటాయించాలని సింగరేణిని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగి ఉందని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకొని అఖిలపక్షం సమావేశం నిర్వహించాలని సీపీఐ (ఎం) అంబర్‌పేట జోన్ కన్వీనర్ మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారంసీపీఐ (ఎం) పార్టీ అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

బొగ్గు బ్లాకులన్నీ ప్రయివేట్ సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదేముందని క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరచి మూతపడే వైపు మోడీ ప్రభుత్వం నెట్టుతుందన్నారు. తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాపితంగా ప్రజలు కదలాలని కోరారు. కొత్త బ్లాకుల్లో తవ్వకాలు ప్రారంభించాలని కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇందుకు అనుమతించడం లేదు. వేలంపాట ద్వారా ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టాలని ప్రయత్నిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. వేలం పాట ప్రారంభం కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పాల్గొనడం ఆశ్చర్యకరం. ఇది వేలంపాట ప్రక్రియను ఆమోదించడమే కదా! గతంలో ప్రయివేటు సంస్థలకు అప్పగించిన మరో రెండు బ్లాకుల్లో ఇప్పటికీ తవ్వకాలు ప్రారంభం కాలేదు. అందువల్ల శ్రావణపల్లి బ్లాకుతో పాటు, ఆ రెండు బ్లాకులను కూడా తక్షణమే సింగరేణికి అప్పగించాలన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకుని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని ఇందుకనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేంద్రం ఆమోదించకపోతే రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని కేవలం విజ్ఞప్తులతో సరిపెట్టవద్దని సింగరేణి పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను సమాయత్తం చేయాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, ఎల్ సోమయ్య నాయకులు అశోక్, నర్సింగరావు, ధర్మ తిరుపతి, వీర్య, శీను, అంజయ్య, వెంకన్న, పాష తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మెహదీపట్నం

ప్రయివేట్ సంస్థలకు లాభం చేకూర్చడానికి కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన బొగ్గు గనుల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని అలాగే ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికి నేరుగా బొగ్గు గనులు కేటాయించాలని సీపీఐ (ఎం) నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ఉసురు తీసి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా నాంపల్లి నియోజకవర్గ సీపీఐ(ఎం) పార్టీ కమిటీ ఆధ్వర్యం లో గుడిమల్కాపూర్ లక్ష్మీ నగర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వా నికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు ఇవ్వకుండా వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం విచారకరమన్నారు. తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో ఎట్టి పరిస్థితుల్లో కాపాడుకుంటా మని ప్రజలందరూ నిరసన కార్యక్రమాలలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వెంకటస్వామి, అర్షద్, బాలయ్య, సిద్దయ్య, పకీర, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీరు నేర్పిన బోధనలకు విరమణ ఉండదు



- ఉపాధ్యాయుల పదవీ విరమణలో డీప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నెహ్రూ బాబు

నవతెలంగాణ-ధూల్‌పేట్

పదవులకు విరమణ కానీ విద్యార్థులకు మీరు నేర్పిన బోధనలకు విరమణ ఉండదని చార్మినార్ మండల డీప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నెహ్రూ బాబు అన్నారు. నగరంలోని బండ్లగూడ మండలంలోని జంగమ్మెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు వైదేహి, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు యాదగిరి చారి గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.గిరివర్దన్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యుపీపీ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. విజయ భాస్కర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డాక్టర్ శ్రీనాధ్, షుద్రక్, శ్రీధర్, జబ్బార్ తదితరులు పాల్గొని ఉపాధ్యాయులను పూలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు చేసిన విద్యా సేవలను గుర్తు చేసుకున్నారు.

ఉస్మానియా మెడికల్ కళాశాల
ఆలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- కేఎన్ఆర్ హెల్త్ యూనివర్శిటీ అల్మనాక్ లేకుండా సిలబస్ భోదన
- పరీక్షలలో ఫెయిలైనా విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలిపి పాస్ చేయాలి
- ఉస్మానియా మెడికల్ కళాశాలలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్
- ప్రిన్సిపాల్‌తో చర్చలు, యూనివర్శిటీ దృష్టికి తీసుకెళ్తామని హామీ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఉస్మానియా మెడికల్ కళాశాలల ఆలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న ఆలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థులు ఆందోళనకు ఎస్ ఎఫ్ఐ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాల, మరో 7 మెడికల్ కళాశాలలో కాళోజీ హెల్త్ యూనివర్శిటీ 2022-23 విద్యా సంవత్సరం ఆలైడ్ హెల్త్ సైన్స్ కోర్సులను ప్రవేశ పెట్టింది. ఈ సంవత్సరం యూనివర్శిటీ అధికారులు ఎలాంటి సిలబస్ చదవాలి, ఎలా పరీక్షలు నిర్వహిస్తారనే విషయాలు, కోర్సుల్లో ఇంటర్నల్, ప్రాక్టికల్ పరీక్షలు గురించి కనీసం అల్మనాక్ ప్రకటించకుండా, ఎంబీబీఎస్ విద్యార్థులకు చెప్పే పాఠాలు వీరికి చెప్పారు. కనీసం పరీక్షలు నిర్వహించే ముందు ఎలాం టి సిలబస్ పెడతారో కూడా చెప్పకుండా పరీక్షలు నిర్వహించడం మూలంగా యూని వర్శిటీ పరిధిలో 866 మందికి గాను 25 మంది మాత్రమే పాసయ్యారు. మిగతా విద్యార్థులు ఎందుకు ఫెయిల్ అయ్యారో యూని వర్శిటీ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ చదువులు నష్టపోకుండా గ్రేస్ మార్కులు కలిపి అందరిని పాస్ చేయాలని, కోర్సుల్లో ఫాస్ పర్సెంటేజ్ 50 శాతం కాకుండా 40 శాతం వరకు తగ్గించాలన్నారు. ప్రతి విద్యార్థికి న్యాయం చేసే విధంగా యూనివర్శిటీ చర్యలు తీసుకోవాలని లేకపోతే చలో హెల్త్ యూనివర్శిటీ నిర్వహిస్తామని తెలిపారు. గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాలలో విద్యార్థులు చదువుకోవడానికి సరైన వసతులు, తరగతి గదులు, హస్టల్స్ సదుపాయాలు లేవని సరైన వసతులు కల్పించాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ దగ్గర చర్చలు జరిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పరిధిలోని సమస్యలు పరిష్కారిస్తామని, యూనివర్శిటీ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామని తెలిపారు. కళాశాల విద్యార్థులు అన్వేష్, సచిన్, ఈశ్వర్, అఖిల్, సాయి, నవనీత్, చందు, సుస్మిత, దీపిక, సాధివిక, తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్టు...



- ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పాత నేరస్తుడిని అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసి అతని చోరీ చేసిన 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 20న అబిడ్స్‌లోని గ్రాండ్ హోటల్ ముందు నిలిపి ఉంచిన హోండా యాక్టివాను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు వాహన యజమాని అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఇన్ స్పెక్టర్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో క్రైమ్ బృందం సీసీ టీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించారు. పాత నేరస్తుడు నగరంలోని సుమారు 13 పోలీస్ స్టేషన్లలో ద్విచక్ర వాహనాలు దొంగిలించిన కేసుల్లో ప్రధాన నిందితుడైన మహ్మద్ సలీమ్‌ను అదుపులోకి తీసుకు న్నారు. నిందితుడిని గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిఐ కె.నరసింహారెడ్డి, డిఎస్ఐఎన్ గౌరేందర్ గౌడ్, వి.ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీఏ కమిషనర్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

- అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ)



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో రవాణా శాఖ హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పై జరిగిన దాడిని అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) తీవ్రంగా ఖండించింది. శుక్రవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేకేసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్ కుమార్, ఆటో విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ కలిసి మాట్లాడుతూ బాధ్యతయుతమైన ఒక యూనియన్ అధ్యక్షుడిగా ఉన్న అమానుల్లాఖాన్ గురువారం ఒక అధికారిపై దాడికి పాల్పడటం చట్టరీత్యా నేరమన్నారు. వెంటనే ఆయన కమిషనర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీఏ కార్యాలయంలో ఏమైన సమస్యలు ఉంటే పరిష్కారించుకోవాలని, కానీ అధికారులపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. గతంలో కంటే ఆర్టీఏ కార్యాలయంలో ఎలాంటి సమస్యలు ఉన్న యూనియన్ నాయకులను సముచితంగా గౌరవించి అధికారులు సానుకూలంగా స్పందిస్తున్నారని వారు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఆటో యూనియన్ నాయకులు చూసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు జి.శరత్ కుమార్, మహ్మద్ ఫరూఖ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం

- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బీజేపీ కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్విని యోగం చేస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా పార్టీ జాతీయ విభాగం పిలుపు మేరకు నేడు శనివారం తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం నాంపల్లి యందు పార్టీ కార్యకర్తల నిరసన దీక్ష జయప్రదం చేయాలని ఆయన కోరారు. మద్యం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిందని, ఆ మరుసటి రోజే ఈడీ హైకోర్టుకు చేరుకుని కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే తీసు కుందని గుర్తు చేశారు. రెండేళ్లుగా గాఢ నిద్ర నుంచి మేల్కొన్న సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడంతో ఈ కేసులో బెయిల్‌పై నిషేధం హైకోర్టు ఎత్తివేసిందని గుర్తు చేశారు. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను గత రెండేళ్ల వరకు మద్యం కేసులో సీబీఐ నిందితుడిగా చేర్చలేదని, అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టు నుండి బెయిల్ పొంద బోతున్నారని బీజేపీ భావించినప్పుడు, సీబీఐని ముందుకు తెచ్చిందన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను జైల్‌లో ఉంచి ఎన్నికల కు దూరంగా ఉంచాలని, ఆమ్ ఆద్మీ పార్టీని రద్దు చేయాలని బీజేపీ కోరుకు ంటుందని, అందుకే బీజేపీ తన రాజకీయ లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. 14 నెలలు గా కేజ్రీవాల్‌ను నిందితుడిగా చేయాలని సీబీఐకి గుర్తులేదా అని ప్రశ్నించారు. చాలా కాలం తర్వాత ఇప్పుడు హఠాత్తు గా మేల్కొన్న సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిందని, ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌పై హైకోర్టు స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేయను న్న నేపథ్యంలో సీబీఐ ఈ చర్య తీసుకుందని, సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేజ్రీవాల్‌ను ఎలాగైనా జైల్లో ఉంచాలని బీజేపీ కుట్ర పన్నుతుందని, తద్వారా ఎన్నికలకు దూరంగా ఉండి ఆప్ పార్టీ నాశనం అవుతుందని బీజేపీ కలలు కంటుందని, కానీ అవి కలలుగానే మిగిలిపోతాయని ఆయన పేర్కొన్నారు.

ఉద్యమనేత ఆర్. కృష్ణయ్యకు భారతరత్న ఇవ్వాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం కన్వీనర్ టి. రాజ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రజల కోసం ప్రజల అభివృద్ధి కోసం పోరాడి కొత్త-కొత్త స్కీములు పెట్టించి ప్రజల, నిరుద్యోగుల, విద్యార్థుల కోసం పోరాటాలు చేసిన ఉద్యమ నేత ఎంపీ ఆర్.కృష్ణయ్యకు భారతరత్న ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం కన్వీనర్ టి.రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పత్రిక ప్రకటన ద్వారా రాష్ట్రపతిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్ కృష్ణయ్య ఉద్యమాలే జీవితంగా గడిపారని గత 40 సంవత్సరాలుగా ఉద్యమాలలోనే జీవించారని ఏ నాయకుడు, ఏ రాజకీయ పార్టీ, ఏ ప్రజాసంఘం చేయని విధంగా 20 వేల సార్లు భారీ ప్రదర్శనలు, ర్యాలీలు, ధర్నాలు, అసెంబ్లీ ముట్టడులు, కలెక్టర్ కార్యాలయాలు, డైరెక్టరేట్ కార్యాలయాలు ముట్టడులు, బహిరంగ సభలు, మంత్రుల గెరావ్‌లు చేసి రికార్డు సృష్టించారని తెలిపారు. దేశంలోని ఇంతవరకు ఏ నాయకుడు కూడా ఎన్ని ఉద్యమాలు చేయలేదని ఇది గిన్నిస్ బుక్ రికార్డు. ఉద్యమాల ద్వారా విజయాలు సాధించి రికార్డు సృష్టించారు. ప్రతి సమస్యపై ఉద్యమాలు చేసి విజయవంతం అయ్యే వరకు పట్టువదలని విక్రమార్కుడు. ఇప్పటి వరకు రెండు వేలకు పైగా జీ.వోలు సాధించారు. సమర్థ వంతంగా ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఏకైక తిరుగు లేని ఉద్యమనేత విప్లవ నాయకుడు ఆర్.కృష్ణయ్య. గత 45 సంవత్సరాల ఉద్యమ ఘట్టాలు, మిలిటెంట్ పోరాటాలు, చారిత్రాత్మకం. ఇప్పటి తరానికి స్ఫూర్తిదాయకం. పోరాటాలు రాయాలంటే ఒక పెద్ద గ్రంథం అవుతుందన్నారు.

నేడు 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో నేడు 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమం జరగనుంది. ఎండీ అశోక్ రెడ్డి వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని స్వయంగా స్వీకరించనున్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు ఈ ప్రోగ్రామ్ జరుగుతుంది. వివిధ డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న మంచినీటి సరఫరా, సీవరేజీ, మీటర్, బిల్లింగ్, నల్లా కనెక్షన్, రెవెన్యూ, ఇతర అంశాలకు సంబంధించిన సమస్యల్ని వినియోగదారులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. 040-23442881 లేదా 23442882 లేదా 23442883 నంబర్లకు కాల్ చేసి తమ క్యాన్ నంబరు గానీ, ఇంటి నెంబరు గానీ, మొబైల్ నంబరు గానీ చెప్పాల్సి ఉంటుంది. డయల్ యువర్ ఎండీ కార్యక్రమం జరిగే సమయంలో బోర్డు డైరెక్టర్లు సహా అన్ని సర్కిల్, డివిజన్ ఉన్నతాధికారులు ఉంటారు. వినియోగదారులు చెప్పే సమస్యల్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తారు.

సీవరేజీ పైపులైన్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గన్ ఫౌండ్ డివిజన్ ఇసామియా బజార్, రామ్ కోఠి తదితర ప్రాంతాల్లో సీవరేజ్ న్యూ లైన్ పనులకు భూమి పూజ చేసి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ ప్రారంభించారు. అనంతరం బొగ్గులకుంట జలమండలి కార్యాలయంలో జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీఎం జాన్ షరీఫ్, కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, సుల్తాన్ బజార్ జలమండలి మేనేజర్ మధుసూదన చారి, స్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్ భీష్మ, నిర్మల్ రాజ్, రాకేష్, నాగేశ్వరరావు, జ్ఞానేశ్వర్, విజయ్ సింగ్, టింకు, రేఖ, శ్యామ్ ,మల్లేష్, కావ్య, హనుమంతరావులు పాల్గొని డివిజన్‌లో ఉన్నటువంటి సమస్యలపై అధికారులతో చర్చించామన్నారు. లో ప్రెషర్, డ్రైనేజ్ ఓవర్ ఫ్లో జీఎం దృష్టికి తీసుకెళ్లారు.

పాఠశాలల్లో ఫీజుల దందాను అరికట్టడంలో
ప్రభుత్వం ఘోరంగా విఫలం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల దందాను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ, రాష్ట్ర నాయకులు జీవన్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయా లని డిమాండ్ చేస్తూ శుక్రవారం వందలాది మంది ఏబీవీపీ కార్యకర్తలు, నాయకులు సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాల యంలోకి చొచ్చుకుని వెళ్లడానికి ప్రయత్నించిన కార్యకర్తల ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయా లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మరొక వైపు పాఠశాలల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని, విద్యార్థులకు విద్య కరువైందన్నారు. ఇంకొక వైపు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల పేరిట దోపిడీ చేస్తున్నాయ ని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని, నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశా లల్లో పుస్తకాలు, యూనిఫారం అమ్ముతున్న ప్రైవేటు యాజమాన్యాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ ద్వారా 24 వేలకు పైగా ఖాళీగా ఉన్న అధ్యాప కుల పోస్టులను భర్తీ చేయాలని, విద్య హక్కు చట్టం ప్రకా రం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని, డిఈఓ, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయకపోవడంతో పాఠశాల విద్య పర్యవేక్షణ ఎలా సాధ్యమవుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు, నాయకులు సురేష్, కమల్, మహేష్, రాజు, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

పైన్నీరు ముత్యాలమ్మ దేవాలయం చైర్మెన్‌గా దోరేటి ఆనంద్ గుప్తా



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆషాడ మాసం బోనాల జాతరను పురస్కరించుకొని దూద్ బౌలి శ్రీ పైన్నీరు ముత్యాలమ్మ దేవాలయం చైర్మెన్‌గా దోరేటి ఆనంద్ గుప్తా ప్రధాన కార్యదర్శిగా నర్సింహారావు ముదిరాజ్ నియమితులయ్యారు. శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వెంకటాచలం ముది రాజ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసచారి, భరతాచారి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ప్రమోద్ కుమార్, కోశాధి కారిగా సంతోష్ గుప్తా, ముఖ్య సలహాదారులుగా బాలకిషన్ ముదిరాజ్, వరకాల యాదగిరి, ప్రచార కార్యదర్శి గా అజయ్ కుమార్‌లతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా చైర్మెన్‌గా నియ మితులైన దోరేటి ఆనంద్ గుప్త మాట్లాడుతూ.. ఉమ్మడి దేవాలయ ఊరేగింపు కమిటీలో సభ్యత్వం కలిగిన శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తన వంతుల కృషి చేస్తానని ఆయన తెలిపారు. జూలై 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
శనివారం | జూన్ 29, 2024 | www.navatelangana.com

భారతీయ కిసాన్ యూనియన్ (ఎ) రాష్ట్ర అధ్యక్షులుగా డీకే చంద్రశేఖర్ యాదవ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

భారతీయ కిసాన్‌యూనియన్(ఎ) రాష్ట్ర అధ్యక్షులుగా డీకే చంద్రశేఖర్ యాదవ్ నియమితుల య్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు చౌదరి రిషిపాల్ అంబవత ఆయనకు నియామక పత్రాన్ని పంపించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలోని రైతులకు కనీస మద్దతు ధర, వ్యవసాయ రుణా లు తదితర సమస్యలపై ఉద్యమిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనూ రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి పక్షాన నిలబడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రైతాంగ ఉద్యమాలను చేపట్టనున్నామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినందుకు జాతీయ అధ్యక్షులు చౌదరి రిషిపాల్ అంబవత, అందుకు సహకరించిన జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎం ముస్తార్ వాజిద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

డ్రయినేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

శంకుస్థాపనలు చేసిన పనుల్లో జాప్యం జరగకుండా సత్వరమే పూర్తి చేయాలని, అదేవిధంగా సమస్యలు పరిష్కరించడానికి కావాల్సిన నిధులను జిల్లా మంత్రులతో మాట్లాడి తీసుకోవస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కె.పి.హెచ్.బి డివిజన్‌లో పలు కాలనీలలో స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి శ్రీల అపార్ట్మెంట్ నుంచి మొలకత్వ చెరువు వరకు జరుగుతున్న డ్రయినేజీ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు అదేవిధంగా ఏడో ఫేస్ నుండి ఫోరమ్ మాల్ వరకు సర్వీస్ రోడ్డు వేయవలసిన మార్గాన్ని వారు పరిశీలించారు. అదేవిధంగా డ్రయినేజీ సరిగ్గా లేకపోవడం వల్ల పొంగిపొర్లుతుండగా.. అధికారులు ఎందుకు పనులు చేపట్టడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

విధుల నిర్వహణలో అలసత్వం..
విద్యాశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు

- డిప్యూటీ ఈవో, ఐవోఎస్, హెడ్‌మాస్టర్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆగ్రహం



నవతెలంగాణ-సిటీబ్యూరో

విధుల పట్ల అలసత్వం, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం గోల్కొండ ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాల సెకండ్ లాన్సర్ పాఠశాలను జిల్లా కలెక్టర్ కార్వాన్ ఎమ్మెల్యేతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందాయా అని విద్యార్థులు అడగగా, విద్యార్థులు టెస్ట్ బుక్స్ ఇంకా రాలేదని కలెక్టర్‌కు తెలిపారు. అలాగే కొందరు విద్యార్థులు యూనిఫామ్స్ ధరించకపోవడం కలెక్టర్ దృష్టికి రాగా కలెక్టర్ వారిని వాకాబు చేయగా.. యూనిఫామ్స్ ఇంకా ఇవ్వలేదని వారు కలెక్టర్‌కు చెప్పారు. ఈ విషయమై డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్, ప్రధానోపాధ్యాయులను యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు ఎందుకు ఇవ్వలేదని కలెక్టర్ అడుగగా.. వారు సరియైన సమాధానం ఇవ్వలేనందున కలెక్టర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల వారి అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా డిప్యూటీ ఈవో రమణా రాజు, డిప్యూటీ ఐవోఎస్ మాఖ్బుల్ అహ్మద్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ వాజిద్ హస్మీకి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహి యొద్దీన్, ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్, ఇప్పుడు గోల్డెన్ మినిట్స్

- ముంబయ్ నుంచి ఇరాన్‌కు డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నావంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బెదిరించిన సైబర్ నేరస్తులు
- ఆందోళనకు గురైన బాధితుడు.. రూ.18లక్షలు బదిలీ
- బాధితుని ఫిర్యాదుతో ఫ్రీజ్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నీ ఆధార్ నెంబర్ నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్నావ్, ఇటీవలే ముంబాయ్ నుంచి ఇరాన్‌కు పార్సిల్‌లో డ్రగ్స్ పంపించావ్ అంటూ అంబర్‌పేట్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగునికి ఫోన్ చేసిన సైబర్ నేరస్తులు బెదిరించారు. ఆ తర్వాత ముంబాయ్ సైబర్‌క్రైమ్ పోలీసులం మాట్లాడుతున్నామని, నీపై కేసు నమోదైందని, నిన్ను త్వరలో అరెస్టు చేస్తామని భయాందోళనకు గురిచేశారు. మేము చెప్పినట్టు చేస్తే సహాయం చేయగలమని నమ్మించారు. ముందుగా బాధితుని ఖాతా వివరాలను తెలుసుకున్నారు. బ్యాంక్ ఖాతాలోని డబ్బులను ఆర్థిక మంత్రిత్వ శాఖకు వెరిఫికేషన్ కోసం ట్రాన్స్‌ఫర్ చేయాలని చెప్పారు. ట్రాన్స్‌ఫర్ చేసిన అన్ని డబ్బులను తిరిగి ఇస్తామని చెప్పడంతో వారు చెప్పిన మాటలను నిజమని నమ్మిన బాధతుడు ఖాతాలోని డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ డబ్బులు సరిపోవని బాధితునికి చెప్పిన సైబర్ నేరస్తులు లోన్ ఇప్పించి మరీ డబ్బులను వివిధ అకౌంట్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. మొత్తం రూ.18,00,000 ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న సైబర్ నేరస్తులు ఆ తర్వాత స్పందించకపోవడంతో అనుమానించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ నాయక్ అనే కానిస్టేబుల్ ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో (ఆన్‌లైన్‌లో) ఫిర్యాదును నమోదు చేశాడు. బాధితులకు చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ అధికారులతో సంప్రదించాడు. రాత్ర 7గంటలకల్లా బాధితులకు చెందిన బ్యాంక్ ఖాతాల లావాదేవీలను బ్లాక్ చేయించాడు. కేవలం 11 నిమిషాల్లోనే సైబర్ నేరస్తుల ఖాతాలకు చెందిన బ్యాంక్ అకౌంట్స్‌లోకి డబ్బులు వెళ్లకుండా రూ.18లక్షలను బ్యాంక్‌లోనే ఫ్రీజ్ చేయించాడు. గోల్డెన్ అవర్ (మోసపోయిన వెంటనే ఫిర్యాదు చేయడం)లో బాధితుడు ఫిర్యాదు చేయడంతో డబ్బును ఫ్రీజ్ చేసే అవకాశం దక్కింది. కానిస్టేబుల్ చూపిన చొరవను ఉన్నతాధికారులతోపాటు డీసీపీ కవితా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



హుక్కా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- 9 మంది యజమానులతోపాటు పలువురి అరెస్టు
- రూ.లక్ష విలువ చేసే వస్తువులు, రసాయనాల స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిల్లో కొనసాగుతున్న హుక్కా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 9 మంది నిర్వాహకులను అరెస్టు చేసిన పోలీసులు 15 మంది కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.లక్ష విలువ చేసే వస్తువులు, రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం టాస్క్ ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. టోలీచౌకీకి చెందిన ఎండీ అబ్దుల్ లతీఫ్ ఖాన్, పార్శిగుట్టకు చెందిన ఏం.శ్యామ్ సుంధర్, రైన్ బజార్‌కు చెందిన ఎండీ అష్వాక్, మెహిదీపట్నంకు చెందిన ఎండీ అస్లామ్ లు సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా పంజాగుట్టలో 'మియామీ గాలీ కేఫ్' పేరుతో హుక్కా సెంటర్‌ను ఓపెన్ చేశారు. అందులో మఖ్రాకు చెందిన నంద కిషోర్ ధన్, మాల్య కుమార్ ధన్, దీపక్ సాహూ, మెహిదీపట్నంకు చెందిన అల్తాప్ రియాజ్, రాణీ ఖోసల ను హుక్కా సెంటర్‌లో పనిచేసేందుకు నియమించుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా రసాయనాలతో హుక్కాను అందిస్తున్నారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. నిర్వాహకులను అరెస్టు చేశారు. మరో 15 మంది కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు.



డ్రగ్స్ పట్టివేత..

నవతెలంగాణ-బంజారాహిల్స్

అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో టాస్క్ ఫోర్స్ టీం శుక్రవారం ఎండీఎంఏ డ్రగ్స్‌ను పట్టుకుని నిందితులను అరెస్టు చేశారు. వివరాల్లోకెళ్తే.. డ్రగ్స్ ఉన్నాయన్న విశ్వసనీయమైన సమాచారం మేరకు బంజారాహిల్స్‌లో 2.65 గ్రాముల ఎండీఎంఏను ఒక వ్యక్తి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు.అతను ఇచ్చిన సమాచారం మేరకు ఆదిభట్లలో దాడులు నిర్వహించి మరో ఇద్దరి నుంచి మరో 12.48 గ్రాములు, 326 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనపరుచుకుని మొత్తం మత్తు పదార్థాలను అమీర్‌పేట్ ఎక్సైజ్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో(15.13) 326, హ్యాం డ్ ఓవర్ చేశారు. మొత్తం గంజాయి పదార్థాలను బెంగళూరు నుంచి తెచ్చి ఆది భట్ల, అమీర్‌పేట్, బంజారా హిల్స్ ప్రాంతాల్లో గల కస్టమర్లకు అమ్ముతున్నట్టు నిందితులు వెల్లడించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్, ఎస్టీఎఫ్ సూపరిం టెండెంట్ ప్రదీప్ రావు, ఇన్‌స్పెక్టర్ భిక్షా రెడ్డి,సబ్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు, సిబ్బంది ఉన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT :: KUSHAIGUDA
O.S. No. 591 of 2024

Between:-
Moluguram Pushpa Latha & others ...Plaintiffs
And
Tahsildhar Malkajgiri Mandal & All Concerned ...Defendants

To,
2) ALL CONCERNED
Please take NOTICE that the above named plaintiffs has filed the above Suit for DECLARATION to declare them as Legal Heirs of LATE MOLUGURAM BALA PRAKASH and to declare the plaintiffs are successors to the Suit Schedule property before the Hon'ble Principal Junior Civil Judge, Medchal Malkajgiri District at Kushaiguda.
Therefore the General Public are hereby informed that if any person or persons have any objection or interest should appear & file the same before the above said Hon'ble Court on **24/07/2024 at 10:30 AM** through counsel or in person failing which the said Suit will be decided on merits.

// By Order //
Hon'ble Judge Principal Junior Civil Judge, Medchal-Mlakjgiri District Courts at Kushaiguda
Sd/-
M/s K.V. REDDY
Advocate
Flat No.202, Silverline Apts Vivekanandapuram, Sainikpuri, Secunderabad

---

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NALGONDA
OS.NO.12 OF 2019

Between :
Vadde Bushi Reddy ... Plaintiff
AND
Gade Praveen ... Defendants

To
The Defendent
01. Gade Praveen S/o Linga Reddy, Age: 44 Yrs, Occ: Private Employee, R/o Plot No. 42, R.T.C. Colony, Chinthakuntla check post, Rangareddy Dist.
Take notice that the Plaintiff filed the above suit for the relief of recovery of money and the said suit is posted on 26-07-2024, for your appearance in the above case. Hence, you are here by directed to appear in person or through advocate duly instructed by you, before the Hon'ble Court on 26-07-2024 at 10-30 A.M. without fail, if you failed to appear before the Hon'ble Court which the matter will be decided against you as per Law.

(By Order of the Court)
T.KIRAN KUMAR,
B. ASHOK KUMAR,
SAYYD APROZE,
ADVOCATES, NALGONDA.
Cell No. 9951080839

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JMFC AT: JADCHARLA
I.A.No.550 of 2021
in
O.S.No.264 of 2021

Between:
Chakali Yadamma & ors . ...Plaintiff/Petitioner
And
Chakali Krishnaiah & ors ...Defendants/Respondents

NOTICE

ToR3.Sri.Shiva Prakash S/o.Late. Ghansi Ram, Aged about 62 yrs, Occ:Business, R/o.H.No.11-5-128, Red Hills, Hyderabad,
R4.Sri.G.Ramesh S/o.late Eshwaraiah, Aged: 55yrs, Occ: Business, R/o.Chaitanyapuri, Hyd
R5.Ameena Begum W/o Ubedulla Shareef, Aged about 45yrs, Occ: House Hold, R/o.H.No.11-5-406, Red Hills, Hyderabad-500004 ...RespondentNo's3to5
Whereas the above-named Plaintiff filed a SUIT FOR PARTITION AND SEPARATE POSSESSION with regard to suit schedule property situated All the Agricultural lands in Sy.No.158/E/2, admeasuring Ac. 01-00 gts, Sy.No.190/E/2 admeasuring Ac.01-03 gts, Total admeasuring Ac.02-03 gts., situated at Tatiparti Village of Boothpur Mandal Mahabubnagar District. You the above said Respondents take notice that the above case is posted **on 14-08-2024 at 10.30 am** before the said Hon'ble Court for your appearance and for filing of counter if any, and if you failed to appear before the above Hon'ble Court either in person or through advocate, the matter will be decided in your absence.

//BY THE ORDER OF THE COURT//
K.Dinesh Chakwarty,
Advocate,
Office: 6-1-585/B/1/19, Maruthinagar, Khairatabad, Hyd-500004 Cell No. 8801021212
Counsel for the Plaintiffs

IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD
O.S.NO. 153 OF 2024

BETWEEN:-
Smt.Pampati Sandhya and others ...Plaintiffs
AND
The Tahsildar and another ...Defendants .

To
All Concerned

NOTICE

Please take notice, the above named plaintiffs filed a SUIT FOR LEGAL HEIRS OF THE DECEASED PAMPATI RAVINDER to be effected by the defendants. If anyone having any objection/Claim for grant of above relief may appear **on 03-07-2024 at 10:30am** before the said court, falling which the matter will be disposed off in accordance with law.

(BY ORDER OF THE COURT)
D.Vishal Anand,
Tharun Raj. Advocates
2-2-147/A, First Floor, Above UCO Bank, M.G. Road, Secunderabad
9246102037

IN THE COURT OF THE II ADDL. CHIEFJUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
I.A.No 1877 of 2023
IN
O.S NO. 401 OF 2023.

Between:
Mohd.Farooq Ali Khan ...Petitioner/Plaintiff
And
Mohd.Asif AliKhan and others ...Respondent/Defendants

To
1.Smt.Fatima W/o late Mohd. Hyder Ali Khan, aged 68yrs, Occu: House wife, R/o 16-4-777/3, Malakpet, Hyderabad.
2.Mr.Mukhtar Ali Khan, S/o late Mohd.Hyder Ali Khan, aged 50 yrs, Occu: Business, R/o 16-4-777/3, Malakpet, Hyderabad.
3.Murtuza Ali Khan S/o late Mohd. Hyder Ali Khan, aged 48yrs, Occu: Business, R/o 16-4-777/3, Malakpet, Hyderabad.
4.Mohd.Mujahid Ali Khan S/o late Mohd. Mustafa Ali Khan, Aged about 42yrs, R/o 16-4-777/2 Malakpet, Hyderabad.
5.Zainab Khan D/o late Mohd. Mustafa Ali Khan, Aged about 36yrs, R/o 16-4-777/2 Malakpet, Hyderabad.
6.Benazir Khan D/o late Mohd. Mustafa Ali Khan, Aged about 34yrs, R/o 16-4-777/2 Malakpet, Hyderabad.
Please take notice that above name petitioners/plaintiff filed the above suit for partition, separate possession and for other reliefs and against the Respondants/defendants herein on the file of this Hon'ble Court and this Hon'ble Court permitted to publish the notice against respondants/defendant No.6,7,8,9,,12 & 13 by way of paper publication and the suit is posted **to 25-07-2024** for your appearance **at 10.30 A.M.** make yourself convenient to appear before the Hon'ble Court on the date and time mentioned supra, as otherwise the matter will be decided exparte.

//BY ORDER OF THE COURT//
Miledy
M. LAKSHMA REDDY
ADVOCATE
3-6-517, Flat No. 308, Sai Datta Arcade, Street No. 6. Himayathnagar, Hyd-500 029.

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
I.A.NO.484 OF 2022
IN
O.S.NO.858 OF 2022

BETWEEN:
MANCHANI RAM REDDY And others ...PETITIONERS/PLAINTIFFS
AND
MANCHANI VENKAT REDDY (DIED) AND OTHERS ...RESPONDENTS/DEFENDANTS

To,
R/D-4 SMT Y.YADAMMA, W/o Y.Ram Dev Reddy, Aged about 58yrs, Occ: Agriculture, R/o Sangem Village, Keshampet Mandal, Ranga Reddy District.
R/D-5.SMT Y.ANASUYA, W/o Ram Dev Reddy, Aged about 48yrs, Occ: Agriculture, R/o Sangem Village, Keshampet Mandal, Ranga Reddy District.
R/D-6.MANCHANI NARSIMHA REDDY, S/o Narayana Reddy, Aged about 42yrs, Occ: Private Employee, R/o Kummariguda Village, Shabad Mandal, R.R.Dist
The Petitioners/Plaintiffs had filed the above suit for Partition and Separate Possession in respect of Suit Schedule Properties against the Respondents/Defendants. In the above suit, the Petitioners/Plaintiffs had also filed the above I.A. seeking to restrain the Respondents/Defendants from alienating, transferring, or creating any third party charges or any other encumbrances till the disposal of the suit. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above I.A. and the matter is posted **to 15.07.2024 at 10.30 a.m.** and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/-
K.SRINIVAS RAO,
P.ACHUTHAM REDDY,
Advocates
H.No.1-8-732/16, 1st Floor, Bhagyanagar Jr.College Building, Vegetable Market, Nallakunta, Hyderabad.
Phone:9848896888

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE – CUM – X ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT AT KUKATPALLY
O.S.NO.134 OF 2019

BETWEEN:-
Gottipati Vasundhara Devi, W/o. G.Venkateswara Rao and another ...Plaintiffs
AND
T.Venkataswamy, S/o. Late T.Dakaiah and others ...Defendants

To
Nishant Raju, S/o. E.P. Rajgarhia, R/o. H.No.9-1-16/A Hasmathpet, Bowinpally, Secunderabad-11 (Defendant No.5)
WHEREAS the above named Plaintiffs have filed suit against Defendants, you have Defendant No.5 in the suit. You have hereby summoned to appear before the above Court in the suit & IA in person or by an Advocate duly instructed **on 18.07.2024 at 10.30 A.M.**
Take notice that in default of your appearance on the said date and time the case will be heard and determined in your absence.

//By order of the Court//
M/s.C.HANUMANTHA RAO,
CHAVA SRINIVAS,
C. SREE DEEPIKA &
I VENKATA SATYANARAYANA
Advocates for Plaintiffs
Plot no.361, Road No.80, Jubilee Hills, Hyderabad-96.

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
O.S.NO.858 OF 2022

BETWEEN:
MANCHANI RAM REDDY And others ...PETITIONERS/PLAINTIFFS
AND
MANCHANI VENKAT REDDY (DIED) AND OTHERS ...RESPONDENTS/DEFENDANTS

To
D-4.SMT Y.YADAMMA, W/o Y.Ram Dev Reddy, Aged about 58yrs, Occ: Agriculture, R/o Sangem Village, Keshampet Mandal, Ranga Reddy District.
D-5.SMT Y.ANASUYA, W/o Ram Dev Reddy, Aged about 48yrs, Occ: Agriculture, R/o Sangem Village, Keshampet Mandal, Ranga Reddy District.
D-6.MANCHANI NARSIMHA REDDY, S/o Narayana Reddy, Aged about 42yrs, Occ: Private Employee, R/o Kummariguda Village, Shabad Mandal, Ranga Reddy District.
The Plaintiffs had filed the above suit for Partition and Separate Possession in respect of Suit Schedule Properties against the Defendants which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted **to 15.07.2024 at 10.30 a.m.** and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/-
K.SRINIVAS RAO,
P.ACHUTHAM REDDY,
Advocates
H.No.1-8-732/16, 1st Floor, Bhagyanagar Jr.College Building, Vegetable Market, Nallakunta, Hyderabad.
Phone:9848896888

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JMFC AT: JADCHARLA
O.S.No.264 of 2021

Between:
Chakali Yadamma & ors ...Plaintiff/Petitioner
And
Chakali Krishnaiah & ors ...Defendants/Respondents

NOTICE

ToD3.Sri.Shiva Prakash S/o.Late. Ghansi Ram, Aged about 62 yrs, Occ:Business, R/o.H.No.11-5-128, Red Hills, Hyderabad,
D4.Sri. G.Ramesh S/o.late Eshwaraiah, Aged: 55yrs, Occ: Business, R/o.Chaitanyapuri, Hyd
D5.Ameena Begum W/o Ubedulla Shareef, Aged about 45yrs, Occ: House Hold, R/o.H.No.11-5-406, Red Hills, Hyderabad-500004 ...DefendantNo's3to5
Whereas the above-named Plaintiff filed a SUIT FOR PARTITION AND SEPARATE POSSESSION with regard to suit schedule property situated All the Agricultural lands in Sy.No.158/E/2, admeasuring Ac. 01-00 gts, Sy.No.190/E/2 admeasuring Ac.01-03 gts, Total admeasuring Ac.02-03 gts., situated at Tatiparti Village of Boothpur Mandal Mahabubnagar District. You the above said Respondents take notice that the above case is posted **on 14-08-2024 at 10.30 am** before the said Hon'ble Court for your appearance and for filing of counter if any, and if you failed to appear before the above Hon'ble Court either in person or through advocate, the matter will be decided in your absence.

//BY THE ORDER OF THE COURT//
K.Dinesh Chakwarty,
Advocate,
Office: 6-1-585/B/1/19, Maruthinagar, Khairatabad, Hyd-500004 Cell No. 8801021212
Counsel for the Plaintiffs

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NALGONDA
I.A.NO. 57 OF 2019
in
OS.NO.12 OF 2019

Between :
Vadde Bushi Reddy ...Petitioner/ Plaintiff
AND
Gade Praveen ...Respondents/ Defendants

To
The Respondent
01. Gade Praveen S/o Linga Reddy, Age: 44 Yrs, Occ: Private Employee, R/o Plot No. 42, R.T.C. Colony, Chinthakuntla check post, Rangareddy Dist.
Take notice that the Plaintiff filed the above suit for the relief of recovery of money and also field above petition attachment before judgment the said case is posted on 26-07-2024, for your appearance in the above case. Hence, you are here by directed to appear in person or through advocate duly instructed by you, before the Hon'ble Court 26-07-2024 at 10-30 A.M. without fail, if you failed to appear before the Hon'ble Court which the matter will be decided against you as per Law.

(By Order of the Court)
T.KIRAN KUMAR,
B. ASHOK KUMAR,
SAYYD APROZE,
ADVOCATES, NALGONDA.
Cell No. 9951080839

IN THE COURT OF THE HON'BLE IV ADDL. SENIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
O.S.No.1108 of 2021

BETWEEN:
Ch.Chandra Kala ...Plaintiff
And
Sai Kumar and others ...Defendants No.1 to 26

To,
1.Mohd.Khaja Pasha, S/o.Chand Miya Aged about: 45yrs, Occ: Business R/o.H.No.1-7-630/7/1, Hari Nagar, Jamisthanpur Musheerabad, Hyd-500 020
2.Y.Vijaya Kumari, W/o.Y.Krsihna Rao Aged about: 65yrs, Occ: House Wife R/o.Plot No. 131, Janapriya Homes Chinthalakunta, L.B.Nagar, Hyd-500 079
3.N.Prashanth Kumar, S/o.Subash Aged about: 45yrs, Occ: Business R/o.4-8-27/2, Sowjanya Colony Hayathnagar, R.R.District-501 505
4.V.Aruna Kumari, W/o.Krishna Rao Aged about: 57yrs, Occ: Business, R/o.16-2-718/A & B, Akerbagh Malakpet, Hyd-500 036
5.Y.Sundara Ram Reddy, S/o.Nok Known to the Plaintiff Aged about: 58yrs, Occ: Business R/o.Kuntloor Village, Hayathnagar Mandal R.R.District 501 505
(Defendants No.2,6,12,23,and 26)
Please take this notice that, the above-named Plaintiff had filed the above suit for Perpetual Injunction against all of you and others. The above said case is posted for appearance of all of you i.e. Defendants No.2,6,12,23,and 26 and said case is posted **on 22-07-2024.** All of you please appear before the Hon'ble court **at 10:30 a.m.,** If you fails appear before the court on that day, the matter will be decided in your absence.

//By order the Hon'ble Court//
R.Kumar Goud
Advocate
Counsel for the Plaintiff

APPLICATION FOR LEGAL HEIRS CERTIFICATE IN THE COURT OF V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.No.2452 OF 2024

Between:
1.Smt.SUDHA KACHE W/o Mr. Srinivas kache aged about 60 Yrs Occ: Retd. lecturer R/o H.No.3-4-374/7, Basanth Nagar Colony, Kachiguga, Hyd-500027. M.No.9848467497
2.Smt.USHA MANGIPUDI W/o Sri. Col. Ravindra Mangipudi aged about 57yrs., Occ:Housewife, R/o H-42.AWHO Vedvihar, Subhash Nagar, Tirrumalgiri, Secunderabad 500015, M.No.9492509921,
3.Sri.PRAVEEN KUMAR GANTI S/o Late.Annaji rao Ganti aged about 45yrs.,Occ:Doctor, presently residing at Toronto, Canada, Rep. by his POA Holder Smt. SUDHA KACHE W/o Mr. Srinivas kache aged about 60 Yrs., Occ: Retd. lecturer R/o H.No.3-4-374/7, Basanth Nagar Colony,Kachiguga, Hyd- 500027. M.No.9848467497
4.Sri.V.V.S.RAMA KRISHNA S/o.Late V.ANNAM RAJU, Aged about 61yrs, Occ: Advocate, R/O H.No.6-3-595/34, Padmavathi Nagar, Khairtabad, Hyd-500004.
5.Sri.V.M.S.ANIRUDHA, S/o Sri V.V.S.RAMA KRISHNA, Aged about 26yrs, Occ: Student, R/O H. No.6-3-595/34 Padmavathi Nagar, Khairtabad Hyd-500004.
6.Kum.V.S.Apurva, D/o.Sri.V.V.S. RAMA KRISHNA, Aged about 26 yrs, Occ: Psychologist R/O H.No. 6-3-595/34 Padmavathi Nagar Khairtabad Hyd-500004.
7.Smt.V.ALEKHYA, W/O.Sri.UDAY KUMAR, Aged about 32YRS, Occ: Teacher, R/O H.No.6-3-582/4, Nagamani Nilayam,Gandhi Tata Nagar, Khairatabad, Hyd-500004. ...PLAINTIFFS
AND
1.WHOMSOEVER IT MAY CONCERN
2.The Tahsildar, O/o.Khairatabad MRO, Ananadnagar Khairatabad, Hyd-500004 ...DEFENDANT

PUBLIC NOTICE

Whereas application has been filed by the Plaintiffs/Petitioners for declaring the Plaintiffs as LEGAL HEIRS Late.GANTI ANNAJI RAO died on 02-07-2020 AND Late. GANTI SARADHA died on 04-11-2022 deceased by granting **LEGAL HEIRS CERTIFICATE**
Now it is notified for general information that any person having any objection thereto may file their objections in the Court of V Junior Civil Judge City Civil Court, Hyderabad on or before **13-09-2024** next Date of hearing, in default, the matter will be held ex parte.

(By order of the Court)
Gera Ravi,
ADVOCATE
P.No.92, H.No.3-2-230, SBH Colony Venture-2. LB Nagar, Ranga Reddy 500074
COUNSEL FOR PLAINTIFFS

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
O.S.NO.853 OF 2022

BETWEEN:
BANDAMIDI YADAMMA, And others ...PETITIONERS/PLAINTIFFS
AND
UPPARI NAGAMMA, AND OTHERS ...RESPONDENTS/DEFENDANTS

To,
D-8.BOLLU RAJESWARI, W/o Bollu Murali Mohan, aged about 49yrs, Occ: Housewife, R/o Plot No.70, Whisper Valley, Raidurgh, Hyderabad-500008.
The Plaintiffs had filed the above suit for Partition and Separate Possession in respect of Suit Schedule Properties against the Defendants which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted **to 24.07.2024 at 10.30 a.m.** and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/-
P.ACHUTHAM REDDY,
G.RAJENDER REDDY,
N.ADITHYA VARDHAN REDDY
Advocates
H.No.1-8-732/16, 1st Floor, Bhagyanagar Jr.College Building, Vegetable Market, Nallakunta, Hyderabad.
Phone:984889688

IN THE COURT OF THE II ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.NO.401 OF 2023

Between:
Mohd.Farooq Ali Khan ...Plaintiff
And
Mohd. Asif AliKhan and others ...Defendants

To,
1.Smt.Fatima W/o.lateMohd.Hyder Ali Khan, aged 68yrs, Occu:House wife, R/o16-4-777/3, Malakpet,Hyd
2.Mr.Mukhtar Ali Khan, S/o late Mohd.Hyder Ali Khan, aged 50 yrs, Occu: Business, R/o16-4-777/3, Malakpet, Hyd
3.Murtuza Ali Khan S/o late Mohd. Hyder Ali Khan, aged 48yrs, Occu: Business, R/o 16-4-777/3, Malakpet, Hyderabad.
4.Mohd.Mujahid Ali Khan S/o late Mohd. Mustafa Ali Khan, Aged about 42yrs, R/o 16-4-777/2 Malakpet, Hyderabad.
5.Zainab Khan D/o late Mohd. Mustafa Ali Khan,Agedabout36yrs, R/o 16-4-777/2 Malakpet, Hyd
6.Benazir Khan D/o late Mohd. Mustafa Ali Khan, Aged about 34yrs, R/o 16-4-777/2 Malakpet, Hyderabad.
Please take notice that above name plaintiff filed the above suit for partition, separate possession and for other reliefs and against the defendants herein on the file of this Hon'ble Court and this Hon'ble Court permitted to publish the notice against defendant No.6,7,8,9,,12 & 13 by way of paper publication and the suit is posted **to 25-07-2024** for your appearance **at 10.30 A.M.** make yourself convenient to appear before the Hon'ble Court on the date and time mentioned supra, as otherwise the matter will be decided exparte.

//BY ORDER OF THE COURT//
M.LAKSHMA REDDY
ADVOCATE
3-6-517, Flat No. 308, Sai Datta Arcade, Street No. 6. Himayathnagar, Hyd-500 029.

IN THE COURT OF THE PRINCIPAL IST ADDL. JUNIOR CIVIL JUDGE CUM-XIITH ADDL. METROPOLITAN MAGISTRATE RAJENDRANAGAR :: R.R.DISTRICT
O.S.No.244 OF 2024

BETWEEN:
1.PUVVADA SUREKHA W/o.Late. Puvvada Prasad Aged about 38yrs Occ : Business
2.PUVVADA DEEPSHIKA D/o.Late.Puvvada Prasad, Aged about 7yrs (Minor) guardian Puvvada Surekha (Mother) Occ : Student, (Both are residing at R/o.Flat No.302, Yashia Block, SSD Y3-Yashia Apartments, Road No.13, Alakapur Township, Manikonda, Puppalaguda (V), Ganidpet Mandal, R.R.Dist, Hyd-500089 T.S ...Plaintiffs
AND
1.The Manager, HDFC Bank Ltd., 2nd Floor, Plot No.21 & 22, Telecom Nagar,Gachibowli Branch, Serlingampally (M), Ranga Reddy District, Hyd-500032, T.S.
2.All concerned ...Defendants
Whereas, the Plaintiffs have instituted the above suit O.S.No. 244/2024 against you for SUIT FOR DECLARATION OF LEGAL HEIRS OF late. Puvvada Prasad. You are hereby summoned to appear before the Honourable PRINCIPAL IST ADDL. JUNIOR CIVIL JUDGE CUM-XIIth ADDL. METROPOLITAN MAGISTRATE R.R.DISTRICT :: AT RAJENDRA NAGAR **on 15th July, 2024 at 10.30 A.M.** in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above suit. Please take notice that in default of your appearance the above matter will heard & determined in your absence.

//BY ORDER OF THE HONOURABLE COURT //
P.S.KRISHNA PRASAD
M.SEKHER
S.B.VISHNU RAO
Advocates
PLOT No.1130/A, Road No.36, Jubilee Town Aprt, 1st Floor, Jubilee Hills, Hyderabad-500033
Cell. 8985454129 & 9885048129

IN THE COURT OF THE HON'BLE IV ADDL. SENIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
I.A.NO. 709 of 2021
In
O.S.No.1108 of 2021

BETWEEN:
Ch.Chandra Kala ...Petitioner/Plaintiff
And
Sai Kumar and others ...Respondents/Defendants No.1 to 26

To,
1.Mohd.Khaja Pasha, S/o.Chand Miya Aged about: 45yrs, Occ: Business, R/o.H.No.1-7-630/7/1, Hari Nagar, Jamisthanpur Musheerabad, Hyd-500 020
2.Y.Vijaya Kumari, W/o.Y.Krsihna Rao Aged about: 65yrs, Occ: House Wife R/o.Plot No.131, Janapriya Homes Chinthalakunta, L.B.Nagar, Hyd-500 079
3.N.Prashanth Kumar, S/o.Subash Aged about: 45yrs, Occ: Business R/o.4-8-27/2, Sowjanya Colony Hayathnagar, Ranga Reddy District-501 505
4.V.Aruna Kumari, W/o.Krishna Rao, Aged about: 57yrs, Occ: Business R/o.16-2-718/A & B, Akerbagh Malakpet, Hyd-500 036
5.Y.Sundara Ram Reddy, S/o.Nok Known to the Plaintiff Aged about: 58yrs, Occ: Business R/o.Kuntloor Village, Hayathnagar Mandal Ranga Reddy District 501 505
(Respondents./Defendants No.2,6,12,23,and 26)
Please take this notice that, the above-named Petitioner/Plaintiff had filed the above suit for Perpetual Injunction against all of you and others and also filed one Interim Application for adi- Interim Injunction Application. The above said case is posted for appearance of all of you i.e. Defendants No.2, 6,12,23,and 26 and said case is posted **on 22-07-2024.** All of you please appear before the Hon'ble court **at 10:30 a.m.,** If you fails appear before the court on that day, the matter will be decided in your absence

//By order the Hon'ble Court//
R.Kumar Goud
Advocate
Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE-CUM X ADDL. METROPOLITAN MAGISTRATE: MEDCHAL MALKAJGIRI DIST AT: ATHIVELLI
O.S.No.192 of 2024

Between:
Karra Suresh Kumar, S/o Late. Karra Mavullayya, Aged about 44yrs, Occ: Pvt Service, R/o.H. NO.49-207, Cherukupally Colony, Near Pochamma Temple, Chintal, Hyderabad, Telangana-500054., ...Plaintiff
AND
1.The Mandal Revenue Officer (Tahasildar), Quthbullapur Mandal, M.M. Dist., Hyderabad
2.All concerned ...Defendants

PUBLIC NOTICE

To,
All Concerned
Whereas you are hereby informed that the above-named Plaintiff filed the above O.S.against you for SUIT FOR DECLARATION TO DECLARE THE PLAINTIFF IS THE LEGAL HEIR OF LATE.SMT. KARRA SITHA RATNAM, W/O. LATE. SRI. KARRA MAVULLAYYA. In the above suit, the matter is coming for your appearance. The matter stands posted **to 23-07-2024** for your appearance and if you have any objections. You have to appear in person or through an Advocate on that day in the above court **at 10.30 A.M.** otherwise the matter will be decided in your absence, as per law.

(By order of the court)
N. KOMALATHA
Advocate,
Moosapet, Hyderabad-18
PH: 9640328412

అప్పుల రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్, కలకత్తా
9 పాత పోస్టు ఆఫీసు వీధి,
7వ అంతస్తు, కలకత్తా- 700001
సాధారణ అప్పీల్ నెం. 55 / 20240627
డీఆర్‌టీ-2, హైదరాబాద్ లో ఎస్.ఎ.నెం.163/2019
నుండి ఉద్భవించింది.

అనెతా కోటిమ్ రెడ్డి మరియు ఇతరులు ...అప్పీలుదారులు
వర్సెస్
నారాయణ్ భాయ్ పటేల్ (కీ.శే.లు) మరియు ఇతరులు ...ప్రతివాదులు

టు,
1.నవ్‌నీత్ పటేల్, తండ్రి లేట్ నారాయణ్ భాయ్ పటేల్, నివాసం 6-4-7, భోలక్‌పూర్, క్రిష్ణా నగర్ కాలనీ, సికింద్రాబాద్- 500003. (ప్రతివాది నెం.5)
2. మెస్సర్స్ మౌళికా ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కార్యాలయము ఎం. ఎల్. ఏ కాలనీ, బంజారా హిల్స్, హైదరాబాద్-500 034, ఈ కంపెనీ యొక్క ప్రతినిధి మరియు దీని యొక్క డైరెక్టర్ ఎం. గోపాల్ రాజు (ప్రతివాది నెం.7)

సమ్మన్లు

1.డిఆర్‌టి-2, హైదరాబాద్ తరుపు ప్రిసైడింగ్ అధికారి వారిచే జారీ చేయబడిన ఉత్తర్వు మరియు ఇతర ఉపశమనముల పై అప్పీలెంటు సెక్యూరిటైజేషన్ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా ఆసక్తి చట్టం, 2002 అమలు యొక్క సెక్షన్ 18 క్రింద ఒక అప్పీలు దాఖలు చేసినారు. దావాకు సమాధానము ఇచ్చుటకు ఈ ట్రిబ్యునల్ వారి యొక్క సౌలభ్యం ప్రకారం తేది.08-07-2024 నాడు ఉదయం 10-30 గంటలకు లేదా ఆ తరువాత వెంటనే ఈ ట్రిబ్యునల్ వారి ముందు అప్పీలు చేయుటకు మరియు వ్రాతపూర్వక వాంగ్మూలమును ఇచ్చుట కొరకు తమకు సమ్మన్లను జారీ చేయబడును
2.మీరు ఏదైనా పత్రాలను ఫైల్ చేయాలనుకుంటే, మీరు వ్రాసిన వాంగ్మూలముతో పాటుగా జాబితాతో వాటిని కూడా దాఖలు చేయవచ్చును.
3.మీరు ఈ ట్రిబ్యునల్ వ్యక్తిగతంగా లేదా పూర్తిగా సూచించిన న్యాయవాది/ ప్లీడర్ గారి ద్వారా హాజరు కావలసి వచ్చినప్పుడు మీ యొక్క సమోదిత చిరునామా మరియు హాజరు యొక్క మెమోను కూడా దాఖలు చేయవలసి ఉంటుంది.
4.డీఫాల్ట్ గా ముందు ఇక్కడ పేర్కొన్న రోజున మీ యొక్క హాజరు, మరియు మీరు లేనప్పుడు మీ విచారణను పేర్కొనబడుతుంది మరియు నిర్ణయించబడుతుందని మీరు ఇక్కడ గమనించవలెను. ఈ 2024 వ సంవత్సరం జూన్ నెల 18 వ తేదీన నాచే ఈ క్రింద సంతకం చేయబడి మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రను వేయబడెను.

సం/-
సంబంధిత అధికారి యొక్క సంతకం
సమ్మన్‌ను జారీ చేయుటకు అధికారం

రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో సమస్యలపై ఆరా



నవతెలంగాణ-బేగంపేట్

రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పై స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ శుక్రవారం మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఉజ్జయిని దేవాలయం, క్లాత్ మార్కెట్, కండోజి బజార్, రాణిగంజ్ లారీ అడ్డా, హైదర్‌బస్తీ, జీరా, జవార్నగర్ కాలనీ, డీపీ కాలనీ, కష్ణనగర్ కాలనీలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, డీఈ సంతోషతో కలిసి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతిపత్రం



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ శుక్రవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌ను కలిశారు. ఈ మేరకు నాలా రీ మోడలింగ్ పనులు, రామిరెడ్డి నగర్‌లో రెయిన్ వాటర్ ప్రధాన సమస్య, మధుర నగర్ పార్క్ సుందరీకరణ, ఓపెన్ జిమ్స్, సీఆర్ఎంపీ సమస్యలు, యూజీడీ సమస్యలు, రవీంద్ర నగర్ చిన్న పార్కులో ప్లే ఎక్విప్మెంట్స్ డివిజన్‌లో ఉన్న మరెన్నో సమస్యలపై జోనల్ కమిషనర్‌తో చర్చించారు. రానున్న వర్షాకాలం నైపథ్యంలో సమస్యలను త్వరగా పరిష్కరించాలని కార్పొరేటర్ కమిషనర్ ను ఆమె కోరారు.

పీవీకి డిప్యూటీ మేయర్ నివాళులు



నవతెలంగాణ-ఓయూ

తెలుగుజాతి గర్వకారణం, భారతదేశాన్ని ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు కృషి చేసిన తొలి తెలుగు ప్రధాని భారతరత్న, తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ నరసింహారావు అని జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పీవీ నరసింహా రావు జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్ లోని పీవీ ఘాట్ వద్ద మహనీయుడికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పీవీ దేశానికి, తెలుగు రాష్ట్రాలకు చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.

ఓయూ ఆంగ్ల విభాగ మాజీ ఉద్యోగి బాలకృష్ణ కన్నుమూత



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో 1984లో సర్వీస్‌లోకొచ్చి సుదీర్ఘ కాలం సుమారు 35 ఏండ్ల పాటు ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగంలో పనిచేసిన జె. బాలకృష్ణ శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజి హాస్పిటల్‌లో గుండె పోటుతో మృతి చెందారు. ఆంగ్ల విభాగ నాన్ టీచింగ్ పనులన్నింటిలోనూ బాలకృష్ణ రాణించారు. సుమారుగా 20 పైగా హెడ్స్ కింద బాలకృష్ణ పని చేశారు. అనేకమంది విద్యార్థులకు సహాయ సహకా రాలు అందించారు. వారు ఉద్యోగిగా ఉన్న కాలంలో విద్యార్థులుగా చేరిన వారు చదువులు పూర్తి చేసుకుని విద్యావంతులుగా, రాజకీయ నాయకులుగా, ప్రొఫెసర్లగా ,వివిధ యూనివర్సిటీల పరిపాలకులుగా పని చేస్తూ ఉన్నారు. ఈ సందర్భంగా ఓయూ పూర్వ విద్యార్థి నాయకులు, ఆచార్యులు ఉద్యోగులు, విద్యార్థులు.. బాలకష్ణ సేవలను గుర్తు చేస్తున్నారు. వారి కుటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

బొగ్గు గనుల ప్రయివేటీకరణ ఆపాలి

- నిరసనలతో కదం తొక్కిన సీపీఐ(ఎం) శ్రేణులు
- బొగ్గు గనుల వేలం ఆపాలంటూ ధర్నాలు

కేంద్ర బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులు వేలం వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో పార్టీ శ్రేణులు పలు ప్రాంతాల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సింగరేణి కార్మికుల ఉపాధిని దెబ్బతీయొద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.





నవతెలంగాణ-ఓయూ

కేంద్ర బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులు వేలం వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో పార్టీ శ్రేణులు పలు ప్రాంతాల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

అడ్డగుట్ట ఎంఆర్ఓ చౌరస్తాలో సీపీఐ(ఎం) సికింద్రాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఎం.అజయ్ బాబు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర బీజేపీ ప్రభుత్వం వేలం వేస్తున్నదని.. సింగరేణి కంపెనీ కూడా ప్రయివేటు సంస్థలతో వేలంపాటలో పోటీ పడాలని నిర్ణయించారన్నారు. ఇప్పటికే నాలుగు బ్లాకులు గత బీఆర్ఎస్ పాలనలోనే మోడీ ప్రభుత్వం ప్రవేశ సంస్థలకు అప్పగించిందన్నారు. మన తెలంగాణ రాష్ట్రం నుంచి మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలంపాట ప్రక్రియను ప్రారంభించడం అన్యాయమన్నారు. బొగ్గు బ్లాక్ లన్ని ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదేముందని ప్రశ్నించారు. క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి మూతపడే వైపు మోడీ ప్రభుత్వం నెట్టుతున్న దన్నారు. ఈ ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి బొగ్గు కొనుగోలు కరెంట్ బిల్లు రూ. 29 వేల కోట్లు బకాయి పడిందని, అయినప్పటికీ సింగరేణి రూ. 35 వేల కోట్ల టర్నోవర్‌ల్లో లాభాల బాటలో నడుస్తున్నదన్నారు. ప్రతి సంవత్సరం రెండు నుంచి మూడు వేల కోట్ల రూపాయల లాభాలు అర్జిస్తుందంటూ మోడీ ప్రభుత్వం సుమారు 200 బొగ్గు బావులను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టిం దన్నారు. దీని ఫలితమే ఇప్పుడు జరుగుతున్న వేలం అన్నారు. బొగ్గు గనుల వేలం పాటలను వెంటనే ఆపాలని, దేశ సంపదను బడా కార్పొరేట్లకు కట్టబెట్టే కేంద్ర బీజేపీ విధానాలను ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సింగరేణిలో 40 వేల మంది పర్మినెంట్ కార్మికులు, మరో 26,000 మంది కాంటాక్ట్ కార్మికుల ఉపాధి నీ దెబ్బ తీయొద్దన్నారు. వారి కుటుంబాలను వీధిపాలు చేయొద్దన్నారు. సికింద్రాబాద్ జోన్ కమిటీ నాయకులు ఆర్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజ యే బాబు, నాయకులు ఏ బాలయ్య, టి. మహేందర్. ఎం. గోపాల్. కే కృపా కర్. ఫాతిమా యాకమ్మ, షంషేద్బేగం సరోజమ్మ, వజ్రా భాయ్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ నాయకుల ఆధ్వర్యంలో..

జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్‌లోని రెండు బొమ్మల సెంటర్ వద్ద సీపీఐ(ఎం) నాయకులు భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు చెన్నుపాటి చంద్రశేఖర రావు, టి. సాయి శేషగిరిరావులు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు ఉచితంగా కేటాయించాలని, వేలంపాట ద్వారా వద్దన్నారు. నేరుగా కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని ఆ విధంగా బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1957 నుంచి 2015 వరకు రాష్ట్రంలోని బొగ్గు గనుల మీద పూర్తి హక్కు సింగరేణికి ఉందని, 2015 లో బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని ఎత్తివేసి ప్రభుత్వ రంగ సంస్థలు కూడా వేలం పాటలో పాల్గొవాలని ఈ చట్టం తెచ్చిందన్నారు. ఇది అన్యాయమన్నారు. ప్రయివేటు సంస్థలకు ఇస్తే వారు ఇష్టం వచ్చినట్టు బొగ్గు రేట్లు పెంచితే, బొగ్గు మీద ఆధారపడి నడిచే మన థర్మల్ పవర్ విద్యుత్ సంస్థలు, ఆ భారాన్నంతా మళ్లీ ప్రజల మీదే నెట్టే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే దేశం మొత్తం పెద్ద ఎత్తున ఉద్యమం లేచే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రహమత్ నగర్ ఇన్‌చార్జి నాయకులు జె స్వామి, దేవదాస్, బాలయ్య, భాగ్యరాజ్, సుధాకర్, సోమలా నాయక్, యాదగిరి, యాదయ్య, జైపాల్, రాజు, కేశప్ప ,కష్ణ పార్వతమ్మ, జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో..

బేగంపేట్ : బన్సీలాల్‌పేట్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ నాయకులు పి. మల్లేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 61 బొగ్గు బావులను వేలం వేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, మరో 8 మంది పార్లమెంట్ సభ్యులు ఉండి కూడా తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉండి కూడా సింగరేణిని దివాలా తీయించే విధంగా మన బొగ్గు బ్లాకులను వేలంపాట వేయడం ద్వారా బీజేపీ తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తున్నద న్నారు. తెలంగాణకు మణిహారం సింగరేణిని కాపాడుకునేందుకు ప్రజలు ప్రజా స్వామ్య శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోన్ నాయ కులు పి.మల్లేష్, అంజయ్య, లక్ష్మయ్య, అనిల్, నరసింహ, శంకర్, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కంటోన్మెంట్ : బొగ్గు బావులను వేలంపాటకు నిరసనగా కంటోన్మెంట్ సీపీఐ(ఎం) నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రసూల్ పుర పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ, బి నారాయణ, హార్బోర్డ్ మైసమ్మ, వెంకట్రావు, శ్రీను, ప్రకాష్, ఎల్లమ్మ, వెంకన్న, తది తరులు పాల్గొని కార్డులతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.







కల్యాణలక్ష్మీ ఒక వరం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

పేదింటి ఆడపడుచుల పెండ్లికి కల్యాణ లక్ష్మీ ఒక వరమని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన కార్యాలయం వద్ద బేగంపేట డివిజన్‌కు చెందిన 13 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు వారి ఇంటి ఆడబిడ్డ పెండ్లి కోసం పడుతున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన వారు తమ పరిసరాలలోని అర్హులైన వారు కూడా సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, ఆరీఫ్, శేఖర్, ఆకుల హరికష్ణ, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



'బోనాల ఉత్సవాలకు ప్రతి డివిజన్‌కూ రూ. 3 కోట్లు ఇవ్వాలి'

నవతెలంగాణ-బేగంపేట్

బోనాల ఉత్సవాలు పురస్కరించుకొని సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌కు రూ.3 కోట్ల చొప్పున మొత్తం రూ. 15 కోట్ల ప్రతేక నిధులు కేటాయించాలని లష్కర్ జిల్లా సాధన సమితి కోరింది. ఈ మేరకు శుక్రవారం సమితి అధ్యక్షులు శ్రీ గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆయా డివిజన్ల లోని దేవాలయాల పరిసర ప్రాంతాలలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు పూర్తిగా పడాయి పోయాయి కాబట్టి ఈ పనులను చేపట్టడానికి తక్షణమే నిధులను కేటాయించి పనులను త్వరగా చెప్పట్టేందుకు కింది స్థాయి అధికారులకు వెంటనే ఆదేశాలివ్వాలని కోరారు... రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ద్వారా నగరంలోని దేవాలయాలకు ఆర్థిక సహాయం నిమిత్తం రూ. 20 కోట్లు కేటాయించిదని అయితే జీహెచ్ఎంసీ తరపున కూడా నిధులు కేటాయిస్తే ఉత్సవాలు మరింత ఘనంగా జరుపుకోవచ్చని అయన తెలిపారు. ప్రతి దేవాలయం వద్ద తాత్కాలిక లైటింగ్‌ను కూడా 2 రోజుల ముందు నుంచి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి బాబు రావు, శైలేందర్, కృష్ణ ముదిరాజ్, రవీందర్ సాగర్ లు పాల్గొన్నారు.



బీసీ గురుకులాల సీట్ల సంఖ్యను పెంచాలి

- బీసీ గురుకులాల సెక్రటరీ సైదులును కోరిన లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

బీసీల జనాభాకు తగ్గట్టుగా బీసీ గురుకులాల సంఖ్యను పెంచాలని కోరుతూ గురుకులాల కార్యదర్శికి వినతిపత్రం సమర్పించినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ గురుకుల పాఠశాలలు విద్యార్థులకు సరిపోవడం లేదని, వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే కేవలం వందల మందికి మాత్రమే అవకాశాలు దొరుకుతున్నాయన్నారు. గురుకులాల సీట్ల సంఖ్యను రెట్టింపు చేస్తే తప్ప బీసీలకు న్యాయం జరగదన్నారు.గురుకులాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని,స్వంత్ర భవనాలు నిర్మించాలని, ఐదవ తరగతి నుంచే విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కోరారు. ఈ గుంటి మహేష్, నాగేందర్, కొండల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరిస్తా



- ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీ
- బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రెండో వార్డ్ శ్రీలంక బస్తీ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామనిఎమ్మెల్యే శ్రీ గణేష్ బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. శుక్రవారం బస్తీ వాసుల సమస్యల పరిష్కారం కోసం శ్రీలంక బస్తీలో సమా వేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే దష్టికి తీసుకుపోయారు. ముఖ్యం గా మంచినీరు, విద్యుత్ దీపాలు, రోడ్లు, ఇంకా సీసీ కెమెరాలు ఏర్పాటు విషయంపై వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యే శ్రీలంక బస్తీలో తిరిగి సమస్యలను పరిశీలించారు

సీఎంను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు

- వలిగొండ నరసింహా

నవతెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు లేదని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్, నిరుద్యోగ బస్సు చైతన్య యాత్ర కో ఆర్డినేటర్, ఓయూ రీసెర్చ్ స్కాలర్ వలిగొండ నరసింహ అన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ద కాలంగా కుటుంబ పాలనలో ఏనాడు కూడా విద్యార్థి నిరుద్యోగుల గురించి మాట్లాడకుండా వారి సంక్షేమం పట్టించుకోకుండా, వారి జీవితాలను ఆగం చేశారన్నారు. మళ్లీ ఈరోజు నకిలీ ప్రేమ వలకబోస్తే ఎంతో చైతన్యవంతమైన తెలంగాణ విద్యార్థి, యువత నమ్మేస్థితిలో లేరన్నారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగుల సంక్షేమం కోసం, తమ ఉజ్వల భవిష్యత్తు కోసం నిత్యం పరితపించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రజా పాలనను విమర్శించే హక్కు మీకు లేదని గుర్తు చేస్తున్నామన్నారు. మీ హయాంలో జరిగిన పేపర్ లీకేజీల మీద కనీసం స్పందించకుండా, ప్రవళిక ఆత్మహత్యను అవహేళన చేసిన నువ్వు నిరుద్యోగ విద్యార్థుల గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. ధ్వంసమైన విద్య వ్యవస్థని సరిదిద్దడం కోసం తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యకి ప్రాముఖ్యతను గుర్తించి దానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి ముఖ్యమంత్రి ఆ శాఖ నిర్వహిస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే పలుమార్లు విద్యా వ్యవస , ఉద్యోగ నియామకలపై పై రివ్యూ మీటింగ్‌లు పెట్టడం కూడా జరిగిందన్నారు. విద్యార్థి నిరుద్యోగ మిత్రులారా.. మన గురించి ఆలోచించే నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని.. దయచేసి కొద్దిమంది వ్యక్తిగత స్వార్థం కోసం చేసే రాజకీయాల్లో సమిధలు కావద్దని అన్నారు. కొద్దిగా ఓపిక పట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శంకర్ యాదవ్, వట్టికూటి అనిల్ గౌడ్, పార్థు, ప్రవీణ్ నాయక్ ,వై అనిల్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



ఆయమ్మల సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్‌లో గల శిశువిహార్‌లో పనిచేస్తున్న ఆయమ్మలకు ప్రతినెలా 7వ తారీఖున వేతనాలు ఇవ్వాలని, వారి సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. శుక్రవారం డీడబ్ల్యుఓ అగ్గేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ శిశువిహార్‌లో నలుగురు స్వీపర్లకు ఇద్దరే ఉన్నారని, ఐదుగురు దోబీలకు ఇద్దరే ఉన్నారని వెంటనే ఖాళీలు భర్తీ చేసి పనిచేస్తున్న వారిపై భారం పడకుండా చూడాలన్నారు. వీరి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని బీడబ్ల్యుఓ హామీనిచ్చారు. వేతనాలు ప్రతినెలా పదో తేదీలోపు ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని, మిగతా సమస్యలన్నీ కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని యూనియన్ నాయకులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ సుశీల, కోశాధికారి శ్యామల, నాయకులు తార, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



సెయిలింగ్ పోటీల నిర్వహణ అభినందనీయం

- ఈవీడీఎం డైరెక్టర్ ఏవీ.రంగనాథ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను చాటేలా జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఈవీడీఎం)డైరెక్టర్, ఐజీ ఏవీ.రంగనాథ్ తెలిపారు. జులై 1నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న సెయిలింగ్ వీక్ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరు కావాలని కోరుతూ ఆయనను బుద్ధభవన్‌లోని ఆయన కార్యాలయంలో మేముసైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పసునూరి భాస్కర్, గమన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల చైర్మెన్ డా.నందకిషోర్ యర్రంశెట్టి, బయాన్ కంపెనీ మార్కెటింగ్ జీఎం ముంగి గిరిధర్, ఆర్మీ మేజర్ కిరణ్ సారథ్యంలోని ఆర్మీ అధికారుల బృందం కలిసి కోరింది. ఈ సందర్భంగా సెయిలింగ్ పోటీల కోసం రూపొందించిన టీ షర్ట్‌ను రంగనాథ్ ఆవిష్కరించారు. జులై 7న నిర్వహించే బహుమతుల ప్రదానోత్సవ వేడుకకు తప్పనిసరిగా హాజరు కావాలని నిర్వాహకులు ఆయనను కోరగా, రంగనాథ్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సెయిలింగ్ పోటీల తీరుతెన్నులు, నిర్వహణ విధానాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఐజీ రంగనాథ్‌ను కలిసిన వారిలో సుబేదార్ సాయిరామ్, సుధాకర్ రెడ్డి తదితరులున్నారు.

బాలిక అదృశ్యం..

- గంటలో కేసును చేధించిన కార్ఖానా పోలీసులు

నవతెలంగాణ-కంటోన్మెంట్

తప్పిపోయిన బాలిక కేసును కార్ఖానా పోలీసులు గంటలో చేదించారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం స్థానిక బురదగుంట గుడిసెల నుంచి ఓ 5 ఏండ్ల చిన్నారి తప్పిపోయింది. దాంతో చిన్నారి తల్లిదండ్రులు కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వెంటనే కార్ఖానా సీఐ రామకృష్ణ ఆదేశాల మేరకు ఎస్ఐ రవికుమార్, పీసీ ప్రవీణ్ కుమార్, పీసీ నవీన్ కుమార్‌లతో కూడిన ప్రత్యేక బృందం ఏర్పడింది. గంట వ్యవధిలోనే చిన్నారిని ట్యాంక్ బండి వద్ద కనుగొన్నారు అనంతరం బాలికను తీసుకొచ్చి సీఐ రామకృష్ణ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పజెప్పారు.

బ్రీత్ ఎనలైజర్ మిషన్ ఎత్తుకెళ్లిన వ్యక్తి

నవతెలంగాణ-కంటోన్మెంట్

ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించే బ్రీత్ ఎనలైజర్ మిషన్‌ను ఓ వ్యక్తి దొంగిలించిన ఘటన బోయినపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో చోటుకేసుకుంది. వివరాల్లోకెళ్తే.. తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు గురువారం సాయంత్రం పుల్లారెడ్డి సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కారులోని డ్రైవర్‌ను డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా,బ్రీత్ ఎనలైజర్ మిషన్‌తో ఆ వ్యక్తి ఉడాయించారు. చీకటి ఉండడంతో కారు స్పీడ్ గా వెళ్ళపోవడంతో అతన్ని పోలీసులు పట్టుకోలేకపోయారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు బోయిన్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆ స్థలంలో కమిటీ హాల్ నిర్మించండి

- ఎమ్మెల్యేకు జంపన్న ప్రతాప్ వినతి

నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లిలోని ప్రస్తుతం నడవని నేతాజీ స్కూల్‌తో పాటు కంటోన్మెంట్ బోర్డు ఆధీనంలో ఉన్న స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించాలని శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు విజ్ఞప్తిచేశారు. కంటోన్మెంట్ బోర్డు సీఈవో, మధుకర్ నాయక్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌లు నేతాజీ స్కూల్ ను సందర్శించి వార్డు ప్రజలకు ఉపయోగపడేలా మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.



పాఠశాలలో బోరు వెయ్యండి....

అలాగే కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్ పల్లి, బాలం రాయ్ ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సమస్యను పరిష్కరించడానికి బోర్లు వేయాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు జంపన ప్రతాప్ వినతి పత్రాన్ని అందజేశారు.

బోనాలకు అధిక నిధులు మంజూరు చేయండి.....

అలాగే బోయిన్ పల్లి లోని పలు అమ్మవారి దేవాలయాలకు బోనాల నిధులను పెద్ద ఎత్తున అందేలా చూడాలని జంపన ప్రతాప్ కోరారు. గత ప్రభుత్వం మంత్రుల ఇలాకాలోకి కంటోన్మెంట్‌కు రావలసిన నిధులను మరలించుకున్నారని ఈసారి కంటోన్మెంట్ నియోజకవర్గానికి భారీగా నిధులు తీసుకువచ్చేలా చూడాలని జంపన ప్రతాప్ కోరారు. పలు దేవాలయాలకు

వర్షాకాలం పప్పులు, మసాలాలు పాడవకుండా...

చిరుజల్లుల రాకతో మండే వేసవి నుంచి ఉపశమన లభిస్తుంది, మనస్సుకు చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే... వాతావరణంలో అధిక తేమ కారణంగా.. వంట సామాగ్రి త్వరగా పాడవుతూ ఉంటాయి. తేమ కారణంగా పప్పులు, మసాలా దినుసులు, పిండులు పురుగులు పట్టడం, గడ్డలుగా మారడం, బూజు పట్టి చెడిపోతూ ఉంటాయి. ఈ ఇబ్బందుల కారణంగా డబ్బు, సమయం రెండూ వృథా అవుతాయి. ఈ సీజన్‌లో వంట సరకులు, పిండ్లు, మసాలాలు, పప్పులను ఫ్రెష్‌గా ఉంచుకోవడానికి, పాడవకుండా తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలను చూద్దాం..



ఎయిర్ టైట్ కంటైనర్‌లో స్టోర్ చేయండి..

మసాలాలు, పిండ్లు, పప్పులను ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేస్తే.. అవి పాడవకుండా కాపాడుకోవచ్చు. మూతలు టైట్‌గా ఉండే గాలి చొరబడని గాజు, ప్లాస్టిక్ కంటైనర్లను సెలెక్ట్ చేసుకోండి. గాజు డబ్బాలైతే ఇంకా బెస్ట్. ఎందుకంటే అవి నాన్-రియాక్టివ్, తేమ లోనికి రాకుండా రక్షిస్తాయి. ఈ డబ్బాల్లో పిండ్లు, మసాలాలు, పంచదార వంటి వేసే ముందు వాటిని శుభ్రం చేసి, పూర్తిగా ఆరినివ్వండి.

తేమ ప్రాంతాలకు దూరంగా ఉంచండి..

వంట గది కిటికీలు, సింక్‌లు, స్టవ్‌టాప్‌ల దగ్గర తేమ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల దగ్గరలో పప్పులు, సుగంధ ద్రవ్యాలు, చక్కెర వంటివి నిల్వ ఉంచొద్దు. ఎందుకంటే.. అవి తేమకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. దీనికి బదులుగా ప్రత్యక్ష సూర్యకాంతి లేని చోట, తడి లేని చోట వీటిని ఉంచండి. పొడి ప్రదేశంలో పప్పు, పిండి డబ్బాలు ఉంచితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.

తక్కువ పరిమాణంలో..

వర్షకాలంలో తక్కువ పరిమాణంలో సరుకులు కొనుగోలు చేయండి. ఇలా చేస్తే.. సరుకు పాడవ్వకుండా ఉంటాయి. ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంటే.. తేమ కారణంగా పురుగు, బూజు పట్టే అవకాశం ఉంది. సుగంధ ద్రవ్యాలు, చక్కెర వాటి పరిసరాల నుంచి తేమను ఎక్కువగా గ్రహిస్తాయి. తేమ బదిలీని నిరోధించడానికి, ప్రతి పదార్థానికి ప్రత్యేక స్పూన్లు, ఉపయోగించండి. వీటిని ముట్టుకునే ముందు మీ చేతులకు తడి లేకుండా శుభ్రంగా క్లాత్‌తో తుడుచుకోండి.


తరచు చెక్ చేయండి..

మసాలాలు, పిండ్లు, పప్పులను తరచు చెక్ చేస్తూ ఉండాలి. వాటిలో పురుగులు, రంగు మారడం, వాసన రావడం, తేమగా ఉండటం వంటివి గమనిస్తే.. పైభాగాన్ని వేరు చేసి మంచివి వేరే కంటైనర్‌లో ఉంచండి. వాటిని ఎండలో ఉంచినా.. పాడవకుండా రక్షించుకోవచ్చు.

సిలికా జెల్ ప్యాక్‌లను వాడండి..

మసాలా, చక్కెర, పప్పుల డబ్బాలో సిలికా జెల్ ప్యాక్‌లను వేయండి. సిలికా జెల్ తడిని పీల్చుకుంటుంది, వస్తువులు త్వరగా పాడవకుండా కాపాడుతుంది.

మాటలు కరువై పోయిన సమాజంలో మనం బతుకుతున్నాం. కానీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం చాలా అవసరం. అందులోనూ భార్యా భర్తలు మాట్లాడుకోవడం మరింత అసరం. లేదంటే ఆ ప్రభావం కుటుంబం మొత్తంపై పడుతుంది. అదే మనసు విప్పి అన్ని విషయాలు మాట్లాడుకుంటే ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి. మాటలకు అంతటి బలం ఉంటుంది మరీ! ఇంతకీ ఈ మాటల గురించి ఎందుకు చెబుతున్నాను అనుకుంటున్నారా? దంపతుల మధ్య మాటలు కరువైతే ఎలాంటి సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందో ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



మాటే మంత్రమూ...

రాజుకు 48 ఏండ్లు ఉంటాయి. ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరు పిల్లలున్నారు. అతని భార్య రాధిక కూడా ఉద్యోగం చేస్తుంది. రాజు తల్లిదండ్రులు కూడా వీరితో పాటే ఉంటారు. రాధిక జీతం కూడా రాజునే తీసుకుంటాడు. ఆమెకు ఏదైనా అవసరముంటే ఇస్తాడు. సరుకులు తీసుకురావడం, పిల్లల ఫీజులు, వాళ్ళ అమ్మానాన్న ఆస్పత్రి ఖర్చులు, ఏదైనా ఫంక్షన్‌కు వెళ్ళడం లాంటివన్నీ రాజునే చూసుకుంటాడు. రాధిక అసలు ఎలాంటి విషయాల్లోనూ జోక్యం చేసుకోదు. అతను కూడా ఆమెతో పంచుకోండు. ఉద్యోగం చేయడం, వచ్చిన జీతం రాజుకు ఇవ్వడం మాత్రమే చేస్తుంది. అత్తమామలను బాగా చూసుకుంటుంది. పిల్లలకు కావల్సినవన్నీ చేసి పెడుతుంది. రాజుకు ఎదురు మాట్లాడదు. ఎప్పుడైనా బాగా కోపం వచ్చినప్పుడు మాత్రం గట్టిగా అరుస్తుంది. మళ్లీ కాసేపట్లో మామూలైపోతుంది. కానీ ఏం జరిగిందో తెలియదు కానీ రాజుతో ఈ మధ్య రాధిక అస్సలు మాట్లాడడం లేదు. ఆమెతో మాట్లాడి తన సమస్య పరిష్కరించుకోవడం కోసం ఐద్వా అదాలత్‌కు వచ్చి...

మేడమ్ నా భార్య నాకు కావలసినవన్నీ చేసి పెడుతుంది. అడక్కుండానే భోజనం పెడుతుంది. కానీ నా నుండి మాత్రం ఏ సహాయం తీసుకోవడం లేదు. ఇంతకు ముందు వంటగదిలో ఏదైనా వస్తువు అందకపోతే నన్ను పిలిచేది. కానీ ఇప్పుడు కుర్చీవేసుకొని తనే తీసుకుంటుంది. ఇలా ఎందుకు చేస్తుందో అర్థం కావడం లేదు. వాళ్ల పెద్దవాళ్ళతో అడిగించినా ఏమీ చెప్పడం లేదు. మా అమ్మానాన్నతో మాత్రం మంచిగా ఉంటుంది. ఏం చేయాలో తోచక మీ సలహా కోసం వచ్చాను' అని చెప్పాడు.

రాజు చెప్పింది విన్న తర్వాత మేము రాధికను పిలిపించాము. కానీ ఆమె మాతో కూడా చెప్పడానికి ఇష్టపడలేదు. 'ఏం లేదు మేడమ్ మేము బాగానే ఉన్నాం. రాజుకు కావల్సినవన్నీ అడక్క ముందే తెచ్చి ముందు పెడుతున్నాను. నా జీతం మొత్తం ఆయనకే ఇస్తున్నాను. నాకేదైనా అవసరం అయితే తీసుకుంటాను. లేకపోతే లేదు. ఈ మధ్య కాలంలో అది కూడా మానేశాను. వాళ్ళ అమ్మానాన్నలను, ఇంటికి వచ్చిన బంధువులను అందరినీ బాగానే చూసుకుంటున్నాను. ఇంకా ఏం కావాలని ఇక్కడి వరకు వచ్చారో నాకు అర్థం కావడం లేదు. నేను ఏ విషయంలో పొరపాటు చేస్తున్నానో చెప్పమనండి సరిచేసుకుంటాను' అంది.

> **'నా జీతం మొత్తం ఆయనకే ఇస్తున్నాను. నాకేదైనా అవసరం అయితే తీసుకుంటాను. లేకపోతే లేదు. ఈ మధ్య కాలంలో అది కూడా మానేశాను. నేను ఏ విషయంలో పొరపాటు చేస్తున్నానో చెప్పమనండి**

దానికి రాజు 'నాతో ఎందుకు మాట్లాడడం లేదు. పోనీ నేను ఏదైనా పొరపాటు చేస్తే చెప్పు సరి చేసుకుంటాను' అన్నాడు.

'ఇన్నేండ్ల తర్వాత మీరు చేసే పొరపాట్ల గురించి చెప్పి మిమ్మల్ని సరిచేసే ఓపిక నాకు లేదు. నేను ఏది చేసినా, ఏది మాట్లాడినా తప్పే అన్నట్టుగా రాజు మాట్లాడతాడు. పెండ్లయి 23 ఏండ్లు అవుతుంది. ఇప్పటికి కూడా నేను ఏది చెప్పినా అసలు వినరు, పట్టించుకోరు. ఏ విషయం చెప్పాలన్నా కనీసం రెండు నిమిషాలు కూడా కేటాయించరు. నేనేదైనా అడిగినా సమాధానం చెప్పరు. నేనంటే లెక్కేలేదు. పాపకు ఇప్పుడు 22 ఏండ్లు వచ్చాయి. త్వరలో పెండ్లి చేయాలి. నేను జాబ్ చేసే డబ్బుతో ఓ ఇల్లు తీసుకుంటే ఆమెకు ఉపయోగపడుతుంది కదా! మిగిలిన డబ్బులు పాప పెండ్లికి వస్తాయి కదా! ఈ విషయాల గురించి మాట్లాడదామంటే నాకు తెలివి లేదన్నట్టు ప్రవర్తిస్తారు. ఏమైనా అంటే అరుస్తుంది అంటారు. ఎన్ని సార్లు అడిగినా సమాధానం చెప్పరు. అలాంటి టైంలోనే నేను అరుస్తాను. ఊరికే ఎందుకు అరుస్తాను. పిల్లలతో మీ అమ్మకు ఏమీ తెలియదు, ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తుంది, అరుస్తుంది అని చెప్తుంటారు. నేను ఉద్యోగం చేయాలి. ఇంట్లో పనులు కూడా చేసి పెట్టాలి. అక్కడ కూడా ఎలాంటి సహాయం చేయరు. ఏదైనా వస్తువు అందకపోతే తీసి ఇవ్వడానికి కూడా చాలా ఇబ్బంది పడుతుంటారు.

పిల్లలతో కూడా ఆయన పెద్దగా మాట్లాడరు. ఎప్పుడూ ఫోన్ చూసుకుంటూ కూర్చుంటారు. ఆ ఫోన్ పని చేయక వారం అవుతుంది. అందుకే నేను మాట్లాడడం లేదనే విషయం గుర్తొచ్చినట్టుంది. కానీ అయన ఫోన్ పిచ్చిలో పడి మమ్మల్ని ఎప్పుడో దూరం చేసుకున్నారు. ఆయనకు చెప్పినా ఎలాంటి ఉపయోగం లేదని ఈ మధ్యనే మా స్నేహితులతో కలిసి మా పాప కోసం ఓ ఇల్లు కొన్నాను. మిగిలిన డబ్బు వేరే చోట ఇన్వెస్ట్ చేశాను. ఇక బాబు కాలేజీలో అమ్మాయిలను ప్రేమించమంటూ ఇబ్బంది పెడుతున్నాడని ప్రిన్సిపల్ కంప్లెయింట్ ఇచ్చారు. కనీసం ఆ విషయం గురించి అయినా మాట్లాడాలి కదా. అది కూడా చెయ్యరు. నేను చెప్పినా పట్టించుకోలేదు. నేనొక్కదాన్నే వెళ్ళి మాట్లాడి వచ్చాను. అసలు ఆయన ఏ విషయం గురించి కూడా సరిగ్గా పట్టించుకోరు. నేను మాట్లాడినా వినిపించుకోరు. అందుకే మాట్లాడడమే మానేశాను. మాట్లాడినా తప్పే, మాట్లాడక పోయినా తప్పే అన్నట్టు ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నారు. ఇప్పటికే జీవితం సగం అయిపోయింది. ఇప్పుడైనా మారాలి కదా? రాజు మారడం లేదు. కాబట్టి నేనే మారాలని నిర్ణయించుకున్నాను' అంటూ ఏడుస్తూ చెప్పింది రాధిక.

రాధిక ఎంతో ఆవేదనతో చెప్పిన విషయాలన్నీ విని రాజుతో 'భార్యా భర్తలు ఇంటి విషయాల గురించి మాట్లాడుకోవడం, బాధ్యతలు పంచుకోవడం చాలా అవసరం. రాధిక లాంటి వ్యక్తి మీకు భార్యగా దొరకడం మీ అదృష్టం. ఆమె ఏదైనా విషయం చెప్పినప్పుడు వినడం నేర్చుకోండి. భార్య, భర్తలు ఏ విషయాలైనా స్వేచ్ఛగా మాట్లాడుకోవాలి. ప్రతి విషయాన్ని పంచుకోవాలి. అది మీ కుటుంబానికి చాలా మంచిది. ఒకరిపై ఒకరికి నమ్మకం ఏర్పడుతుంది. మీరు మాట్లాడే ఒక్క మాతో రాధికలో ధైర్యం నింపుతుంది. ఆమెపై మీకున్న ప్రేమను తెలియజేస్తుంది. ప్రతి మహిళ తన బాధలు, సంతోషాలు భర్తతోనే చెప్పుకోవాలనుకుంటుంది. కానీ మీరు మాత్రం దానికి అవకాశమే ఇవ్వడం లేదు. ఓపిక నశించి ఈ రోజు ఆమె మీతో మాట్లాడడమే మానేసింది. కనుక ఇప్పటికైనా అర్థం చేసుకొని ఆమెతో మనసు విప్పి మాట్లాడండి. ఆమె చెప్పేది వినండి' అని చెప్పాము.

> **'నావల్ల రాధిక ఇంత బాధపడుతుందని అర్థం చేసుకోలేకపోయాను. ఇక నుండి కచ్చితంగా తనలో మాట్లాడతాను. తను చెప్పింది వింటాను'**

'నావల్ల రాధిక ఇంత బాధపడుతుందని అర్థం చేసుకోలేకపోయాను. ఇక నుండి కచ్చితంగా తనలో మాట్లాడతాను. తను చెప్పింది వింటాను' అని చెప్పి రాధికను తీసుకెళ్ళాడు.

- వై వరలక్ష్మి, 9948794051

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

అదానీకి పాతబస్తీ కరెంటు వసూళ్లు

(మొదటిపేజీ తరువాయి)

గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్స్ ఇటీవలే హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్‌ను కొనుగోలు చేసింది. దీని విస్తరణ కోసం రూ.1,400 కోట్లతో ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టేలా ఒప్పందం జరిగింది. మరోవైపు హైదరాబాద్ కేంద్రంగా రూ.5వేల కోట్లతో 100 మెగావాట్ల డేటా స్టోరేజ్ సెంటర్ నిర్మాణం కూడా కార్యరూపంలోకి వస్తున్నది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) ద్వారా కోయ బెస్తగూడెంలో 850 మెగావాట్లు, నాచారంలో 500 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్ల నిర్మాణం చేపట్టనున్నారు. పాతబస్తీలో కొత్తగా నిర్మించే అండర్‌గ్రౌండ్ కరెంటు లైన్లకు ఈ ప్రాజెక్టుల నుంచే విద్యుత్ సరఫరా చేస్తారని సమాచారం. దీనికోసం రూ.5వేల కోట్ల నిధుల్ని ఆ సంస్థ కేటాయించింది. ప్రస్తుతం పాతబస్తీలో విద్యుత్ నష్టాలు 40 శాతం నుంచి 37 శాతానికి తగ్గాయని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

దొంగలతో కలిసెటోళ్ల గురించి బాధలేదు..

నవతెలంగాణ-మర్కుక్

పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధ లేదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లిలో గల వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం కూడా వివిధ ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ మాట్లాడారు. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు కేసీఆర్‌తో ఫొటోలు దిగడానికి పోటీపడ్డారు. అనంతరం ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. సమైక్యవాదులతో కలబడి నిలబడి అత్యంత కష్టతరమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఒక లెక్కనే కాదని, పార్టీ నుంచి పోయి దొంగల్ల కలుస్తున్న నాయకుల గురించి ఏమాత్రం ఆలోచించవలసిన అవసరం లేదని కేసీఆర్ అన్నారు. పార్టీయే నాయకులను తయారు చేస్తది తప్ప, నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరన్నారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే, మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటది." అని వివరించారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామన్నారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను,కలలను నెరవేర్చగలిగే అవగాహన బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని అన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా ఉద్యమాన్ని నడిపించి రాష్ట్రాన్ని సాధించిన బిఆర్ఎస్ కు మాత్రమే ఉందని కేసీఆర్ వివరించారు. అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల, హుజురాబాద్ ఎమ్మెల్యేలు డా. సంజయ్, కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ, జగిత్యాల జెడ్పీ చైర్మెన్ వసంత సురేష్, పెద్దపల్లి నేత ఉష తదితరులున్నారు.

ఆత్మీయ సమావేశాలకు మూడురోజుల విరామం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించే ఆత్మీయ సమావేశాలకు శనివారం నుంచి సోమవారం వరకు మూడురోజుల పాటు విరామం ప్రకటించారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకత్వం ఒక ప్రకటనలో తెలిపింది. వైద్యుల సూచనల మేరకు కేసీఆర్‌కు మూడు రోజుల పాటు విశ్రాంతినివ్వాలని కార్యకర్తలను కోరింది. తిరిగి ప్రకటన తర్వాతే తదుపరి సమావేశాలు పున: ప్రారంభం అవుతాయని తెలిపింది.

సెల్లుతో జేబుకు చిల్లు

(మొదటిపేజీ తరువాయి)

బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల వినియోగదారుల సగటు వ్యయంతో పోల్చితే భారత్‌లో తక్కువ మొబైల్ చార్జీలు అమల్లో ఉన్నాయని పేర్కొంటున్నాయి. అయితే ఆయా దేశాల ప్రజల తలసరి ఆదాయంతో పోల్చితే భారతీయుల ఆదాయం అత్యల్పమన్న విషయాన్ని టెలికం కంపెనీలు చెప్పడం లేదు. అదే విధంగా భారత్‌తో పోల్చితే ఆయా దేశాల్లో వినియోగదారుల సంఖ్య చాలా తక్కువ. భారత్‌లో వాడకందారులు ఎక్కువ కాబట్టి.. చార్జీలు తక్కువగా ఉన్న ఎక్కువగా రెవెన్యూ వస్తుందనేది వాస్తవం.

ఎయిర్‌టెల్ చార్జీలకు రెక్కలు

రిలయన్స్ జియో బాటలోనే భారతీ ఎయిర్‌టెల్ తమ వినియోగదారులపై భారం మోపింది. గురువారం జియో ప్లాన్లపై సరాసరి 12.5 శాతం నుంచి గరిష్టంగా 25 శాతం వరకు ధరలు పెంచేసింది. ఇదే క్రమంలో శుక్రవారం భారతీ ఎయిర్‌టెల్ తన వివిధ ప్లాన్‌లపై టారిఫ్‌లను 10-21 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రతీ వినియోగదారుడిపై సగటు రాబడి (ఎఆర్‌పీయూ) రూ.300 కంటే ఎక్కువగా ఉండాల్సిన అవసరం ఉందని ఎయిర్‌టెల్ పేర్కొంది. పెంచిన మొబైల్ టారిఫ్‌లు జులై 3 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపింది. ప్రస్తుతం ప్రధానంగా ఫీచర్ ఫోన్లలో ఉపయోగించే రూ.179గా ఉన్న ప్లాన్ ధరను ఇప్పుడు రూ.199కి చేర్చింది. మరో బేస్ ప్లాన్ రూ.265ను రూ.299కు చేర్చగా, రూ.299గా ఉన్న ప్లాన్ వ్యయాన్ని రూ.349కు పెంచింది.

వారం రోజుల్లో... పీసీసీ మార్పు మంత్రివర్గ విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

పెద్దలు సమాలోచనలు చేస్తున్నట్టు చెప్పారు. ఎవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి, ఎవరికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి అనేది పార్టీ పెద్దలే నిర్ణయిస్తారన్నారు.గత ఐదు రోజులుగా ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉన్నారు. వరుసగా రెండో రోజు మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పీసీసీ చీఫ్‌గా రెండు ఎన్నికలు పూర్తి చేశానని, జులై 7తో మూడేండ్లు పూర్తి కానుందని తెలిపారు. కొత్త పీసీసీ చీఫ్ నియామకం, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని హైకమాండ్ డిసైడ్ చేస్తుంద న్నారు. పార్టీ అధ్యక్ష పదవి నియామకంలో సామాజిక న్యాయం పాటిస్తామన్నారు. పీసీసీ రేసులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే కాకుండా, ఈడబ్ల్యూఎస్‌లకు చెందిన నేతలు ఉండ వచ్చన్నారు. మహిళలకు పీసీసీ ఇస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు, ఈ నిర్ణయం బాగానే ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు మహిళను పీసీసీ చీఫ్‌గా నియమించ లేదన్నారు.

మూడు రోజుల్లో రైతు రుణమాఫీ మార్గదర్శకాలు

మూడు రోజుల్లో ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల లోపు రైతు రుణమాఫీ మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తమ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత రుణమాఫీ అని స్పష్టం చేశారు. ఒక కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదన్నారు. రేషన్‌కార్డును కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. రైతు రుణమాఫీ తరువాత రైతు బంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని చెప్పారు.

ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్

ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్‌ను తీసుకురానున్నట్టు సీఎం చెప్పారు. ధరణిని తొలగించే స్టడీ జరుగుతుందన్నారు. ఇప్పటికే ధరణిపై కమిటీ వేశామన్నారు. ధరణిలో ఉన్న లోపాలు, ఆ లోపాలను సరిదిద్దేందుకు పని చేస్తున్నట్టు చెప్పారు. సమాజం ఉన్నంత సేపు అవినీతి ఉంటుందని, ఆ అవినీతిని నిరోధించేందుకు తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

ధనవంతులకు రూ. 25 వేల కోట్లు చెల్లించారు

బీఆర్ఎస్ సర్కార్ విడుదల చేసిన రూ. 75 వేల కోట్ల రైతు బంధు నిధుల్లో... రూ. 25 వేల కోట్లు ధనవంతులకే చేరాయని సీఎం అన్నారు. నాలాలు, రోడ్ల కోసం చేసిన భూసేకరణ స్థలాలకు, ధనవంతుల నిర్మించుకున్న ఇండ్ల లే అవుట్లకు, టాటా, బిర్లాలకు ఈ నిధులు చేరాయన్నారు. అయితే ప్రస్తుతం రైతుబంధు తమకు ప్రాధాన్యత కాదన్నారు.

అడ్మినిస్ట్రేషన్‌లో రూల్స్ బ్రేక్ చేయను

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పోస్టింగ్స్‌లో రూల్స్ బ్రేక్ చేయదల్చుకోలేదని రేవంత్ అన్నారు. ఆ అధికారాలు తమకు ఉన్నా... కేసీఆర్ చేసిన తప్పులు, తాను చేయ్యబోనన్నారు. రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్‌లలో బెస్ట్ ఆఫీసర్లతో పాలనను సక్రమంగా కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వానికి కీలకమైంది జిల్లాలని... ఆ జిల్లాలకు సామర్థ్యం కలిగిన కలెక్టర్లు, ఎస్పీలను ఇటీవల కేటాయించినట్టు చెప్పారు. అడ్మినిస్ట్రేషన్‌లో తన మార్క్ అవసరం లేదని... రాష్ట్ర అభివృద్ధిలో రేవంత్ మార్క్ చూపిస్తానన్నారు. కొందరు కోరుకుంటున్నట్లు మార్క్ కోసం వెళ్తే... తాను ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లేలోగా పలువురు ఆఫీసర్లు సెక్రటేరియట్‌ను కూడా మాయం చేస్తారన్నారు.

చాలా రాష్ట్రాల్లో ఫిరాయింపులు

ఫిరాయింపులకు తెలంగాణ ఒక్కటే ప్రత్యేకం కాదన్నారు. కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోనూ ఎమ్మెల్యేలు పార్టీలు ఫిరాయించారన్నారు. ఏపీలో నలుగురు టీడీపీ ఎంపీలను బీజేపీ విలీనం చేసుకుందని గుర్తు చేశారు. అస్సాంలో ఏకంగా పార్టీ ఎంపీలందరినీ బీజేపీలో కలుపుకున్నారని చెప్పారు. పాత బస్తీలో విద్యుత్ క్రమబద్ధీకరణ ప్రాజెక్ట్‌ను అదానీకి ఇవ్వాలని యోచిస్తున్నట్టు చెప్పారు. అయితే..మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను అదానీకి కారు చౌకగా కట్టబెట్టడాన్ని రాహుల్, కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుం దన్నారు. అయితే... రాష్ట్రంలో అదానీనీ పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నామన్నారు. అదానీతో పాటు ఇతర విద్యుత్ కంపెనీలు ప్రభుత్వంతో చర్చలు జరిపాయని వెల్లడించారు.

ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదు

పేదలకు అందిస్తోన్న ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదని సీఎం అన్నారు. అవసరం ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలని... చూసే వారిని బట్టి దీనికోణం ఉంటుందన్నారు. మోడీ 10 ఏండ్లలో 16 లక్షల కోట్లు కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఎవరు ప్రశ్నించలేదన్నారు. కానీ మహిళలు, రైతులు, పేదలకు ఇస్తే మాత్రం తప్పుబడుతున్నారని ఫైర్ అయ్యారు. గత అప్పులను పక్కన పెడితే... ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ భవిష్యత్ లో లాభాల బాటపట్టనుందన్నారు. ఉచిత ప్రయాణంతో 30 మందితో కూడిన ఆక్యూపెన్సీ... 80 శాతానికి పెరిగిందన్నారు. ఉచిత బస్సు టికెట్లకు ప్రతినెలా రూ. 300 నుంచి రూ. 350 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుందన్నారు. మహిళలు పుణ్య క్షేత్రాలను సందర్శించడంతో దేవాలయాల హుండీ ఆదాయం పెరిగిందన్నారు. అక్కడ జీఎస్టీ కూడా పెరిగిందన్నారు.

వాస్తవ అంచనాలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్

కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల్లో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ఉంటా యన్నారు. వాస్తవ అంచనాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని సీఎం వెల్లడించారు. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలకు మించి బడ్జెట్ ఉండకూడదని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. బడ్జెట్ వ్యవహారంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను తాము పక్కకు పెట్టినట్లు చెప్పారు. తెలంగాణా రాష్ట్రానికి 7 లక్షల కోట్లకు పైగా అప్పులున్నాయని... వాటి ఇంట్రస్ట్‌లో ఏమాత్రం తగ్గినా ప్రతి యేటా వెయ్యి కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదా అవుతుందన్నారు. వరంగల్, ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్ట్‌లు తెచ్చేందుకు కషి చేస్తున్నామన్నారు. ఈ ఎయిర్ పోర్ట్‌ల ఏర్పాటు రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా మారుతుందన్నారు.

మండలాలు, జిల్లాలపై డిలిమిటేషన్ కమిటీ వేస్తాం

రాష్ట్రంలో జిల్లాలను, మండలాలను తగ్గించే, పెంచే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదన్నారు. అయితే మండలాలు, జిల్లాల హేతుబద్ధీకరణపై డిలిమిటేషన్‌పై కమిటీ వేయనున్నట్లు చెప్పారు. జనాభా, విస్తీర్ణం, మౌలిక వసతులు వంటి ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా... ఎలాపడితే అలా మండలాలు, తండాలను కూడా గ్రామ పంచాయతీలుగా మార్చారన్నారు. ఎన్టీఆర్ టైంలో మండలాల ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. ఒక జిల్లాలో 3 లక్షల జనాభా ఉంటే... మరో జిల్లాల్లో కోటి జనాభా ఉందన్నారు. అసలు టోటల్ సిస్టంపై స్టడీ జరగలేదన్నారు.

కొత్త సభ్యుల నియామకం తర్వాతే కులగణన

ప్రస్తుత బీసీ కమిషన్‌లోని సభ్యుల కాలపరిమితి ఆగస్టుతో ముగియనుందని సీఎం తెలిపారు. అందువల్ల కొత్త సభ్యుల నియామకం తర్వాతే బీసీ కులగణన చేపడతామని స్పష్టం చేశారు. రైతు భరోసా, ఇతర కమిషన్లపై అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామన్నారు. తెరవెనక ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదన్నారు. ఏదైనా అసెంబ్లీలో చర్చించి... రాజ్యాంగం కల్పించిన 51 శాతం ఆమోదంతో నిర్ణయాలు ఉంటాయన్నారు.

ఒక శాతం వడ్డీ తగ్గినా నెలకు రూ.700 కోట్ల భారం తగ్గుదల

కాళేశ్వరానికి సంబంధించిన వాస్తవాలు అసెంబ్లీ ముందుకు తెస్తామని సీఎం చెప్పారు. చర్చల తరువాత డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళతామన్నారు. రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. మరో లక్ష కోట్ల వరకు పెండింగ్ బైల్స్ ఉన్నాయని చెప్పారు. నెలకు రూ.7 వేల కోట్ల అప్పులు కడుతున్నా మన్నారు. దాదాపు 7 శాతం-11 శాతం వడ్డీ వరకు రుణాలు తెచ్చారన్నారు. అవకాశం ఉన్నంత వరకు వడ్డీ తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఎక్కువ వడ్డీకి తీసుకున్న రుణాలు తక్కువ వడ్డీకి మార్చుకునే పనిలో ఉన్నామని, ఈ విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సంప్రదింపులు చేసే ప్రయత్నంలో ఉన్నామని అన్నారు. ఒక శాతం వడ్డీ తగ్గినా నెలకు రూ. 700 కోట్ల భారం తగ్గుతుందని చెప్పారు. కేంద్రంతో చర్చలు జరిపి రుణాలకు వడ్డీ తగ్గించే అంశం ఒక కొలిక్కి తీసుకువస్తామన్నారు. అవసరమైతే తక్కువ వడ్డీకి ఇచ్చే వారి నుంచి డబ్బు తీసుకుని... ఎక్కువ వడ్డీకి డబ్బు తెచ్చిన అప్పులు తీర్చేస్తామన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి సారించినట్టు చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఇటీవలే జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ మారగా తాజాగా చేవెళ్ల నుంచి గెలిచిన కాలె యాదయ్య కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం నాడిక్కడ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితో పాటు దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. యాదయ్య చేరికతో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యేల సంఖ్య ఆరుకు చేరింది. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 71కి పెరిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గం నుంచి యాదయ్య మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో కాంగ్రెస్ తరపున గెలిచిన ఆయన, ఆ తరువాత బీఆర్ఎస్ గూటికి చేరారు. 2018 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన యాదయ్య, 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 268 ఓట్ల తేడాతో బయటపడ్డారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన భీమ్ భరత్ నుంచి గట్టి పోటీని ఎదుర్కొన్నారు.

ఐదేండ్లలో ఆదాయాలు రెట్టింపు

(మొదటిపేజీ తరువాయి)

నమోదయ్యాయి. భారతీ ఎయిర్‌టెల్ నికర లాభాలు 10.5 శాతం తగ్గి రూ. 7,467 కోట్లుగా ప్రకటించింది. కాగా.. సంస్థ రెవెన్యూ 7.8 శాతం పెరిగి రూ.1.50 లక్షల కోట్లకు చేరింది. 2023-24లో వొడాఫోన్ ఐడియా మార్కెట్ వాటా స్వల్పంగా తగ్గినప్పటికీ.. రెవెన్యూ మాత్రం యథాతథంగా రూ.42,382 కోట్లుగా చోటు చేసుకుంది. భారత టెల్కోలు లాభాలు, రెవెన్యూలను దండిగానే ఆర్జిస్తున్నప్పటికీ.. వినియోగదారులపై మళ్లీ భారం మోపాలనే యోచన ఆందోళకరం. ఇది ప్రజల పొదుపు శక్తిని దెబ్బతీయనుంది.

నిగ్గు తేల్చాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ప్రభుత్వం చర్చకు సిద్ధమని, తాము సభ్యులకు మరోసారి హామీ ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పదేపదే చెప్పినా సభా కార్యకలాపాలకు కాంగ్రెస్ సభ్యులు అడ్డుపడుతూ సభను సజావుగా జరగనివ్వకపోవడం సరైంది కాదని, దీన్ని తాను ఖండిస్తున్నానని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. సభా కార్యకలాపాలకు అడ్డుతగలవద్దని ఆయా సభ్యులకు తాను విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు.

435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి శుక్రారం మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రజారోగ్య విభాగం, వైద్యవిద్య విభాగాల్లో ఈ పోస్టులున్నాయి. మల్టీ జోన్ -1 లో 270, మల్టీజోన్ -2లో 161 ఖాళీలున్నాయి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) లో నాలుగు పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని, మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. జులై 2వ తేదీ నుంచి జులై 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ లో చూడవచ్చు.

షెఫాలీ వర్మ (205), స్మృతీ మంధాన (149) చితకబాదారు. యువ ఓపెనర్ షెఫాలీ ధనాధన్ ద్వి శకతంతో విశ్వరూపం చూపించగా.. స్టార్ బ్యాటర్ మంధాన భీకర ఫామ్ కొనసాగించింది. సఫారీ బౌలర్లను ఉతికారేసిన ఓపెనర్లు భారత్‌కు ఏకైక టెస్టులో రికార్డు స్కోరు అందించారు. ఓపెనర్ల విధ్వంసక ఇన్నింగ్స్‌లో భారత్ తొలి రోజు 525/4 పరుగుల భారీ స్కోరు సాధించింది.

షెఫాలీ 205 మంధాన 149

సఫారీలను చితకబాదిన ఓపెనర్లు
భారత్ తొలి ఇన్నింగ్స్ 525/4





నవతెలంగాణ-చెన్నై : చెపాక్ స్టేడియంలో పరుగుల వరద పారింది. భారత మహిళల జట్టు రెడ్ బాల్ క్రికెట్‌లో తొలి రోజే రికార్డులను బద్దలు కొట్టింది. ఓపెనర్లు షెఫాలీ వర్మ (205, 197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్సులు) డబుల్ సెంచరీతో కదం తొక్కగా.. స్మృతీ మంధాన (149, 161 బంతుల్లో 27 ఫోర్లు, 1 సిక్స్) సఫారీలపై మరో సెంచరీ మోత మోగించింది. జెమీమా రొడ్రిగస్ (55, 94 బంతుల్లో 8 ఫోర్లు) అర్థ సెంచరీతో రాణించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (42 నాటౌట్, 76 బంతుల్లో 2 ఫోర్లు), రిచా ఘోష్ (43 నాటౌట్, 33 బంతుల్లో 9 ఫోర్లు) అజేయ భాగస్వామ్యంతో దంచికొట్టారు. బ్యాటర్లు అందరూ కలిసికట్టుగా కదం తొక్కటంతో దక్షిణాఫ్రికా మహిళలతో ఏకైక టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించింది. 98 ఓవర్లలో 4 వికెట్లకు 525 పరుగులు చేసింది.

చెపాక్ పిచ్‌పై టాస్ నెగ్గిన భారత మహిళలు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. తొలి గంట ఆటలో భారత ఓపెనర్లు ఆచితూచి ఆడారు. ఫుల్‌టాస్ బాల్స్‌ను సైతం బాదేందుకు చూడలేదు. డ్రింక్స్ విరామానికి భారత్ 50/0తో నిలిచింది. పిచ్‌ను అర్థం చేసుకుని క్రీజులో కుదురుకున్న ఓపెనర్లు ఆ తర్వాత ఊచకోత మొదలెట్టారు. విధ్వంసక షెఫాలీ వర్మ 197 బంతుల్లోనే ద్వి శతకం నమోదు చేసి రికార్డు నెలకొల్పింది. బౌండరీల రూపంలోనే షెఫాలీ ఏకంగా 140 పరుగులు పిండుకుంది. స్మృతీ మంధాన సైతం వైట్‌బాల్ ఫామ్‌ను కొనసాగించింది. 27 ఫోర్లు, ఓ సిక్సర్‌తో కదం తొక్కింది. ఓపెనర్లు శతక మోత మోగించటంతో భారత్ తొలి వికెట్‌కు రికార్డు 292 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసింది. షెఫాలీ, మంధాన ఊచకోత ముంగిట సఫారీ పేసర్లు తేలిపోయారు. సతీశ్ శుభ (15) నిరాశపరిచినా.. జెమీమా రోడ్రిగస్ (55) అర్థ సెంచరీతో మెరిసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (42 నాటౌట్), రిచా ఘోష్ (43 నాటౌట్) ఐదో వికెట్‌కు అజేయంగా 75 పరుగులు జోడించారు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో తొలి రోజే 525 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. నేడు ఉదయం సెషన్లో ధనాధన్ ఇన్నింగ్స్‌లతో 650 ప్లస్ స్కోరు సాధించి డిక్లరేషన్ ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. దక్షిణాఫ్రికా బౌలర్లలో టక్కర్ (2/141), క్లెర్క్ (1/62) వికెట్లు పడగొట్టారు.

ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఆఖరు ఘట్టానికి చేరుకుంది. గ్రూప్, సూపర్8 దశల్లో అజేయంగా నిలిచిన రెండు జట్లు టైటిల్ పోరుకు చేరుకున్నాయి. బ్రిడ్జిటౌన్‌లో నేడు ఎవరు నెగ్గినా.. అజేయంగా టీ20 ప్రపంచకప్ టైటిల్ సాధించిన రికార్డు సృష్టించనున్నారు. తొలిసారి ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకున్న దక్షిణాఫ్రికాతో తొలి ఎడిషన్ చాంపియన్ టీమ్ ఇండియా అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. భారత్, దక్షిణాఫ్రికా టీ20 ప్రపంచకప్ టైటిల్ వేట నేడు.

2014.. చివరగా ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమ్ ఇండియా పోటీపడిన ఏడాది. సరిగ్గా పదేండ్ల తర్వాత భారత్ మళ్లీ టైటిల్ వేటకు సిద్ధమైంది. దశాబ్దం క్రితం శ్రీలంక, ఏడాది క్రితం ఆస్ట్రేలియా మిగిల్చిన గాయాలు మానేందుకు బ్రిడ్జ్‌టౌన్‌లో ఓ సువర్ణావకాశం లభించింది. అహ్మదాబాద్‌లో ఓ టైటిల్ చేజార్చుకున్న రోహిత్, ద్రవిడ్ ద్వయం.. నేడు బార్బడోస్‌లో పొట్టి కప్పును వదలొద్దు!.

వదలొద్దు ఈ కప్పు!





- ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్ నేడు
- టైటిల్ వేటలో భారత్, దక్షిణాఫ్రికా ఢీ

రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

గ్రూప్, సూపర్ 8 దశల్లో అజేయంగా నిలిచిన రికార్డు. ఫైనల్‌కు చేరుకునే క్రమంలో భీకర ఫామ్. టైటిల్ పోరు ముంగిట ఇరు జట్ల శిబిరాల్లో చారిత్రక భావోద్వేగం!. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్ సమరానికి ఇంతకుమించిన స్ఫూర్తి ఏముంటుంది!. భారత్, దక్షిణాఫ్రికా నేడు ప్రపంచకప్ ఫైనల్లో ఢీకొట్టనున్నాయి. పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి అగ్రశ్రేణి, కఠిన ప్రత్యర్థులను దాటుకుంటూ టీమ్ ఇండియా ఫైనల్‌కు చేరుకోగా... దక్షిణాఫ్రికా ప్రతి మ్యాచ్‌లోనూ ఒత్తిడిని జయిస్తూ ఉత్కంఠ విజయాలు సాధించి ఇక్కడికి వచ్చింది. 2007లో తొలిసారి టైటిల్ అందుకున్న టీమ్ ఇండియా.. మళ్లీ ట్రోఫీ ముద్దాడేందుకు కసితో కనిపిస్తుంది. ఇప్పటి వరకు ఐసీసీ ప్రపంచకప్‌ను అందుకోని దక్షిణాఫ్రికా..తమ దేశ క్రికెట్ చరిత్రను తిరగరాసేందుకు పట్టుదలగా కనిపిస్తుంది. వర్షం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో బ్రిడ్జ్‌టౌన్‌లో భారత్, దక్షిణాఫ్రికా నేడు టీ20 ప్రపంచకప్ ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

దశాబ్ద దాహం తీరేనా?

ప్రపంచ క్రికెట్ పవర్‌హౌస్ భారత్. అభిమానులకు క్రికెట్ ఓ ఆట కంటే ఎక్కువ. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో దుమ్మురేపినా.. ఐసీసీ ఈవెంట్లలో కప్పు కొట్టడం లేదని అభిమానుల ఆవేదన. 2011 ఐసీసీ వరల్డ్‌కప్, 2013 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత్ మరో టైటిల్ సాధించలేదు. 2014, 2023లలో వరుసగా టీ20, వన్డే వరల్డ్‌కప్ ఫైనల్స్‌కు చేరినా నిరాశే ఎదురైంది. టీ20 ప్రపంచకప్‌లో 2016, 2022లో సెమీస్‌కు చేరింది. వన్డే వరల్డ్‌కప్‌లో 2015, 2019లో సెమీఫైనల్స్‌కు చేరుకుంది. కానీ, భారత క్రికెటర్లు.. అభిమానుల టైటిల్ దాహం తీరలేదు. నిరుడు నవంబర్‌లో టైటిల్ వేటలో విఫలమైన రోహిత్ సేన నేడు మరోసారి పొట్టి ఫార్మాట్‌లో ఈ ప్రయత్నానికి సిద్ధమైంది.

అజేయంగా టైటిల్ పోరుకు చేరుకున్న భారత్‌కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఫామ్ మినహా ఏ ఆందోళన లేదు. గ్రూప్ దశ నుంచి విరాట్ కోహ్లి పరుగుల వేటలో నిరాశపరుస్తున్నాడు. నేడు ఫైనల్లోనైనా కోహ్లి కసితీరా కొడతాడనే అంచనాలు భారీగా ఉన్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మ దూకుడు భారత్‌కు అతిపెద్ద బలం. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌పై రోహిత్ శర్మ ఉప్పెనలా విరుచుకుపడ్డాడు. మెగా మ్యాచుల్లో ఎదురుదాడి వ్యూహం అమలు చేసే రోహిత్ శర్మ నేడు ముందుండి దాడి చేయనున్నాడు. రిషబ్ పంత్ గత మ్యాచుల్లో టచ్ కోల్పోయాడు. పంత్ తనదైన విలక్షణ షాట్లతో మెరిస్తే టాప్ ఆర్డర్‌లో ఎదురుండదు. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, శివం దూబె మంచి ఫామ్‌లో ఉన్నారు. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ సైతం బ్యాట్‌తో మెరుస్తున్నారు. నలుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు భారత ఇన్నింగ్స్‌ను 20 ఓవర్ల పాటు దూకుడుగా నడిపించటం గతంలో ఎన్నడూ చూడనిది. బంతితో భారత్ జోరు మామూలుగా లేదు. జశ్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌ల పేస్‌కు.. కుల్దీప్, అక్షర్ పటేల్ స్పిన్ మాయ జతకలిసింది. ప్రత్యర్థి బ్యాటర్లు మన బౌలర్లను ఎదుర్కొనేందుకు తంటాలు పడుతున్నారు. ఈ ప్రపంచకప్‌లో భారత్, దక్షిణాఫ్రికా తలపడటం ఇదే తొలిసారి.

ఇంకొక్క అడుగే

ప్రపంచ క్రికెట్ అగ్రజట్లలో దక్షిణాఫ్రికా ఒకటి. దక్షిణాఫ్రికా క్రికెట్‌లో చీకటి అధ్యాయాలు సైతం ఉన్నాయి. కానీ దిగ్గజ క్రికెటర్లు ప్రాతినిథ్యం వహించినా.. ఇప్పటి వరకు ఓ ఐసీసీ ప్రపంచకప్ టైటిల్ సాధించకపోవటం ఆ జట్టుకు తీరని వేదన. 1992, 1999, 2007, 2015, 2023 వన్డే వరల్డ్‌కప్‌లో.. 2009, 2014 టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ ఇప్పటి వరకు సఫారీలకు వరల్డ్‌కప్‌లో ఉత్తమ ప్రదర్శన. ఆ జట్టు తొలిసారి ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకుంది. తుది అడుగులోనూ విజయవంతమై చాంపియన్‌గా నిలవాలని దక్షిణాఫ్రికా పట్టుదలగా కనిపిస్తుంది. 1998 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ విజయం ఒక్కటే సఫారీ చరిత్రలో అత్యుత్తమం. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించే అవకాశం ముంగిట నిలిచింది మార్క్రమ్ సేన. నిజానికి దక్షిణాఫ్రికా ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. సెమీఫైనల్లో అఫ్గాన్‌తో మ్యాచ్ మినహా అన్ని మ్యాచుల్లోనూ ఆఖరు వరకు పోరాడి విజయాలు సాధించింది. ఇది సఫారీలకు నేడు కలిసి రానుంది.

దక్షిణాఫ్రికా బ్యాటింగ్, బౌలింగ్ ఎప్పటిలాగే బలోపేతంగా ఉంది. క్వింటన్ డికాక్, రీజా హెండ్రిక్స్ ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ ఎడెన్ మార్క్రమ్, ట్రిస్టన్ స్టబ్స్ ప్రతికూల పరిస్థితుల్లో నిలబడే బ్యాటర్లు. హెన్రిచ్ క్లాసెన్, డెవిడ్ మిల్లర్ ఊచకోతకు మారుపేరు. బౌలింగ్ విభాగంలో మార్కో జాన్సెన్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. కగిసో రబాడతో కలిసి కొత్త బంతితో నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షంశీలతో కలిసి బంతి పంచుకుంటున్న ఎన్రిచ్ నోకియా మిడిల్ ఓవర్లలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. స్థాయికి తగ్గ ప్రదర్శన చేయగలిగితే దక్షిణాఫ్రికా తొలి ఐసీసీ వరల్డ్‌కప్ వేటలో భారత్‌కు దీటుగా పోటీ ఇవ్వగలదు.

పిచ్ స్వభావం

ఈ వరల్డ్‌కప్‌లో ఇక్కడ జరుగుతున్న తొమ్మిదో మ్యాచ్ ఇది. ఈ పిచ్‌పై భారీ స్కోర్లు నమోదైన రికార్డు ఉంది. కానీ ప్రపంచకప్‌లో పెద్దగా పరుగులు రాలేదు. అఫ్గాన్‌పై భారత్ చేసిన 181 పరుగులే ఇప్పుడు అత్యధికం. దక్షిణాఫ్రికా గ్రూప్, సూపర్8 దశల్లో ఇక్కడ ఆడలేదు. ఆ జట్టుకు ఈ పిచ్‌పై ఇదే తొలి మ్యాచ్ కానుంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

వర్షం ముప్పు?!

భారత్, ఇంగ్లాండ్ సెమీస్ మ్యాచ్‌కు వరుణుడు తీవ్ర ఆటంకం కలిగించాడు. నేడు ఫైనల్ మ్యాచ్‌కు సైతం వర్షం ప్రమాదం పొంచి ఉంది. రాత్రి నుంచి ఉదయం వరకు భారీ వర్షం సూచనలు ఉన్నప్పటికీ.. మ్యాచ్ షెడ్యూల్ సమయం (స్థానిక కాలమానం) 10.30 గంటలకు వర్షం సూచనలు 30 శాతం మాత్రమే ఉన్నాయి. మ్యాచ్ షెడ్యూల్ సమయానికి మొదలైనా.. వర్షం అడ్డంకితో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. టైటిల్ పోరుకు రిజర్వ్ డే ఉంది. కనీసం పది ఓవర్ల మ్యాచ్ సాధ్యపడని పరిస్థితుల్లో మ్యాచ్ ఆదివారానికి వెళ్లనుంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లి, రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, శివం దూబె, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రా.

దక్షిణాఫ్రికా : క్వింటన్ డికాక్, రీజా హెండ్రిక్స్, ఎడెన్ మార్క్రమ్, ట్రిస్టన్ స్టబ్స్, హెన్రిచ్ క్లాసెన్, డెవిడ్ మిల్లర్, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, కగిసో రబాడ, ఎన్రిచ్ నోకియా, తంబ్రియజ్ షంశి.

నవచిత్రం



కమిటీ కుర్రోళ్ల ప్రేమ గారడీ..

'అమ్మాయికి మనసులోని ప్రేమను చెప్పాలంటే, ఆమె ఆ ప్రేమకు వెంటనే ఎస్ చెప్పాలంటే సాధారణ విషయం కాదు.. మరీ పుట్టి పెరిగిన పల్లెటూర్లో అయితే ఎవరెక్కడ చూస్తారోనని అమ్మాయి, అబ్బాయి ప్రేమ ఊసులు చెప్పుకోవటం మరీ కష్టం. అలాంటి కష్టాన్ని హాయిగా అనుభవిస్తోన్న కుర్రాడు మనసులోని 'ప్రేమ గారడీ..'ని నచ్చిన అమ్మాయికి ఎలా చెప్పాడనేది తెలుసుకోవాలంటే విడుదలకు సిద్ధమవుతోన్న 'కమిటీ కుర్రోళ్ళు' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందుతోన్న ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. పక్కా ప్లానింగ్‌తో మేకర్స్ అనుకున్న సమయానికి కన్నా ముందే సినిమా షూటింగ్‌ని పూర్తి చేయటం విశేషం. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఇటీవల ఈ సినిమా నుంచి 'ప్రేమ గారడీ..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు.

అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రంలోని 'ప్రేమ గారడీ..' పాటను కిట్టు విస్సాప్రగడ రాయగా, అర్మాన్ మాలిక్ పాడారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. త్వరలోనే విడుదలకు సిద్ధమవుతుంది. రీసెంట్‌గా రిలీజైన 'గొర్రెలా..' అంటూ పాటకు, టీజర్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది అని చిత్ర యూనిట్ తెలిపింది. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేష్ కుమార్ పరిమి, శ్యామ్ కళ్యాణ్, రఘువరన్, శివకుమార్ మట్ట, అక్షయ్ శ్రీనివాస్, రాధ్య, తేజస్వి రావు, టీనా శ్రావ్య విషిక, షణ్ముకి నాగుమంత్రి ముఖ్య పాత్రల్లో సాయి కుమార్, గోపరాజు రమణ, బలగం జయరాం, శ్రీ లక్ష్మి, కంచెరపాలెం కిషోర్, కిట్టయ్య, రమణ భార్గవ్, జబర్దస్త్ సత్తిపండు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - రాజు ఎడురోలు, మ్యూజిక్ డైరెక్టర్ - అనుదీప్ దేవ్, ప్రొడక్షన్ డిజైనర్ - ప్రణయ్ నైని, ఎడిటర్ - అన్వర్ అలీ, ఫైట్స్ - విజయ్, నృత్యం - జె.డి మాస్టర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - మన్యం రమేష్.

స్టెప్పా మార్.. సందడి షురూ



రామ్

రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియన్ ఫిల్మ్ 'డబుల్ ఇస్మార్ట్'తో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్ట్ 15న సందర్భంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌ని ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. ఫస్ట్ పార్ట్‌కి చార్ట్-బస్టర్ ఆల్బమ్, అద్భుతమైన బీజీఎం అందించిన మణిశర్మ ఇప్పుడు మళ్లీ అదరగొట్టబోతున్నారు. ఫస్ట్ సింగిల్ 'స్టెప్పా మార్'ని జూలై 1న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సాంగ్ ఎలక్ట్రిఫైయింగ్ ట్యూన్‌గా మాస్ ప్రేక్షకులకు ఇన్స్టంట్ ఎడిక్షన్ కానుంది. రామ్ డ్యాన్స్ మూవ్స్ మెయిన్ హైలైట్‌గా ఉంటాయి. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేయగా, భాస్కర భట్ల లిరిక్స్, అనురాగ్ కులకర్ణి వోకల్స్‌ని అందించారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ మూవీలో సంజయ్ దత్ మెయిన్ విలన్, కావ్య థాపర్ ఫిమేల్ లీడ్ గా నటించారని చిత్ర బృందం తెలిపింది.

భిన్న కాన్సెప్ట్‌తో గ్యాంగ్‌స్టర్



కాశ్వీ కాంచన్, చంద్రశేఖర్ రాథోడ్

చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'గ్యాంగ్ స్టర్'. ఈ చిత్రంలో అభినవ్ జనక్, అల్ల సతీష్ కుమార్, సూర్య నారాయణ తదితరులు ఇతర పాత్రల్లో కనిపించనున్నారు.

వైల్డ్ వారియర్ ప్రొడక్షన్స్‌లో రవి, నరసింహ సమర్పణలో ఈ చిత్రానికి కొరియోగ్రఫీ, ఎడిటింగ్, ఫైట్స్ అందించడమే కాకుండా నిర్మిస్తూ, దర్శకత్వం వహించారు చంద్రశేఖర్ రాథోడ్. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్టులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర టీజర్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో రచయిత మామిడి హరికృష్ణ మాట్లాడుతూ, 'కలలు కనాలి.. వాటిని సాకారం చేసుకోవాలి అని అన్నట్లు..చంద్రశేఖర్ రాథోడ్ తను హీరో కావాలి, ఫిలిం మేకర్ కావాలని కలకన్నాడు. ఈ చిత్రంతో ఆ కలను నిజం చేసుకున్నాడు. మేం ఈ సినిమా చూశాం. చాలా బాగుంది. ఇటీవల కాలంలో నాకు బాగా నచ్చిన టీజర్ ఈ మూవీదే. ఈ టీజర్‌ని కూడా తనే కట్ చేశాడు. ఖచ్చితంగా తన కష్టానికి ఫలితం ఉంటుంది' అని తెలిపారు.

'ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన దర్శకుడు చంద్రశేఖర్‌కి థ్యాంక్స్. 24 గంటలు కష్టపడేంత ప్యాషన్ సినిమా మీద ఉన్న వ్యక్తి ఆయన. ఈ సినిమా బిగ్ హిట్ కావాలని కోరుకుంటున్నా' అని హీరోయిన్ కాశ్వీ కాంచన్ చెప్పారు.

హీరో, దర్శకుడు, నిర్మాత చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ, 'మనం ఏదైనా బలంగా అనుకుంటే జరిగి తీరుతుంది అనేందుకు ఈ సినిమా ఎగ్జాంపుల్. సినిమా టైటిల్స్‌లో నాలుగైదు పేర్లు నావే ఉండాలని నేను అనుకోలేదు. డబ్బులు లేక ఫైట్స్, ఎడిటింగ్, కొరియోగ్రఫీ నేనే చేసుకున్నా. ఈ సినిమా టీజర్‌ను విజయేంద్రప్రసాద్‌కి చూపించాను. ఆయన హగ్ చేసుకుని టీజర్ బాగుందంటూ ఆశీర్వదించారు. నా ముందే దిల్ రాజుకి ఫోన్ చేసి ఈ సినిమా టీజర్ చూశాను బాగుంది. మీరూ చూడండి అని అడిగారు. దిల్ రాజు టీజర్ చూసి బాగుందన్నారు. వారి సంస్థలో మా సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. వారి టీమ్ చూసి డిసైడ్ చేయబోతున్నారు. దర్శకుడు రాజమౌళి కూడా మా సినిమా టీజర్ చూస్తారని ఆశిస్తున్నా. త్వరలోనే మీ ముందుకు మా సినిమాను తీసుకు రాబోతున్నాం. కల్కితో పాటు మా మూవీ టీజర్ కొన్ని థియేటర్స్‌లో ప్లే చేస్తున్నాం' అని అన్నారు.



తమన్నా

హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాలు

మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌తో కలిసి డైరెక్టర్ సంపత్ నంది క్రియేట్ చేసిన హిట్ చిత్రం 'ఒదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్‌గా రూపొందిస్తున్న 'ఒదెల రైల్వే స్టేషన్-2 కోసం' కోసం తమన్నా చేతులు కలిపారు. అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, షెడ్యూల్డ్ వర్కింగ్ వీడియోకి ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన వచ్చింది, సీక్వెల్‌పై ఎగ్జైట్‌మెంట్‌ని పెంచింది.

హై-బడ్జెట్, మల్టీ లాంగ్వేజ్ మూవీ ఇప్పుడు హైదరాబాద్‌లో కీలకమైన యాక్షన్ షెడ్యూల్‌ని ప్రారంభించింది. సినిమాలోని కొన్ని కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. టాప్ క్లాస్ యాక్షన్ డైరెక్టర్స్‌తో కొరియోగ్రఫీ చేస్తున్న ఈ సన్నివేశాలు ప్రేక్షకులకు విజువల్ ట్రీట్‌గా ఉంటాయి. ఇన్నోవేటీవ్ స్టంట్స్, బ్రీత్ టేకింగ్ సినిమాటోగ్రఫీ ఆడియెన్స్‌కి గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించనున్నాయి. ఈ సన్నివేశాలు పెర్ఫెక్షన్, రియలిజంతో అద్భుతంగా చిత్రీకరించడానికి టీం అన్ని జాగ్రత్తలు తీసుకుంది. ఈ యాక్షన్-ప్యాక్డ్ మూమెంట్స్‌కి ప్రాణం పోసేందుకు ఎక్స్‌పర్ట్ స్టంట్ కోఆర్డినేషన్ టీం పని చేస్తోంది. ఆడియన్స్‌కు సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చేలా ఈ సినిమా కోసం తమన్నా ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. ఆకట్టుకునే కథాంశంతో ఇంటెన్స్ యాక్షన్‌ని బ్లెండ్ చేయగల ఎబిలిటీ ఉన్న దర్శకుడు సంపత్ నంది ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ని సూపర్ విజన్ చేస్తున్నారు. ఆయన గైడెన్స్‌లో ఈ సినిమా ఎమోషన్స్, థ్రిల్స్, అడ్రినలిన్-పంపింగ్ యాక్షన్ సన్నివేశాల రోలర్-కోస్టర్ రైడ్‌ను అందించడానికి రెడీ అవుతోంది. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ, యువ, నాగ మహేష్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: డి మధు, డీవోపీ: సౌందర్ రాజన్. ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్.

దీక్ష షూటింగ్ పూర్తి



తులసి, ఆర్.కె.గౌడ్, కిరణ్ కుమార్

ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్ బ్యానర్స్‌పై దర్శక, నిర్మాత, తెలంగాణ ఫిలిమ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'దీక్ష'. పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మాతలు. కిరణ్ కుమార్, అలేఖ్యరెడ్డి జంటగా నటిస్తున్నారు. ఇటీవల తెలంగాణ ఫిలింఛాంబర్‌లో చిత్ర ప్రోగ్రెస్‌ను మీడియాకి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. డబ్బింగ్ జరుగుతోంది. దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో మూవీని తెరకెక్కించాం. ఈ మూవీలో హీరో కిరణ్ చేసిన స్టంట్స్, భీముడు, ఆంజనేయుడు వంటి గెటప్స్‌లో ఆకట్టుకునే సీన్స్ హైలైట్ అవుతాయి. ఈ సినిమాలో నలుగురు హీరోయిన్స్‌ను పరిచయం చేస్తున్నాం. సినిమా పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాం. అలాగే 'మహిళా కబడ్డీ' అనే మరో చిత్రాన్ని18 భాషల్లో తెరకెక్కించబోతున్నాం' అని తెలిపారు.

'గతంలో నేను తెలుగులో పది, తమిళంలో రెండు సినిమాలు హీరోగా చేశాను. ఈ సినిమాతో నాకు మంచి పేరుతో పాటు అవార్డ్స్ వస్తాయని ఆశిస్తున్నాను. ఇందులో రియలిస్టిక్‌గా ఒక భారీ ఫైట్ సీక్వెన్స్ చేశాం' అని హీరో కిరణ్ చెప్పారు. రైటర్ రాంప్రసాద్ మాట్లాడుతూ, 'గతంలో ఎన్‌టిఆర్ నటించిన "దీక్ష" టైటిల్ ఈ చిత్రానికి యాప్ట్ అవుతుంది. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు "దీక్ష"తో ఏదైనా సాధ్యమే అన్నదే ఈ చిత్ర కథ' అని అన్నారు. 'ఈ సినిమాలో హీరో కిరణ్, హీరోయిన్ అలేఖ్యరెడ్డితో పాటు మరో లీడ్‌రోల్‌లో నేను నటించాను. నాకు మంచి డైలాగ్స్ ఉంటాయి. కథ కూడా ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని నటి తులసి చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.